ప్రజాశక్తి

Vol. 1, no. 332

(Nov. 10, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 332

(Nov. 10, 1946)

Bejavāḍa, 1946

Record no. 683

Regd. No 4486 16 పేజీలు 3 అణాలు

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 1] బెజవాడ 10-11-46 ఆదివారం [సంచిక 332

గూండాలనుండి ప్రజలను రక్షించాలి

మత సామరస్యం ఏర్పరచాలి

కామ్రేడ్ జోషీ ప్రకటన



బొంబాయి, నవంబరు 8

భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కామ్రేడ్ జోషీ ఇలా ప్రకటించారు.

"సోదరుల కలహాలు ఎక్కడికి దారి తీస్తాయో, నౌఖలీ బీహారు విషాద ఘటనలు ప్రతిభారతీయునికి స్పష్టంచేశాయి. తూర్పు బెంగాలులోను, బీహారులోను జరిగిన దురంతాలను కాంగ్రెస్, లీగునాయకులు సంయుక్త ప్రకటనల ద్వారా పూర్తిగా ఖండించారు.

"బీహారు ఘటనలు మహాత్మాగాంధీకన్నా తీవ్రంగా ఎవరూ ఖండించలేదు. వెంటనే ఈకలహాలు ఆగకపోతే ఉపవాసం చేస్తానని గాంధీజీ ప్రకటించారు.

శాంతిస్థాపనకు తోడ్పడతాం

"మా పార్టీ తొలినుంచీ, అచంచలంగా మతసామరస్యంకోసం పనిచేస్తూంది. కలకత్తా, బొంబాయి ఘటనలు జరుగుతున్న గడ్డురోజుల్లో కూడ మా పార్టీ ఐక్యత కోసం అహోరాత్రులు పాటుపడింది. శాంతిస్థాపనకై కాంగ్రెసునాయకులు చేస్తున్న విజ్ఞప్తులను మేము పూర్తిగా బలపరుస్తున్నాము. మత సామరస్యాన్ని, సుహృద్భావాన్ని నెలకొల్పేందుకు సాయశక్తులా మేము తోడ్పడతాము.

కసిపట్టడం సరికాదు

"ఇటీవల కసితీర్చుకోవాలని, దెబ్బకు దెబ్బ తీయాలని ఉపన్యాసాలిచ్చినవారు తమ మాటలేగతికి తెచ్చెనవో బీహారు నౌఖలీలను చూచి గ్రహించుకోవాలి. ఒకరిపై ఒకరు పోరాటం సాగించాలన్న మాటలను, ప్రజాశత్రువులీ ఘోరహత్యలకు బాగా ఉపయోగించుకున్నారు. ఈ ఘటనలను ప్రోత్సహిస్తూ, కలహాలను వ్యాపింపచేస్తూ తెరవెనుక నాటకమాడించేవారిని ఎవ్వరూ మరచిపోకూడదు.

"ఆజాద్‌హిందు, భారత నావికులకోసం నడిపిన అద్భుతమైన ఐక్య ప్రదర్శనల తర్వాత, ఈ అమాయకుల హత్యాకాండకన్నా నీచపరిస్థితేముంటుంది. ఇరుగు పొరుగువారిని ఖూనీలు చేయడమంటే మన స్వతంత్రవాంఛను అపహాస్యభాజనం చెయ్యడమే అవుతుంది.

"కాంగ్రెస్ - లీగులలో విజాయితీ గల వారందరు నాయకుల శాంతి విజ్ఞాపనల నాలకించి గూండాల చేతపడకుండా ప్రజారక్షణకు పూనుకుంటే పరిస్థితిని త్వరలో శాంతిపరచవచ్చును.

అందరూ ఐక్యతకోసం పాటుబడాలి

"ఈ అంతఃకలహాలను మానుకొని భారతావనిని దాస్యంలోముంచిన సామ్రాజ్యవాదుల ఎత్తులను పరాజయం చేస్తామని భారతప్రజలందరు ప్రతిజ్ఞ తీసుకోవాలి. అలా చేసినప్పుడే అమాయిక ప్రజలు కార్చిన రక్తప్రవాహం వ్యర్థం కాకుండా పోతుంది."

మిలటరీ రక్షించలేదు

గాంధీజీ ఉద్బోధ

చౌముహాని ; నవం. 7

మహాత్మాగాంధీ చాంద్‌పూరులో కాంగ్రెస్ వాదులను కలుసుకున్నారు. ప్రజలను మిలిటరీ పోలీసు రక్షించలేదని, తమ్ము తామే రక్షించుకోవాలని వారికి గాంధీజీ చెప్పారు.

తర్వాత చౌముహానిలో గాంధీజీ దిగారు. ఇక్కడి పరిస్థితినిగూర్చి నివేదికలను తీసుకుంటున్నారు.

కొట్లాటలతో పాకిస్తాన్ రాదు

బెంగాల్ లీగుమంత్రి ఉపన్యాసం

ఈరోజు గాంధీజీ ప్రార్థనసభ జరిపాడు. హిందువులు ముస్లిములు సభకువచ్చారు. అందులో బెంగాల్ వాణిజ్యమంత్రి షంషుద్దీన్ అహ్మద్ ఇలా ఉపన్యసించాడు.

"మైనారిటీలను చంపడంతో పాకిస్తాన్ రాదు, హిందూస్తానూ రాదు. కొట్లాటలవల్ల రెండు మతాలవారు దాస్యంలోపడి ఉండవలసివస్తుంది. ఈకొట్లాటలను జిన్నగాని, గాంధీజీగాని, నెహ్రూగాని అంగీకరించరు. అందరూ ఈ పశుకృత్యాలను ఖండించారు.

"నౌఖలీలో నూటికి 18 మందున్న హిందువులు, ముస్లిములకు భయపడిపోయారంటే ముస్లిములకు సిగ్గుచేటు. మీరు హిందువులను కాపాడతామని వారిని పిల్చుకొని రావాలి."

మలబార్ రైతు నాయకుని హత్య

జమీందారు గూండాలు గొంతునులిమిచంపారు

కాలికట్, నవంబరు 1

మలబార్ రైతునాయకుడు, సుప్రసిద్ధ కమ్యూనిస్టు కామ్రేడ్ పి. నారాయణనంబియార్ 19 వ అక్టోబరు నాడు చంపివేయబడి, ఆయన శవం ఒక నూతిలో పారవేయబడి దొరికింది. ఇరుక్కూర్ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ల మీటింగుకు అక్టోబరు 19 ఉదయం ఆయన ఇరుక్కూరు వెళ్ళి 20 వ తేదీ సాయంకాలం ఇంటికి బయలుదేరాడు. కాని దారిలోనే అంతర్ధానమైపోయాడు.

రెండురోజుల అనంతరం బ్లాధూర్‌లో ఒక నూతిలో నీరు తోడుకొనేందుకు వెళ్ళిన స్త్రీలు అందులో ఆయన శవం తేలుతూండడం చూశారు. ఆ వార్త వెంటనే పోలీసు స్టేషనుకు తెలియదరచినా మునసబునుంచి రిపోర్టురాలేదనే నెపంతో 24 వరకు పోలీసు కిలగచేసుకోలేదు. ఆయన శరీరం నిండా గాయాలున్నాయి. పీక పిసికివేయబడింది.

ఈ హత్య చేయించినది కలాయత్ జమీందారేనని నమ్మబడుతూంది. ఇదివరలో ఒకసూరు ఈ జమీందారు గుండాలను పంపి కిసాన్ నాయకులను చంపడానికి గట్టి ప్రయత్నాలు చేసి విఫలుడయ్యాడు. చంపివేయబడిన కామ్రేడ్ నంబియార్ జమీందారుతో పోటీచేసి, నెగ్గి ఇరక్కూర్ కోఅపరేటివ్ సొసైటీకి డైరక్టరయ్యాడు. బ్లాధూర్ కమ్యూనిస్టు శాఖ కార్యదర్శిగా, చిరక్కల్ తాలూకా కిసాన్‌సభా సభ్యుడుగా, కల్లాయత్ గ్రామ అహారకమిటీ అధ్యక్షుడుగా ఆయన జమీందారీ దురంతాల నెదిరించి రైతులను విజయవంతంగా నడిపించాడు.

సకాలంలో పోలీసులకు రిపోర్టుచేయని బ్లాధూర్ మునసబు కిలాయట్ జమీందారు కుటుంబంలోనివాడే.

బీహారు పరిస్థితి చక్కబడుతున్నది

పాట్నా : నవంబరు, 8

బీహారులో మతకలహాలు రేగిన ప్రాంతాలన్నిటా కొత్త ఘటనలేవీ జరగడంలేదు. శాంతి నెలకొంటున్నట్టు వార్తలు వస్తున్నవి.

నెహ్రూ మొదలైన కాంగ్రెసునాయకులూ, రాష్ట్ర హిందూ-ముస్లిం నాయకులూ తీవ్రంగా శాంతికై పనిచేస్తున్నారు.

విశ్వవిద్యాలయంలో విద్యార్థులకునెహ్రూ ఉపన్యసిస్తూ ఇరుగు పొరుగువారిని చూచి ప్రజలు అనుమానపడడం, భయపడడం పోవాలన్నారు. ప్రజల్లో శాంతి నెలకొల్పమని విద్యార్థులను హెచ్చరించారు. ప్రజల నైతికశక్తిని పెంపొందించాలన్నారు.

మిలకరీకాల్పులు కూడదు

మిలటరీ కాల్పులు తగవంటూ కొందరు నెహ్రూ వ్యతిరేక ప్రదర్శనంచేసి 'నెహ్రూ వెళ్ళిపో' అని కేకలువేశారు. "మిలటరీని విధిలేకనే ఉపయోగించవలసి వచ్చింది. అందుకు నేను విచారపడుతున్నాను" అని నెహ్రూ అన్నారు.

పౌర విమానాలను ప్రభుత్వపరం చెయ్యాలి

న్యూఢిల్లీ, నవంబరు 8

ఈరోజు ఢిల్లీ ఎసెంబ్లీలో ప్రజల ప్రయాణాలకు ఉపయోగించే విమానాలను వ్యక్తులు కాక ప్రభుత్వమే నడపాలని సర్దార్ మంగళ్ సింగు ఒక తీర్మానం తెచ్చాడు. దివాన్ చమన్‌లాల్ (కాంగ్రెసు) ఒక సవరణపెడ్తూ ప్రభుత్వపరం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వము తగిన చర్యలను తీసుకునేందుకు ప్రయత్నించాలని ఆ సవరణలో ఉంది.

సర్దార్ పటేల్ మంగళ్‌సింగు తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఇంకా తాము ప్రభుత్వ విధానాన్ని ఏర్పరుచుకోలేదన్నారు. ఇలాంటి వాగ్దానాలు చెయ్యలేమన్నారు. ప్రభుత్వపరం చేయడం మంచిదని ఒప్పుకోవలసివచ్చింది. కాని ఇప్పుడే తొందరపడకూడదన్నారు. చమన్‌లాల్ సవరణను అంగీకరిస్తానన్నారు.

ప్రధాని పరిశ్రమలు ప్రభుత్వపరం చెయ్యడం అత్యవసరమని ప్రజాస్వామ్యవాదులందరు గుర్తించిన విషయం. ఈవిషయంలో కాంగ్రెసునాయకులిలా వెనుకంజ వేయడం ధనికవర్గాలకు కాంగ్రెసుపైనున్న పలుకుబడిని తెలియజేస్తుంది.

ఎ. సి. కాలేజీ విద్యార్థులనిరశనవ్రతం

గుంటూరు, నవంబరు 8

గుంటూరు ఎ. సి. కాలేజీ విద్యార్థుల సమ్మె కమిటీ సభ్యులు శ్రీ లింగారెడ్డి, జి. ఏ. శాస్త్రిగార్లు ఇవ్వాళ ఉదయంనుంచి కాలేజీ గేటువద్ద నిరశనవ్రతం ప్రారంభించారు. ప్రిన్సిపాలు కాలేజీని తెరచి వెళ్ళగొట్టిన విద్యార్థులను చేర్చుకొనేటంతవరకూ, జరిమానాలను రద్దుచేసి, పీచపంటోధవలతో విద్యార్థులను అవమానపర్చినదానికి క్షమార్పణ చెప్పేటంతవరకూ, వీరు నిరశనవ్రతం సాగించటానికి నిశ్చయించారు. పైకోర్కెలు తీరేదేవరకూ కాలేజీ తెరచినా సమ్మె, పికెటింగు జరపాలని విద్యార్థులు నిశ్చయించుకొన్నట్టు తెలుస్తోంది.

★ పీపుల్స్ ఏజ్ సంపాదకీయం

కార్మికతగాదా బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

కార్మిక హక్కులను రక్షించాలి

ధనికులకు, సామ్రాజ్యవాదులకు నెహ్రూ ప్రభుత్వం తోడ్పడరాదు

ఢిల్లీ అసెంబ్లీలో గత వారం, తాత్కాలిక ప్రభుత్వ కార్మిక సభ్యుడు కార్మికుల తగాదాలబిల్లును ప్రవేశ పెట్టాడు. చూడడానికి కేవలం కార్మికుల తగాదా పరిష్కారానికి ఉద్దేశింపబడినట్లు ఈ బిల్లు కనిపిస్తుంది. కాని వాస్తవ స్థితిలో కార్మికుల సమ్మె హక్కు నిది తగ్నం చేస్తున్నది.

యావద్భారత దేశం అసహ్యించుకొన్న భారత రక్షణ చట్టంలోని 81 సెక్షన్ ఈ బిల్లుకు మూలమని కార్మిక సభ్యుడే బహిరంగంగా అంగీకరించాడు. యుద్ధకాలంలో కార్మికుల వాంఛలను త్రోసిపుచ్చివేసిన ఇండియా డిఫెన్సు చట్టాన్నే - శాశ్వతంగా ఉంచేందుకు నెహ్రూ ప్రభుత్వం ప్రయత్నించింది. అంతకన్న ప్రజాస్వామిక దృష్టిని చూపే చట్టాన్ని చేయలేక పోయింది.

ప్రజోపయోగ పరిశ్రమల్లో బలవంతంగా ప్రభుత్వం పరిష్కారం చెయ్యాలని, మిగత పరిశ్రమల్లో ప్రభుత్వ పరిష్కారం ఐచ్ఛికమని ఈ బిల్లు ఆదేశిస్తున్నది. ప్రజోపయోగ పరిశ్రమల్లో సమ్మె చట్టవిరుద్ధమని ఈ బిల్లులో ఉంది. రైల్వే, ట్రాము, నీటిసరఫరా మొదలైనవే కాక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేనినైనా ప్రజోపయోగ పరిశ్రమలని ప్రకటించవచ్చును.

ఇందువల్ల, కేవలం ప్రజోపయోగ పరిశ్రమలనేకాక, ఏ పరిశ్రమలనైనా ప్రజోపయోగ పరిశ్రమలని ప్రకటించి, సమ్మెలను నిషేధించడానికి, ప్రభుత్వం నియంతృత్వాధికారాన్ని సంపాదించుకోజూస్తున్నది.

కార్మికులను పనినుంచి తొలగించినా జీతం కోసివేసినా, న్యాయమైన కార్మికుల కోర్కెలను నిరాకరించినాసరే పరిష్కర్తల అవార్డును కార్మికులు అంగీకరించి తీరాలని ఈ బిల్లు చెబుతోంది.

ఇలాంటి బిల్లును "కార్మికులకు, యజమానులకు మధ్య సంబంధాలను సర్దుబాటు చేయడానికి" జరిగిన ప్రయత్నమని కార్మికసభ్యు డంటున్నాడు. తమ ఎన్నికల ప్రణాళికలో కార్మికుల సమ్మెహక్కును రక్షిస్తామన్న వాగ్దానాన్ని కాంగ్రెస్ ఇలా సంరక్షిస్తున్నది!

కార్మికులహక్కులకు రక్షణలేదు

పోనీ ఈ సమ్మె నిషేధానికి బదులు కార్మికులకు ప్రభుత్వమిస్తున్న దేమిటో చూదాం. ఈ పరిష్కారకర్త అవార్డు కార్మికులహక్కులను కాపాడుతున్నదా? యజమానుల స్వలాభ పరాయణతను అరికట్టుతున్నదా? అలాంటి దేమీలేదు. కార్మికులకు యజమానులకు మధ్య ఏర్పడిన తగాదాలలో ప్రధాన సూత్రాలపై పరిష్కారం జరగాలని కూడ ప్రభుత్వం చెప్పలేదు.

కార్మికులకు జీవితానికి తగిన జీతం ఇవ్వాలి. పనినుంచి తొలగించము అన్న రక్షణ ఉండాలి. పని హక్కును కల్పించాలి. ప్రావిడెంటుఫండు కార్మికులకు ఏర్పరచాలి. యిలాంటివానిని ప్రభుత్వం చట్టరీత్యా ఏర్పరచకనే, కేవలం యజమానుల వర్గానికి చెందిన పరిష్కర్తకే అధికారమప్పగించారు. అలాంటప్పుడు పరిష్కర్త యజమానుల ఆదాయమెంత ఇంత జీతం ఆ కర్మాగారం భరిస్తుందా అన్న దృష్టితోనే చూస్తాడు. కార్మికుల ప్రధానహక్కులనే నిరాకరిస్తాడు.

యజమానులకు మద్దతు

బలవంతంగా కార్మికులపై పరిష్కారకర్త అవార్డును రుద్దడమంటే యజమానులకు మద్దతునివ్వడమే. సమ్మె చేయనివ్వమని, కార్మికులను మీరిష్టంవచ్చినట్టు వేధించవచ్చునని యజమానులకు వాగ్దానం చెయ్యడమే అవుతుంది. కార్మికుల ప్రధానహక్కులను చట్టరీత్యా ప్రకటించకుండా, కేవలం పరిష్కర్త అవార్డును కార్మికులపై రుద్దడమంటే, కార్మికుల స్థితిని మరింత అధ్వాన్నం చేసేందుకు యజమానులకు అవకాశం కల్గించడమే అవుతుంది. సమ్మె హక్కును తొలగించి, పరిష్కారాన్ని బలవంతంగా విధించేచట్టాలన్నీ ప్రతిదేశంలోను ఇలాగే పరిణమించాయన్నది అనుభవసిద్ధం.

ప్రభుత్వం, ముఖ్యంగా ఏ ప్రజా ప్రభుత్వంకాని పరిశ్రమల తగాదాలలో కల్పించుకొని వాని పరిష్కారం తామే చేస్తామని చట్టం చేస్తానంటే కార్మికోద్యమం అంగీకరించదు. ఒకవేళ అలా ప్రభుత్వం జోక్యం కల్పించుకునే పక్షములో పీడకులనుండి పీడితులకు రక్షణకూడ కల్పించాలి. అందులోను ఉత్పత్తి సాధనాలన్నింటిని చేతబట్టుకొన్న అల్పసంఖ్యాకమైన ధనికవర్గం కార్మికులపై కష్టపరిస్థితులను కల్పించే సమాజ వ్యవస్థలో, అసమానతను తొలగించేందుకు అవకాశాలు కల్పించాలి.

సరియైన ఏర్పాట్లు చేయకపోతే భారత కార్మికవర్గంలోని ప్రతి భాగమూ సమ్మెపోరాటం సడపవలసివస్తుందని, పెద్ద తగాదాలు రానున్నవని అనడంలో సందేహంలేదు.

సమ్మెకు మూలకారణాలు తొలగించాలి.

ఈ అశాంతి పరిస్థితులకు మూలమేమిటి? యుద్ధకాలంలో సామ్రాజ్యవాదులు పీడించారు. ధనికులు అత్యధిక లాభాపేక్షతో ప్రజలకష్టార్జితంనుండి విపరీతమైన డబ్బు గడించారు. వస్తువుల ధరలు బ్రహ్మాండంగా పెరిగిపోతున్నవి. ప్రభుత్వం వానిని కంట్రోలు చేయలేక పోతున్నది. వీనిమూలకంగా కార్మికుల జీవిత ప్రమాణం నానాటికి అధ్వాన్నమైపోతున్నది. పరిశ్రమల యజమానులు, తాము దోచుకుంటూన్న విపరీత లాభాలలో కొంతైనా కార్మికుల స్థితిగతులను చక్కబరిచేందుకు ఉపయోగించ నిరాకరిస్తున్నారు. ఇందువల్ల సమ్మె చేయవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నవి.

పరిశ్రమల శాంతిపేర పీడిత కార్మికుల పోరాటాలను అణచడం కాక, నిజంగా శాంతిని ఏర్పరచే చట్టాలు చేయాలని హృదయపూర్వకంగావాంఛించేవారు, కార్మికుల కనీస హక్కులకు రక్షణ కల్పిస్తూ చట్టాలు చెయ్యాలి. జీవిత ప్రమాణానికి తగినట్లు జీతాలు పెంచాలి. కార్మికులకు పని దొరుకుతుందన్న గ్యారంటీ యివ్వాలి.

అదే నిజమైన ప్రజాస్వామికపద్ధతి. తద్వారా సమ్మెలకు మూలకారణాలు తొలగింపబడతాయి. అప్పటికీ తగాదాలు వస్తే, కార్మికుల, యజమానుల ఇద్దరి అనుమతిమీద, ఇద్దరు అంగీకరించిన పరిష్కార సంఘానికి వివాదాన్ని అప్పగించవచ్చును.

సామ్రాజ్యవాదుల బిల్లుకన్న అన్యాయంగా ఉంది

ఇప్పటి బిల్లు కేవలం కార్మికుల హక్కులపై — సమ్మెహక్కుపై దాడి చేస్తున్నది. కార్మికులను కాళ్ళు చేతులు కట్టి యజమానులకు అప్పగిస్తున్నది. 1929 లో సామ్రాజ్యవాదుల ప్రభుత్వం ఇదే పరిస్థితిని ఎదుర్కోవలసివచ్చింది. అప్పుడు వారొక కార్మిక తగాదాల చట్టాన్ని చేశారు. దానిని దేశమంతా ఏవగించుకున్నారు. ఇప్పటి తాత్కాలికప్రభుత్వం తెచ్చినబిల్లు అంతకన్నా కార్మిక వ్యతిరేకతను చాటుతున్నది. సామ్రాజ్యవాదుల నిర్బంధవిధానాలను మరింత బలపరుస్తున్నది. కార్మికుల యెడల తాత్కాలిక ప్రభుత్వానికి ఇదొక పెద్ద నిదర్శనం.

కార్మికులందరూ వ్యతిరేకించాలి

ఈ బిల్లు కార్మికోద్యమానికి కార్మికుల హక్కులకు ప్రమాదకరమైనది. ఈబిల్లు చట్టమే అయితే, కార్మికవర్గం హక్కులను రక్షించడం దుస్సాధ్యమవుతుంది. ఇకమీద అధిక సంఖ్యాకులను పనులనుండి తొలగించినప్పుడు, జీతాలు కోతలుపెట్టినప్పుడు, కార్మికులెంచేసినా చట్టవిరుద్ధమనిచెప్పి అణచివేయడానికి వీలేర్పడుతుంది. యజమానులకు బాహాటంగా తోడ్పడే ఈ బిల్లును కార్మికులందరూ ఎదిరించాలి. ఈబిల్లును ఎదిరించి తమ హక్కులను డిమాండు చేసేందుకు అన్ని కార్మిక సంఘాలు తమ సభ్యులందరిని సమీకరించాలి.

ప్రజాపోరాటాలకు విరుద్ధం

ఈబిల్లు భారతదేశ ప్రజాస్వామిక ఉద్యమానికే భంగకరం. తాత్కాలిక ప్రభుత్వంపై ధనికవర్గానికున్న పలుకుబడికిది నిదర్శనం. కాంగ్రెస్ ఈపలుకుబడిలోపడి పరాభవంపాలు కాకుండా కాపాడాలి. కాంగ్రెస్ బలాన్ని ఒకపక్షం వైపుచేరి మరొకపక్షాన్ని వినాశంచేయడానికి ఉపయోగించకుండా చూడాలి. జమీందారి ధనికవర్గాల ప్రాబల్యాన్ని అరికట్టి ప్రజలలోని వివిధ వర్గాలకు రక్షణ కల్పించకపోతే, భారతీయులు స్వతంత్రం వైపు ప్రజాసామ్యం వేపు పురోగమించలేరు.

సామ్రాజ్యవాదుల కిది విజయం

విపరీతంగా విజృంభిస్తున్న కార్మిక పోరాటాలను తమ ముఖ్యశత్రువుగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భావిస్తున్నారు వానిని అణచివేయాలని చూస్తున్నారు. ఈబిల్లే చట్టమయితే బ్రిటిష్ సామ్రాజ్యవాదులకది మహత్తర విజయమవుతుంది. ధనికులకుకాక కార్మికులకు రక్షణ కల్పించమని, ఇప్పటి బిల్లును ఉపసంహరించుకొమ్మని కాంగ్రెస్ లీగు వాదులందరూ తమనాయకులపై ఒత్తిడి తేవాలి.

శాంతి స్థాపనకై కాంగ్రెసు, లీగ్ నాయకుల విజ్ఞప్తులు

రాజకీయ ఒడంబడిక లేనిదే ఫలితం కాకపోవచ్చు

పి. సి. జోషి

ఈ వారంలో ఎన్నో ఘటనలు, అంత వేగంతో జరిగాయి. తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింలీగ్ ప్రవేశించినప్పటికీ, హిందూ — ముస్లిం కొట్లాటలు తగ్గిపోవు: పైగా అనేక ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. కాంగ్రెసు నాయకులు, లీగ్ నాయకులు ఇంతవరకు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోడానికి యీ కొట్లాటల నుపయోగించుకొంటూ వచ్చారు. కాని, యీ రోజున అలా కాదు. ఉభయులూ కలిసి, కొట్లాటలు మానవలసిందని విజ్ఞప్తులు చేస్తున్నారు. స్వాతంత్ర్యంకోరే అసంఖ్యాక ప్రజలు, వరుసగా 3 నెలలు ఎడతెగని యమబాధలు అనుభవించాక, ఉపన్యాస వేదికలెక్కారు కాంగ్రెసు నాయకులు, లీగ్ నాయకులు.

కాంగ్రెసు నాయకులు, లీగునాయకులు అవలంబించేపాలసీఎంతఅపాయకరమైనదో, ఎంత వినాశకారియో, ఇప్పుడు స్పష్టంగా, మన కళ్ళయెదుట కనబడుతోంది. ఒకరినొకరు సాధించుకోడానికి, ఎవరిమట్టుకువారు అవలంబిస్తూవచ్చిన విచ్ఛిన్న మార్గాలే ఈ కొట్లాటలకు కారణం. కాని, తీరా అవి దేశం నలుమూలలకూ వ్యాపించి, ప్రజాజీవితాన్నే నాశనం చేస్తూన్నప్పుడు, కలిసి వాటిని నివారించడంకోసం తిప్పలు పడుతున్నారు.

వివిధ వర్గాల దృక్పథాలు

ఈకొట్లాటల యెడల వివిధ వర్గాలు వేర్వేరు దృక్పథాలు కలిగియున్నారు.

సామ్రాజ్యవాదులు కాంగ్రెసు–లీగ్ సంఘర్షణను చక్కగా ఉపయోగించుకొని ముస్లింలీగ్నుకూడ తాత్కాలికప్రభుత్వంలోకిదూర్చగలిగారు. ఆ తర్వాత, కొట్లాటల నణచడానికి కాంగ్రెసు నాయకులు, లీగునాయకులుకూడా వేవెల్ సహాయంకోసం, ఎక్కువమిలిటరీకోసం దేవురించే స్థితికి ఉభయుల్నీ తీసుకొచ్చారు. వెంట వెంటనే వాటిని అణచడానికి చర్యలు తీసుకోనందువ ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి అవి వ్యాపించేటట్లుచేశారు. చివరకు, తాము కోరే "శాంతిభద్రతల"కు కూడా రక్షణ లేకపోయింది.

(2) ఇక వర్తకుల విషయం. కొట్లాటలు జరిగే ప్రాంతాల్లో సరుకుల అమ్మకం, రవాణా మొదలయినవి దెబ్బతింటున్నాయి. ఒక్క కలకత్తా కొట్లాటలవల్ల 50 కోట్ల రూపాయల వ్యాపారం దెబ్బతింది. బొంబాయిలో పెద్దపెద్దబోకువర్తకులు, తమకువచ్చే లాభాలు పోతూండడంచూచి, శాంతి స్థాపనకు రాజకీయ నాయకులమీద చాలా ఒత్తిడి తీసుకొచ్చారు.

(3) అసంఖ్యాకమైన జనసామాన్యందారి, తెన్నూగానక, చెప్పరాని బాధ లనుభవిస్తున్నారు. హిందువుల్లోను, ముస్లింలలోను, మతద్వేషం రెచ్చగొట్టే వారిని అదుపు ఆజ్ఞల్లో పెట్టడం ఎవరికీ సాధ్యంకాకుండా పోయింది.

ఈ విధంగా, ఏయే ప్రాంతాల్లో కొట్లాటలు వ్యాపిస్తున్నాయో, అక్కడ పరిస్థితులు కాంగ్రెసునాయకుల చేతులలోనుంచి జారిపోతున్నాయి. లీగ్నాయకుల చేతుల్లోంచి పోతున్నాయి. ప్రభుత్వం చేతుల్లోనుంచి జారిపోతున్నాయి. పైచేయి రౌడీలదవుతోంది.

ఈరోజు దేశంలో ఎక్కడ చూచినా, కొట్లాటలు సులభంగా వ్యాపించే ప్రమాదం, అట్టి వాతావరణం, ఉంది.

పదిరోజుల హర్తాళ్ నినాదం

కొద్దిరోజుల క్రిందట బెంగాల్ రాష్ట్రం ఒక పెద్ద అగ్నిపర్వతంమీద ఉన్నట్లుంది. పెద్ద [illegible] హిందూమహాసభ షాహుకార్లతో [illegible]ంధంఉన్న శరత్ బోసు, పది [illegible] వరుసగా హర్తాళ్ జరపవలసిందని వర్తకులందరికీ పిలుపిచ్చాడు. ఇది అమలు జరిగి యున్నట్లయితే, కలకత్తానగరంలోనే గాక బెంగాల్ పట్టణాలన్నింట, పల్లెటూళ్ళలో సహితం తిరిగి మరొక భయంకర హత్యాకాండ జరిగియుండేది. కాని, యింతలో కాంగ్రెసు నాయకులు, లీగ్ నాయకులు కలిసి బెంగాల్లో సంచారం చేయడం వల్ల, హర్తాళ్ నినాదం ఉపసంహరించుకోబడింది. రెండవ సత్ఫలితం, లీగ్నాయకులు ఇదివరకుకంటె స్పష్టంగాను, ఖచ్చితంగాను కొట్లాటలను ఖండించారు. బెంగాల్లో మహమ్మదీయులు అల్పసంఖ్యాకులైన హిందువుల్ని రక్షించడం పోయి, వారిపై చెప్పరాని అత్యాచారాలు జరపడం మహమ్మదీయులందరికి తలవొంపులు - అని లీగ్నాయకులు ఉపన్యసిస్తున్నారు. 3 వ విషయంబెంగాల్ సంయుక్త మంత్రివర్గ నిర్మాణానికి గాంధీజీ-సుహ్రావర్దీల మధ్య సంప్రతింపులు ప్రారంభమయాయి. అయితే, సుహ్రావర్దీ సంయుక్త శాంతిరక్షణ కమిటీల స్థాపనకు మాత్రమే అంగీకరిస్తున్నాడట. కాంగ్రెసు మెజారిటీ రాష్ట్రాలలో మొదట సంయుక్త మంత్రివర్గాలేర్పరిస్తే, తరవాత బెంగాల్లో స్థాపించవచ్చునని చెప్పాడట. దీని అర్థం ఏమిటి? శాంతిస్థాపనను గూర్చిమాట్లాడేటప్పుడుకూడా రాజకీయప్రాబల్యంకొరకు పెనగులాడుతున్నారన్నమాట.

బీహారుకు కొట్లాటలవ్యాప్తి

హిందూ మెజారిటీఉన్న బీహారుకు కూడా కొట్లాటలు వ్యాపించాయి. కాంగ్రెసు నాయకులు, లీగ్ నాయకులు తెలియజేస్తూన్న వాటినిబట్టి, బీహార్ పరిస్థితులెంత విషమించాయో స్పష్టమవుతోంది. అక్కడ్నుంచి మా విలేఖరి నిష్పక్షపాతమైన రిపోర్టు ఒకటి పంపారు. బెంగాల్ కొట్లాటల ప్రత్యక్ష ఫలితమే బీహారు కొట్లాటలుకూడా. అక్కడ ఎంత అమానుషమైన అత్యాచారాలు జరిగాయో, ఇక్కడకూడా అంతే అమానుషమైన అత్యాచారాలు జరిగాయి. ముసల్మానులకంటె హిందువులే ఎక్కువ విశాలహృదయులు అని చెప్పుకొనేవారంతా బీహార్ దురంతాల విషయం విని అభిప్రాయాన్ని మార్చుకోవలసి యుంది. "నౌఖలీ దురంతాలకు ప్రతీకారం చెయ్యాలి!" అనే నినాదం ఎక్కడికి దారి తీస్తుందో, బీహార్ కొట్లాటలవల్ల మనం తెలుసుకోవచ్చు. నెహ్రూ, తాను చూచిన దృశ్యాలను గూర్చి యిలా చెప్పాడు. "ఇంత ఉన్మాద స్థితికి ప్రజలు దిగజారతారని నే నెన్నడూ ఊహించలేదు." బీహార్లో కొట్లాటలు జరిగిన ప్రాంతంలో మొట్టమొదటిసారి కాంగ్రెసు నాయకులు, లీగ్ నాయకులు ఒకే ఉపన్యాస వేదికనుంచి మాట్లాడారు. (నెహ్రూ, నిష్తార్లు) ఐతే ఉభయపార్టీల నాయకులు హిందూ-ముస్లిం ఐక్యతకై కొత్త పిలుపు యిచ్చారనిగాని, ఇక కొట్లాటలు ఆగిపోతాయనిగాని, భావించడం పొరబాటు. కాంగ్రెసు నాయకులు ఆచార్య కృపలానీని తూర్పు బెంగాల్ సంచారానికి పంపినట్లే, జిన్నా కూడ నొమన్ను బీహార్ సంచారానికి పంపాడు.

శాంతి స్థాపనకై నాయకుల విజ్ఞప్తి ప్రశంసించ దగ్గది

ప్రజలంతా శాంతి స్థాపనకై పనిచేయవలసిందని కాంగ్రెసు నాయకులు, లీగు నాయకులు విజ్ఞప్తి చేయడం ప్రశంసించదగ్గ విషయం. "మనలో మన కెన్ని అభిప్రాయ భేదాలున్నా, ప్రజల మానుషత్వానికే కళంకము తెచ్చే దురంతాలను మనం ఎన్నటికీ సహించరాదు. నీచాతి నీచమైన దుండగాలు చేయడంవల్ల మన రాజకీయ సమస్యలు పరిష్కారం కావు. స్వాతంత్ర్యసౌధాని కవి పునాదు లెన్నటికీ కాజాలవు. మన పొరుగువారిమీద దౌర్జన్యం చేస్తే, అంతకంటె అనేకరెట్లు ఎక్కువదౌర్జన్యంజరుగుతుందనే విషయం మనమెవరమూ మరచిపోకూడదు. దౌర్జన్య చర్యలవల్ల సామాజిక జీవితమే ధ్వంసమవుతుంది. మానవులం పశువులతో సమానంగా తయారవుతాం" అని వారు తమ సంయుక్త ప్రకటనలో స్పష్టంగా ప్రజల్ని హెచ్చరించారు.

అయినా కొట్లాటలు ఆగిపోయే సూచనలేదు

సాధారణపరిస్థితుల్లో ఇట్టి విజ్ఞప్తివల్ల చాల లాభం కలిగియుండేది. 24 గంటల్లో ఎక్కడి కొట్లాటలు అక్కడ ఆగిపోయిఉండేవి. కాని అలాంటిదేమీ కనపడ్డంలేదు. ఎందువల్ల? కాంగ్రెసు - లీగ్ అనైక్యత ఇంకా ఐక్యతగా మారలేదు.

(1) కొట్లాటలకు కారణమైన పరిస్థితులన్నీ ఇప్పటికి దేశంలో ఉన్నాయి. ఉభయ పార్టీలమధ్య రాజకీయంగా ఒడంబడిక జరగనంతకాలం ఎన్ని సంయుక్త ప్రకటనలు చేసినప్పటికీప్రయోజనం ఉండదు. ఇదంతా ఒక నాటకం మాదిరిగా ప్రజలకు కనిపిస్తుంది.

(2) పరిస్థితులు చెయ్యి జారిపోయాయి. కాంగ్రెసులోను, లీగ్లోను ఉన్న మత దురహంకారుల చేతుల్లో నేడు నాయకత్వంఉంది. రౌడీలు ప్రజలకు ముందుండి, నడిపిస్తున్నారు. ఎందువల్లనంటే, హిందువులతోగాని ముస్లింలతోగాని పోరాడగలశక్తి యీ రౌడీలకు ఉంది! ఇట్టి పరిస్థితులో శాంతి అంత సులభంగా స్థాపింపబడదు.

(3) కాంగ్రెసు పత్రికలు ముస్లింగూండాల అత్యాచారాలనుగూర్చి, లీగ్పత్రికలు హిందూ గూండాల అత్యాచారాలనుగూర్చి కొత్తకొత్త వార్తలు-ఉన్నవీ, లేనివీ-ప్రచురించడంద్వారా పత్రికాధిపతుల ఆదాయం నానాటికీ హెచ్చుతుంది. నౌఖలీ దురంతాలనుగూర్చి కాంగ్రెసు పత్రికలు, బీహార్, బొంబాయి దురంతాలను గూర్చి లీగు పత్రికలు మతోద్రేకాలను రెచ్చగొట్టే విధంగా వార్తలను ప్రచురిస్తున్నాయి. ఈవిధంగా పత్రికాధిపతులు ప్రజల మనస్సులలో నాటినవిషబీజాలన్నీ ఒక్కసారి యెలా మాయమౌతాయి?

ప్రజాసామాన్యాన్ని సమీకరించాలి

పై కారణాలవల్ల, ఒక్కసారి హిందూ-ముస్లిం ఐక్యత చేకూరుతుందనుకోవడం పొరబాటు. కాంగ్రెసు, లీగ్ నాయకుల సంయుక్త ప్రకటనను ఆచరణలో పెట్టడంకొసం కాంగ్రెసు ప్రజా సామాన్యాన్ని, లీగ్ ప్రజా సామాన్యాన్ని విరివిగా సమీకరిస్తే తప్ప, ఎన్నో విజ్ఞప్తులు చేసినా అవన్నీ కాగితం మీదే ఉండిపోతాయి.

ప్రతి పట్టణంలోను, ప్రతి గ్రామంలోను, స్థానిక కాంగ్రెసు నాయకులు లీగ్ నాయకులు కలిసి ప్రజలమధ్య శాంతిని కాపాడేందుకు కృషిచేస్తేతప్ప, కొట్లాటలు ఇలాగే ఎప్పుడూ జరుగుతూఉంటాయి. మత మహంకారుల చర్యలవల్ల ఇంతవరకు మూకీభావం వహించిన కాంగ్రెసువాదులు, ముస్లిం లీగర్లు నాయకుల సంయుక్త విన్నపాన్ని ఆచరణలో పెట్టే ధైర్యం, ఉత్సాహం కలిగేటట్లు చూడాలి. గత మూడు నెలల అనుభవాన్ని గుర్తుకు తెచ్చుకున్నా, నాయకుల విజ్ఞప్తిని చూచినా, మనకు స్పష్టంగా తెలిసేదేమంటే కొట్లాటలవల్ల కాంగ్రెసుకుగాని, ముస్లిం లీగ్కుగాని, ప్రయోజనం ఎంతమాత్రం కలుగదు. ఏ ఒక్క భారతీయునికి అవి లాభకారి కావు. బ్రిటిష్ పరిపాలకులు, వారి పోలీసులు మాత్రమే లాభం పొందుతారు.

పౌరసత్వ హక్కులు తిరిగి స్థాపింపబడాలి

తక్షణమే అన్నిరాష్ట్రాలలోను పౌరసత్వ హక్కులు తిరిగి స్థాపింపబడాలని కాంగ్రెస్ వాదులు, లీగర్లు, హిందువులు మహమ్మదీయులు - ఐక్యకంఠంతో డిమాండు చేయాలి. 144 వ సెక్షన్లు, కర్ఫ్యూ ఉత్తరువులు, సమిష్టిజరిమానాలు- ఇవన్నీరద్దుచేయబడాలి. పోలీసు, మిలిటరీ, గస్తీ దళాలు రద్దుకావాలి. వాళ్ళు ప్రజాజీవితాన్ని దుర్భరం చేస్తున్నారు. పరస్పర అనుమానాలను అధికంచేస్తున్నారు. మనమీదగల నిరంకుశాధికారుల పెత్తనాన్ని ఎక్కువ చేస్తున్నారు. పోలీసు రక్షణ చాలదు, మిలిటరీని పంపించాలి-అంటూ కొందరుచేసే ప్రకటనలు మనబానిస ప్రవృత్తికి చిహ్నం. బ్రిటిష్ తుపాకులద్వారా లభించేది శాంతి ఎన్నటికీ కాజాలదు. హిందూవులమీద మహమ్మదీయులమీద బ్రిటిష్ పాలకుల పెత్తనం ఎక్కువ కావడమే జరుగుతుంది.

కాంగ్రెసు నాయకులు లీగు నాయకులు ఇంకా రాజకీయ ఒడంబడిక చేసుకోలేకపోయారు. శాంతి స్థాపనకై వారుచేసేవిజ్ఞప్తులు సామ్రాజ్యవాదాన్ని కలిసి కూలద్రోయడానికి వుపయోగించవు. కాంగ్రెసు రాష్ట్రాలలో హిందువుల ప్రాణరక్షణకు కాంగ్రెసు, ముస్లింరాష్ట్రాలలో ముస్లింల ప్రాణరక్షణకు లీగ్, పనిచేయాలని ప్రబోధించడమే ఈసంయుక్తప్రకటనలఉద్దేశం. వీటివల్ల ప్రయోజనం కనబడకపోతే పోలీసుల్ని సైనికుల్ని ప్రజలమీదికి తోలుతారు. పండిట్ నెహ్రూ బీహారులో క్రింది విధంగా వుపన్యసించాడు.

"ఈ కొట్లాటలు వెంటనే ఆగిపోకపోతే పరిస్థితులు చాలా విషమిస్తాయి. యిక వాటిని సహించం. ప్రస్తుత పరిస్థితి యిలాగేవుంటే, మరఫిరంగులు, బాంబులు ప్రభుత్వయంత్రం వుపయోగింపవలసివస్తుంది."

సర్దార్ నిష్తార్కూడ ఈ ధోరణిలోనే వుపన్యసించాడు. అతడిలా అన్నాడు. "నౌఖలీలో హిందువులు చాలబాధలకు గురిఅయారు. తూర్పుబెంగాలు ఘటనలను ప్రతిముస్లింనిరసిస్తాడు. ముస్లింలు ఈకొట్లాటలను మానకపోతే ప్రభుత్వానికి గల అధికారాలన్నింటినీ వుపయోగించి అణచవలసివస్తుంది."

కాంగ్రెసు నాయకులు, లీగు నాయకులు తాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశించిన తరువాత కొట్లాటలను ఖండిస్తూన్న మాట వాస్తవమే కాని ఒకరి నొకరు సాధించే పాత విధానమే యిప్పటికీ అవలంబిస్తున్నారు. బ్రిటిషు మిలిటరీకి పోలీసులకు పెత్తనమిచ్చి ప్రజల్ని అణచివేస్తామని బెదరించుతున్నారు.

సూర్యాపేటలో పెద్దపెట్టున పోలీసుదాడికి సన్నాహాలు

వీరోచిత ప్రతిఘటనకు ప్రజల సంసిద్ధత

(మా విలేఖరి)

హైదరాబాద్, నవంబరు 8

పాత సూర్యాపేట బాలేముల గ్రామానికి 4 మైళ్ళదూరాన వుంటుంది. సూర్యాపేట దేశముఖు గ్రామాలలో వాటి ప్రజా పుద్యమము బలంగా వున్నందున చుట్టుపట్ల గ్రామాల్లోని దౌర్జన్యవిధులకు నిరంతరం పోరాటంలో పోలీసుల తుపాకులకు ఎదురుగా నిలబడి వారి ప్లానులను భగ్నం చేసినవారు పాత సూర్యాపేట ప్రజలే.

ప్రజల డిఫెన్సు

పెద్దఎత్తున దాడికై సన్నాహాలు

ప్రజల విప్లవ సంరంభం

ఈ ప్రవాహాన్ని అరికట్టటం దేశముఖులకు కానిపని అయింది.

ఇతర గ్రామాలలోగూడా

సూర్యాపేట తాలూకాలోనే ఈ కేంద్రీకరణ ఎందుకో?

సూర్యాపేట పట్టణంలో

సెక్షన్‌ను ప్రయోగించి పట్టణంలోనికి రిజర్వు పోలీసులను నింపివేశారు.

అంతా బ్లాకుమార్కెట్టే

ధరకు వస్తువులు కరువు అయినవి. రేషన్ షాపులోని బియ్యం అన్ని రిజర్వు పోలీసులకే. ప్రజలకేమీ లేవు.

మళ్ళీ పోరాటానికి సిద్ధం

సూర్యాపేటలో విద్యార్థులు, తమ కోర్కెలను - సానుభూతి సమ్మె సందర్భంలో తీసివేయబడినవారిని చేర్చుకొనుట, వారిపైన కేసులను ఉపసంహరించుకొనుట మొదలైనవి సాధించడానికి సమ్మె చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఎవ్వరూ పట్టుబడలేదు

కోలారు కార్మికులపై గూండాల, పోలీసుల కుట్రలు

కార్మికులపై కాల్పులు

(మా విలేఖరి)

ప్రిన్సిపాల్, పోలీసులకు లైసెన్సు

ఆంధ్రా విశ్వవిద్యాలయ విద్యా వ్యతిరేక తీర్మానం

యూనివర్సిటీ విద్యార్థుల సమ్మె

కాకినాడలో

భీమవరంలో

చిన్న కథ

చిరంజీవి

ఒక ఆంధ్ర నావికుడు

చిరంజీవి నికోబే ఆస్పత్రిలో మూల్గుతున్నాడు. డాక్టరేమంటాడోనని గుండెలు దడదడ కొట్టుకుంటున్నవి. వరండాలో కుర్చీలో కూలబడ్డాను. ఆ పూటతో రేషను పూర్తయ్యింది. మిలిటరీ కాపలా బయటిగాలిని లోపలికి రానీయటంలేదు. నీళ్ళు నిలవతొక్కి యెంతిపోయింది. లోపల సింగూ, చక్రవర్తి గన్నర్సుమేటుతో మాట్లాడుతున్నారు. యెస్టాబ్లిషు మెంటంతా అట్టుడికినట్లుడికి పోతోంది.

అన్నారు ఎస్. బి. యే. ఒరిస్సా - సర్జాను. డాక్టరుగారినిచూచి విష్ చేశాను. "అంత కంగారుపడకండి .... చిరంజీవి బ్రతుకుతాడులే" అని డాక్టరుగారు తలవంచుకుని ముందుకు పోతున్నారు.

(మిగతా 6 వ పేజీలో)

మన పండగదినం

★


కోసూరి పున్నయ్య

చదువు సంధ్యలన్ సంస్కరణంబుల
విజ్ఞానంబున వెనుకంబడి పడి
అస్వతంత్రమున అణచిపెట్టబడి
హతాహతమైన, రష్యా ప్రజలకు
తెలతెలవారెన్ చీకటిపారన్
నవంబరే డీనాడే.... శ్రమ
జీవులపండుగ నేడే —

రక్తబిందువుల రాల్చి శ్రమించే
కార్మికజీవుల కండలు నమిలీ
కర్షక బృందపు కడుపులు మాడ్చీ
తిని, తెగ బలిసిన కోటీశ్వరులన్
జలగలనందగు జమీందారులన్
విషసర్పంబగు క్రూరున్ "జారున్"
కూలద్రోసినది యీనాడే, ఆ
నవంబరేడీ నాడే.... శ్రమ
జీవుల పండుగ నేడే —

అట్టడుగున పడియున్న అనాధుల
ఆకలి మంటల విప్లవజ్వాలలు
మిన్ను మన్ను నొణికించె, జగత్తును
కన్నువిప్ప జేసిన దీనాడే
జై జై జై జై జయ నినాదముల
'ధామ్మ'ని జయభేరీ మ్రోగిన "దే"
సుదినమనంగా జ్ఞప్తికితేగా
నవంబరేడీ నాడే.... శ్రమ
జీవుల పండుగ నేడే —

నక్కజిత్తులా బ్రిటిష్ యెత్తులన్
ఐక్యశక్తితో తుత్తునియలుజేసి,
సంపూర్ణ స్వతంత్రంబు గుంజుకొన
మతకక్షల విడనాడియు నేడే
ప్రతిజ్ఞలన్ పట్టుడి యీనాడే
నవంబరేడీ నాడే.... మన
పండుగదిన మీనాడే —



గ్రంథావలోకనం

సమీక్ష

★

అరుణోదయం

(యువ ప్రచురణ)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు.

యువ బుక్ డిపో.

37, ఆచారప్పన్ వీధి.

జి. టి. మద్రాసు.

ఇది రామమూర్తి జీవితానికి అరుణోదయాన్ని కలిగించే దీర్ఘకథానిక. రామమూర్తి పరీక్షల్లో వస్తున్న పాసైనా జీవితాన్ని ప్రపంచాన్ని అర్థం చేసుకోలేనివాడు. అద్రయత్నంగా కేవలమధ్య బిడ్డాడు. ఇంకేం, కవి, కథకుడూ, నాటకకర్తా, సంపాదకుడూ, చివరకు సినిమా డైరెక్టరూ. వ్యభిచారీ యుద్ధకాలంలో దొంగమార్కెటువాడూ, కాంగ్రెస్ అభిమానీ అయినాడు. డబ్బు సంపాదించాడు. ఏం చేయడం. . సమస్య దొంగమార్కెటు సాగిస్తే కమ్యూనిస్టులు పట్టిస్తారు. ఎందులోన్నా పెట్టుబడి పెడితే నమ్మేలూ. గొడవా భూమిమీద పారేశామూఅంటే మద్రాసులో స్త్రీ వ్యక్తి వల్లెటూరు మోటుతావిరం ఎలాగు? జీవితం ఎటు చూచినా అపాయకరమే: ఆలోచనలో పడ్డాడు.

1930 తరవాత ఆర్థికమాంద్యంలో దివాలా తీసి దావపడేప్పుడు జీవితసమస్య కేసి కళ్లు తెరవలేదు. "మా కొద్దు తెల్లదొరతనం" దేశాన్ని సమరోత్సాహంలో ముంచెత్తిన పాట యీయన కళారస విహీనమైన ప్రచారమైంది. శ్రీ. శ్రీ "మరో ప్రపంచం"విన్నా అతని మనసులో చలనంలేదు. ఇప్పుడీపుస్తకాల చదివితే సంగతులు తెలియవచ్చునేమోగాని, జీవిత పోరాటంలోవచ్చిన ఒడుదుడుకులను విందు చైతన్యంతో ఎదుర్కొని వ్యక్తి, జీవితమంతా ప్రజలకుదూరమై ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరించి సమాజపు దోపిడీలో భాగస్వామి అయినవాడి జీవితంలో, ప్రజా అభ్యుదయకరమైన అరుణోదయ మౌతుందని నమ్మక మేముంది? అందుకనే రామ్మూర్తిజీవితంయొక్క యీదీర్ఘ కథానికి ఫలశ్రుతిగూడా అనుమానంగానే ముగిసింది.

కావ్యమూ, నాట్యకళా, సినిమా, సమాజంలో దోపిడీ, మొదలైన సమస్యలలో విషయం కథలో వచ్చినప్పుడల్లా శ్రీకుటుంబరావుగారి వ్యక్తిత్వం స్పుటంగా అవుపడుతూనే వున్నది. ఆయన ప్రజాభ్యుదయ మార్గంలో కృషిచేస్తున్న ఉత్తమ రచయిత.

—పి. వి. శివయ్య

'అభ్యుదయ'

ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘంవారిచే ప్రకటించబడిన సచిత్ర మాసపత్రిక. డెమ్మీసైజు. 150 పేజీలు. వెల రూపాయి.

సంపాదకులు:

చదలవాడ పిచ్చయ్యగారు

దొరకుచోటు:

ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం ఆఫీసు.

బిసెంటురోడ్డు — బెజవాడ.

ఇది ప్రథమ సంచిక. ముఖపత్రంపై మల్లంపల్లి సోమశేఖరశర్మగారి మూడు రంగుల చిత్రంవుంది. ఈ సంఘం వారిచే వేసవిలో ఆంధ్ర సాహిత్య పాఠశాలనడుప బడింది ఈసంచికలో పాఠశాలలో ఉపన్యాసాలిచ్చిన శ్రీయుతులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, చిలుకూరి నారాయణరావు, కోరాడ రామకృష్ణయ్య, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, నిడదవోలు వెంకటరావు, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీరంగం శ్రీనివాసరావుగార్ల ఛాయా చిత్రా లున్నాయి. మూడు తరాలకుచెందిన పండితశ్రేష్ఠులు ఆంధ్ర సాహిత్యానికి, చరిత్ర పరిశోధనకు తమ జీవితాలను అంకితంచేసిన పెద్దల రచనలు యీ సంచికలో ఎన్నో వున్నాయి.

శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు వ్రాసిన 'మనభాషలు' అనేవ్యాసం మన తెలుగుభాష పుట్టు పూర్వోత్తరాలను చక్కగా విశదీకరించుతుంది. శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి 'ఆంధ్రనాటకీయ చరిత్ర' అను వ్యాసం ఆంధ్రవాఙ్మయంలో 'భారతానికి' వున్న ప్రాముఖ్యతను నిరూపించుతుంది. 'ఏకాంకి' నాటకాలపైన. నాటకాలలో శిల్పాన్ని గురించి శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి వ్యాసం క్లుప్తంలో చక్కని సింహావలోకనం అనిచెప్పవచ్చు.

శ్రీ అయ్యల సోమయాజుల, నరసింహశర్మగారి వ్యాసంలో 'రూపకంలో' అవుసరమైన నాటకవస్తువు, అభినయము, పాత్రోచితమైన భాష వగైరా విషయాలను చర్చించారు. 'నవల - చిన్నకథ' లను ప్రజాజీవితాన్ని చిత్రించడానికి ఎలా వుపయోగించాలో కొడవటిగంటి కుటుంబరావుగారు వివరించారు నవ్యాంధ్ర సాహిత్యంలో అభ్యుదయ రీతులనుగురించి మద్దుకూరి చంద్రశేఖరరావుగారు పర్యావలోకనం చేశారు.

శ్రీ తెన్నేటి సూరిగారు రచించిన 'బూరెముక్కలు' అనేకథ దానికి—విల్లాడికి మధ్య వున్న హృదయానుబంధాన్ని గుండెలు కరిగేలా చిత్రించింది. కుటుంబరావుగారి 'నాకు తెలియదు' అనే కథలో నడుమంత్రపు సిరి వచ్చినవారికి కూలీలకోసం పనిచేసే వాడిపైన వుండే భావాలను వ్యంగంగా నైపుణ్యంగా వ్రాశారు ఈ సంచికలో యింకా అనేకుల సందేశాలు. కథలు. పాటలు. వున్నాయి.

సాహిత్యాభిమానమున్న ప్రతివిద్యార్థి చదివి జీర్ణించుకోవలసవిషయాలున్నాయి ఇందుకు సంచిక సంపాదకులను అభినందించుతున్నాను. ముందు ముందు 'అభ్యుదయ' ఆంధ్ర భాషకు వన్నె తెస్తుందనీ, చిరంజీవియై సాహిత్యసేవ చేస్తుందనీ ఆశింస్తాను.

— సుంకర సత్యనారాయణ

'నేటి ఇరాన్'

రచయిత:

విద్వాన్ విశ్వం.

(మోహన్ కుమారమంగళం పుస్తకాన్ననుసరించి)

వెల 0—4—0 38 పేజీలు

ప్రజాశక్తి కార్యాలయం. బెజవాడ.

మూడవ ప్రపంచయుద్ధా కిబ్రిటిష్-అమెరికన్ సామ్రాజ్యవాదులు చేసే సలహాలలో ఇరాన్ పెట్రోల్ గనులపై తమ పెత్తనం సుస్థిరంగా వుంచుకునేటందుకుచేసే ప్రయత్నము ఒక ప్రధానభాగం. ఈ చిన్న కరపత్రంలో రచయిత. ఇరాన్‌లో సామ్రాజ్యవాదుల కుట్రలను బయటపెట్టాడు. వాటికి వ్యతిరేకంగా ఇరాన్ ప్రజాశక్తులు తమ తమ రాజకీయపార్టీలద్వారా జరిపే పోరాటాన్ని క్లుప్తంగా విశదీకరించాడు. డిశంబరు 6 వ తేదీని ఇరాన్‌లో ఎన్నికలు జరుగబో తున్నాయి.

వాటిలో పాల్గొనే వివిధ పార్టీల రాజకీయాలు తెలుసుకోవాలంటే, ఈ కరపత్రం చదవండి.

—కంభంపాటి (సీనియర్)

చిరంజీవి

(6 వ పేజీ తరువాయి)

మన శక్తిసామర్థ్యాలు మనమెరుగుదుం. తెల్ల వాళ్ళకీ మనకీవున్న తేడా మనకుతెలుసును" అంటూ దైన్యంతో జీవితంలోని కష్టాల్ని చెప్తూంటూ అతను ఉపన్యాసమిస్తూంటే మా క్యాంపులోవాళ్ళం వెయ్యి మందిమీ ఉప్పొంగిపోయ్యాం. అంత వరకూ మమ్మల్ని లోకువ చేసికొన్న దుర్భరజీవితం చూచి చూచి తాపు తన్నింది.

మా యినుపగజ్జెతల్లి సామ్రాజ్యవాదం చూపే బాయినెట్లకూ, గురిపెట్టే 22 తుపాకులకూ, నడిపే టాంకులకూ, పేల్చే మరఫిరంగులకూ యెదురొడ్డి విలబడేట్లు చేసింది చిరంజీవి కంచుమోత.

చిరంజీవితో మాట్లాడిన మనిషి అతనిమాట కెదురు చెప్పలేడు. ఎవరిచ్చారో అతనికా వశీకరణశక్తి. మొదటినాడు ముట్టడించిన మరాఠీ సైనికులతోనూ. పంజాబు సిక్కు సైనికులతోనూ. పంజాబు సిక్కు సైనికులతోనూ. అరగంటసేపు మాట్లాడాడు. మేం చూస్తూండగానే "మా సోదరుల్ని కాల్చేందుక్కాదు మేం తుపాకులు పట్టింది" అని నేలకేసి కొట్టారు. "చూశారా! విద్ర పోతున్న సింహం మేల్కొన్నది" అన్నాడు చిరంజీవి విబ్బరంగా. మర్నాటికి తెల్లగుంపు దిగింది చీమలబారులా....

డాక్టరు తెల్లముసుగులో తిరుగుతున్నాడు. ఎస్. బి. యే. బయటికి వచ్చాడు. "ఎట్లా వున్నది అన్నాను ఆతురతగా. "ఆపరేషను చేస్తున్నారు" అంటున్నాడు. ఎవరికీ ఆపరేషను! చిరంజీవికా? చిరంజీవికి: హారతులు పట్టటంలేదూ చిరంజీవికి: చిరంజీవి మెడలో పూలమాలలు వెయ్యటంలేదూ? డాక్టరు కత్తి పుచ్చుకుంటున్నాడా? కామాటీలు పూలమాలలు వేశారు మా చిరంజీవికి! "మేం మీ బిడ్డలం - మమ్మల్ని వాళ్ళు 'గాడిద కొడుకులు' అనీ 'లంజకొడుకులు' అనీ తిడుతున్నారు. ఇంక మేం పడం. ఇంక మేం సహించలేం. ఆయుధాలు పట్టాం. మీ అండను ఆశిస్తున్నాం ....."అంటూ ఆ కుధారగా వుపన్యాసమిస్తూంటే కామాటీలు కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. వాళ్ళ కళ్ళల్లో కోపం యెర్ర చీరలు కట్టుకొని గంతులేసింది....చిరంజీవితో పా టు వాళ్ళు మండిపొయ్యారు. కాంగ్రెసుకి జయ్! లీగుకూ జయ్ "కమ్యూనిస్టు పార్టీకి జయ్" "జాతీయసేవ జిందాబాద్!" అంటూ కామాటీపురం ప్రతిధ్వనించింది. ఆ ప్రతిధ్వనిలో టాంకుల మోత వినబడలేదుమాకు. గుండ్లు జుయ్ మంటూ గాలిలో దూసుకు పోవటం చూశాం. చిరంజీవి వాళ్ళ వైపుకు చూస్తూ యేమిటో చెబుతున్నాడు. ఒక గుండు అతన్ని దూసుకు పోయింది. ఇదిచూచిన కామాటీ....తలంతా నెరిసిన ముసలి కామాటీ.... చిరంజీవి వల్లంతా కానై కప్పాడు. చిరంజీవి తల ఝైటికి పెట్టి మాట్లాడుతున్నాడు మరో గుండు అతని తలకు తగిలింది. చిరంజీవి పడిపోయ్యాడు. కామాటీల సముద్రం కల్లోలమయ్యింది. టాంకులు చెదరిపోయ్యాయి.

చిరంజీవిని తీసికొస్తూంటే యెంత గల్లంతు చేసారు కామాటీలు. ఎంత నవ్వుజెప్ప వలసి వచ్చింది. అతని ప్రాణం రక్షించాలంటే మీరంతా ఎవళ్ళ యిళ్ళకి వాళ్ళు వెళ్ళండి. అతన్ని హాస్పటలుకు తీసికెళ్ళనీయండి!" అని యెంత బ్రతిమాలవలసి వచ్చింది!

చిరంజీవి చావడు! చావ గూడదు! అతని ఉపన్యాసంవిన్న కామాటీలు "నావికా సైన్యంలో వాళ్ళు మా బిడ్డలు! మా కన్న బిడ్డలు సరైన తిండి లేక మాడుతూంటే మేంచూడలేం" "అన్నారు!

చిరంజీవి చచిపోతే....! "చిరంజీవి యెక్కడఅని అడిగితే వాళ్ళకేమని సమాధానం చెప్పాలి!

నాబుర్ర తిరిగిపోతోంది! ముందున్న కొండలు కదుత్తున్నాయని పించుతోంది. చౌపాతీలో సముద్రం గల్లంతుచేస్తోంది! ఎక్కడి వాళ్ళుండాలు! మూడురంగుల యుండా! పచ్చ జండా! ఎఱ యుండా! ఎక్కడివవి? చౌపాతీ విండి పోతోంది. సముద్రం గల్లంతు వినపట్టంలేదు. లక్షల జనం నల్లటి శరీరాలు. మలబారుకొండ అదిరి పోతోంది. వాళ్ళంతా అరుస్తున్నారు. తెలుగులో అరుస్తున్నారు!

"చిరంజీవి జిందాబాద్!"

"జాతీయ నేవీ జిందాబాద్?"

క్యాంపులోకి పొట్లాలువచ్చి పడుతున్నాయ్. మాకు తిండి ఆగిపోయిందని యెవరు చెప్పారు వీళ్ళకి! ప్రహరీ గోడమీదగా ప్రాకుతున్నారు జనం! తెల్ల మిలటరీ తుపాకులు ధాం ధాం మని పిస్తోంది. గోడల మీద మనుష్యులు యేమౌతున్నారు ?.........మనుష్యులు గోడల్లోంచి పుట్టుకొస్తున్నారు! నాకుర్సీ ఊగుతోంది. యస్. బి. ఏ. చెయ్యి పట్టుకు లాగుతున్నాడు. క్యాంపులో జనం - మా వాళ్ళు-! నేవీ టోపీలు పదుగెత్తుతున్నాయి.

గోడపై వుకి!

తుపాకుల్తో!!

తెల్ల మిలిటరీ పారిపోతోంది! చౌపాతీలోకి. చౌపాతీ దాటి సముద్రంలోకి!!

డాక్టరు కళ్ళజోడు తీస్తున్నాడు.

కళ్ళు తుడుచుకుంటున్నారు. నావంకచూస్తూ "చిరంజీవి చచిపోలేదు! అలాచూస్తావేం వీళ్ళంతా చిరంజీవులుగాదూ...ఆ జనమంతా చిరంజీవులే" అంటున్నాడు.

కాంపౌండరు తుపాకి అందించాడు. జనం వేసేకేకల్లో డాక్టరుగొంతు వినపడ్డంలేదు.

చిరంజీవి!-జిందాబాద్!!

డిటెన్షన్ విధానం రద్దవాలి!

గుంటూరు, బందరు ప్రిన్సిపాల్సును తొలగించాలి

వీరమాచనేని మధుసూదనరావు

(ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘ కార్యదర్శి)

స్కూలు ఫైనల్ క్లాసులోను, ఇంటర్మీడియట్, బి.ఏ. క్లాసులలో సంవత్సరమధ్య కాలములో ప్రత్యేక పరీక్షలు పెట్టి, వాటిలో తప్పించి పబ్లిక్‌పరీక్షలో గూర్చునే అవకాశం లేకుండాజేసే డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఆంధ్రవిద్యార్థులు 1937 నుండి పోరాటము సాగిస్తున్నారు. ఈ బానిస విద్యావిధానానికి వ్యతిరేకంగా దేశభక్తియుతమైన నూతన విద్యావిధానముకోసము, జరిగేపోరాటములో ఒకభాగమే బందరు, గుంటూరుకాలేజీల విద్యార్థుల సమ్మెలు. దాదాపు 10 సంవత్సరములనుండి పోరాడుతున్న విద్యార్థులు యీ సంవత్సరమే డిటెన్షన్ విధానాన్ని తుదముట్టించాలనే నిశ్చయంతో పనిజేస్తున్నారు. అక్టోబరు 18 వ తేదీని రాష్ట్రములో 40 కేంద్రాలకు పైగా, వేలకు వేల విద్యార్థులు రాజకీయ విభేదాలతో ప్రమేయం లేకుండా, ఐక్యంగా సమ్మెలు జరిపారు. ఊరేగింపులు, బహిరంగ సభలుగూడా జరిపి బ్రహ్మాండమైన ఆందోళన జరిపారు. ఆంధ్రదేశమున ముందెన్నడు యింత పెద్దయెత్తున ఆందోళన జరగలేదు. ఈ సంవత్సరం అక్టోబరు 18 ని ఒక చారిత్రాత్మక దినంగా విద్యార్థులు చేశారు. బందరు, పిఠాపురం, విద్యార్థులు, విద్యార్థినులు సయితం అరెస్టులు, పోలీసు లాఠీలను ఎదురొడ్డి నిల్చారు.

విద్యాలయాధికారులుగూడ యీ విధానంలోని లోపాల్ని ఖండించకుండా చాలమంది విద్యార్థులను తప్పించే తప్పుడు విధానాన్ని అవలంబించుతూ వచ్చారు. కొంతమంది తమ స్కూలు పేరుకుబడికోసంగూడ ఎక్కువమందిని తప్పిస్తున్నారు. మరి కొంతమంది విద్యార్థులపై కక్షతో యీవిధంగా సాధిస్తున్నారు. 37—38 సంవత్సరాలలో విద్యార్థుల ఆందోళన ఫలితంగా కొంతవరకు డిటెన్షన్లు తగ్గించారు. కాని మరల అడ్వయిజర్ల ప్రభుత్వ కాలంలో వారి అండజూచుకొని విద్యార్థులపై దాడి ప్రారంభించారు. డిటెన్షన్లు తిరిగి ఎక్కువచేశారు. చాలమంది యీరోజున గూడ అభివృద్ధికి వ్యతిరేకమైన దృక్పథాన్నే అవలంబించుచున్నారు.

బందరు - గుంటూరు ప్రిన్సిపాళ్ళ నాయకత్వం

ఈ అభివృద్ధి నిరోధక విధానానికి బందరు ప్రిన్సిపాల్ శివరామకృష్ణరావు, గుంటూరు ఏ. సి. కాలేజి ప్రిన్సిపాల్ సైప్సు నాయకత్వం వహించారు. ఒక ప్రక్క సంవత్సర మధ్యకాలములోనే డిటెయిన్ చేయటం అన్యాయమని ఆందోళన జరుగుతుంటే, మధ్యకాలములోనే గాదు దసరా పరీక్షల్లోనే డిటెయిన్ చేయండనే ఆదర్శాన్ని జూపుతున్నాడు సైప్సు. ఈ సంవత్సరం దసరాపరీక్షల్లోనే 61 మందిని తప్పించి 182 మందికి 500 రూ. జరిమానా విధించి 258 మందికి వార్నింగులిచ్చాడు. 4 గురు విద్యార్థులను మాత్రం ఏమైనా చేర్చుకోను పొమ్మన్నాడు.

అదేమంటే, మీకు రాజకీయాలెందుకు? సమ్మెలు చేస్తారా? అగస్టు 9 సమ్మెకు ప్రతిఫలం అనుభవించండి అంటాడు. ఇది చాల అన్యాయము: యీవిద్యార్థులను తప్పక చేర్చుకోవాలని విద్యార్థులు, పౌరులు కోరితే పెడచెవినిబెట్టి. అవసరం కాలేజినే మూస్తున్నాను ఏం చేస్తారో చూస్తానంటూ. కాలనిర్ణయములేకుండా మూసివేశాడు.

జాత్యహంకారి సైప్సు

అమెరికానుంచి దిగిన యీసైప్సు దృష్టిలో భారతీయులు మనుష్యులేగారు. భారతీయులకు యింగితజ్ఞానమేలేదట. జంతువులతో సమానులట. ఇతని జాతి అహంకారం యింతటితోనే ఆగలేదు. నెహ్రూ, జిన్నాల వంటి జాతీయ నాయకులను 'లో పర్సు' అనేవరకు వెళ్ళింది. ఇంగ్లిషు ప్రభుత్వ వారసుణ్ణి, ఎవ్వెవరేమి చేస్తారనుకుంటాడు. కొండా వెంకటప్పయ్యగారు విద్యార్థులను చేర్చుకొమని వ్రాసిన వుత్తరంజూచి మండిపడి వుత్తరం దెచ్చిన విద్యార్థితో, "నీ కాంగ్రెసు నాయకులు, వారి ప్రభుత్వం అంటే నాకేమన్నా భయమనుకున్నావా? ఇది నీకు వారికిగూడ అగ్నిపరీక్షని తెలిసికో" మన్నాడు. ఈకాలేజీలో విద్యార్థులకేమాత్రం స్వాతంత్ర్యంలేదు. 'ప్రతిసంవత్సరం అనేకమందిని క్రూరంగా శిక్షించటం పరిపాటి. ఇతని పరిపాలనలో ఎప్పుడూ శాంతిలేదు. అనేక సమ్మెలు జరిగాయి. 37 లో ఒక సమ్మె జరిగింది. 42 ఆగస్టులో 200 మంది విద్యార్థులకు జరిమానాలు విధించాడు. ఈసంవత్సరం అగస్టు 9న విద్యార్థులపైనుంచి బూటుకాళ్ళతో నడిచివెళ్ళాడు.

సైప్సు మొదలు తన్నితే శివరామకృష్ణరావు మొవ్వ తన్నాడు

18 వ తేదీన రాష్ట్రములోని అన్ని ప్రదేశాలలో మాదిరిగానే బందరు విద్యార్థులు గూడ డిటెన్షన్ విధానాన్ని నిరసిస్తూ సమ్మె చేశారు. అందరు ప్రిన్సిపాళ్ళలాగ పూరుకొంటే తన గొప్పదనమేముందనుకున్నాడు. మానవత్వం మరిచిపోయి విద్యార్థులమీద నుండి కాలుతోలాడు. పైగా సిగ్గులేకుండా సమ్మె చేసిన విద్యార్థులందరికి రెండేసి రూపాయలు జరిమానా విధించాడు. ఇదేమి అని అడిగినందుకు, జరిమానాలు అక్రమం. వాటినితొలిగించాలి అని కోరినందుకు పోలీసులను పిలిపించి విద్యార్థులపై క్రూరంగా లాఠీచార్జీ చేయించి 75 మందిని అరెస్టు చేయించాడు. తరవాత ప్రజాందోళనకు తట్టుకోలేక విద్యార్థులకోర్కెలకు ఒప్పుకోవలసివచ్చింది.

ప్రభుత్వ బంటు

ఈయన మొట్టమొదటినుండి ప్రభుత్వానికి సి. ఆర్. రెడ్డిగారికి నమ్మినబంటు. విద్యార్థులు ఏ రాజకీయాలలో పాల్గొన్నా కాలేజీలో ఏమాత్రం స్వేచ్ఛ కావాలన్నా వెంటనే కాలేజీ నుండి పంపేస్తాడు. 1938 లోను, 40 లోను ఆ తరువాత అనేకమార్లు యీయన నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సమ్మెలు వచ్చినవి. ఎప్పుడన్నాగాని యింతవరకు దాదాపు 30 విద్యార్థుల జీవితాలను నాశనం జేశాడు. కాలేజిని వ్యాపార కేంద్రంగా మార్చాడు. చీటికిమాటికి విద్యార్థులనుండి డబ్బు గుంజాడు. ఎప్పుడూ జమాఖర్చులు జెప్పినపాపాన పోడు. క్రితం సంవత్సరం గేమ్సు ఫీజు జమాఖర్చులడిగినందుకు విద్యార్థి నాయకుని వెళ్ళగొట్టాడు. తోటి లెక్చరర్లనుగూడ చాల అగౌరవపరుస్తూ వుంటాడు. భాషేతరవిషయాలు మాతృభాషలోనే చెప్పటాన్ని ప్రథమంగా వ్యతిరేకించింది - యీ ప్రభుత్వబంటే. విద్యార్థులు ఏ యితర సంస్థలలోను చేరరాదనే విషేధాన్ని యూనివర్సిటీ రూల్సులో చేర్పించటానికి కారకుడు యితడే. దీని కంతటికి బహుమానంగా కాబోలు విద్యాశాఖారూల్సు ప్రకారము యీయనసర్వీసు 10సం॥ క్రితంఅయిపోయినాయిప్పటికి రెండుమార్లుపొడిగించారు

చీలికలుదెచ్చి—ఉద్యమాన్ని దెబ్బకొట్టే ప్రయత్నాలు

విద్యార్థులను విభజించి పాలించుటలో సామ్రాజ్యవాదుల విధానాన్ని విద్యార్థులలో వీరు చక్కగా అమలుజరుపుతారు. దేశంలో హిందూ-ముస్లిం చీలికలు, దెబ్బలాటలు తెచ్చి సామ్రాజ్యవాదులు శాశ్వతంగాపాతుకు పోవటానికి ఏ విధంగా ప్రయత్నిస్తున్నారో, వారి బంటులైన వీరుగూడ కాలేజీలలో చీలికలు, దెబ్బలాటలు తేవాలని తద్వారా వుద్యమాన్ని దెబ్బగొట్టాలని జూస్తున్నారు. గుంటూరు ప్రిన్సిపాలు క్రిస్టియన్ విద్యార్థులలో విషప్రచారంజేసి మిగిలిన విద్యార్థులకు వ్యతిరేకంగా వీరిని వుపయోగించుకోవాలని జూస్తున్నారు. అదే విధంగా బందరు ప్రిన్సిపాలు కొంతమంది ఆర్. ఎస్. ఎస్. విద్యార్థులను దగ్గరకుదీసి. వీరిని వుపయోగించుకోవాలని చూచాడు. ఇద్దరూ మతవైషమ్యాలను రెచ్చగొట్టుతున్నారు. ఈ రెండు కాలేజీలలోను గందరగోళాలు లేకుండా విద్యార్థుల జీవితాలు శాంతియుతంగా సాగిపోవాలంటే వీరిద్దరిని ప్రిన్సిపాల్సు పదవి నుంచి తొలగించాలి.

ఈధైర్యం ఎక్కడనుండివచ్చింది?

విద్యార్థులపై యీ నిరంకుశ విధానం అమలు పర్చటానికి పోలీసుల్ని సహితం రప్పించి అరెస్టులు చేయించటానికి దారుణంగా లాఠీచార్జీ చేయించటానికి, ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది? ఎవరి అండజూచుకుని యిదంతా చేస్తున్నారు? విద్యాశాఖ మంత్రి డి. పి. ఐ. యూనివర్సిటీ సిండికేటు నేడవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక దృక్పథమే కారణం. ఆంధ్రదేశంలో గత 20 రోజులనుండి సమ్మెలు జరుగుతున్నా విద్యార్థులలోని చీలికలను వుపయోగించుకొని దాడిచేయవచ్చునని భ్రమపడ్డారు. బందరు, గుంటూరువంటి పట్టణాల్లో కాలేజీలు సహితం మూసివేయబడ్డాయి.అయినా. ప్రభుత్వంవారు తమకేమీ పట్టనట్టుకూర్చున్నారు. పైగా విద్యాశాఖా మంత్రిని విద్యార్థులువెళ్ళి కలుసుకున్నప్పుడేమో మీకేదోసహాయం చేస్తానని, తరువాత క్షమాపణపత్రాలు తీసుకొని చేర్చుకోమని ప్రిన్సిపాల్‌కు సలహాలిచ్చాడు. విద్యార్థులు సమ్మెలు చేయరాదంటూ వుపన్యాసాలు ప్రారంభించాడు. ఇది నిరంకుశ ప్రిన్సిపాళ్ళకు మరింత చేయూతనిచ్చింది. ఇదే విధంగా యూనివర్సిటీ సిండికేటు విద్యార్థులకు వ్యతిరేకవిధానాన్ని అవలంబిస్తూఉంది. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం మామూలు పరిస్థితులలో మేము కలుగజేసుకోరాదంటూ ప్రిన్సిపాలుకు మద్దతు విస్తున్నారు. 20 రోజులుగా విద్యాలయాలు మూసివేయబడియుంటే విద్యార్థులపై పోలీసు హింసాకాండ సాగుతూవుంటే. యిది వారికి "మామూలు పరిస్థితి" యట! కాంగ్రెసు ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు చాల ప్రమాదకరమైన దృక్పథాన్ని అవలంబిస్తూ తామేమీ కలుగజేసుకోకుండా ప్రిన్సిపాళ్ళను బలపర్చేతూవుండబట్టే వీరికి మరింత ఉత్సాహము కల్గుతూవుంది. ఈ దృక్పథాన్ని విద్యాభివృద్ధినిగోరే ఏ వ్యక్తీ సమర్థించలేడు. కాబట్టి విద్యాశాఖామంత్రిగారు యూనివర్సిటీ సిండికేటు తమ దృక్పథాన్ని వెంటనే మార్చుకొని యీ అసాధారణ పరిస్థితులలో తప్పక కలుగజేసుకుని విద్యార్థులకు న్యాయాన్ని కలుగజేయాలి.

ప్రయివేటు మానేజిమెంట్లు రద్దు చెయ్యాలి

ఈరోజున బందరులోని కాలేజి,హైస్కూలు, గుంటూరు ఏ. సి. కాలేజి మానేజిమెంట్లకు విద్యార్థుల ప్రయోజనాలతో నిమిత్తంలేదు. తమ స్వంత ప్రయోజనాలకోసం ప్రాకులాడుతున్నారే తప్ప విద్యార్థుల శ్రేయస్సును గూర్చి ఏమాత్రం ఆలోచించరు. విద్యార్థుల జీవితానికి, వారి అభిప్రాయాలకు బద్ధవిరోధులు. వారిని సరిగా అర్థంజేసుకుంటానికి ప్రయత్నించరు. ముఖ్యంగా ఈ విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా నడుపుతున్నారు. గాని విద్యా కేంద్రాలుగామాత్రం గాదు. విద్యార్థుల వద్ద అన్యాయంగా గుంజిన డబ్బుతో క్రొత్త భవనాలు కడుతూ వుంటారు. బందరు కాలేజీలో జమాఖర్చులు చెప్పకుండా సంవత్సరానికి కొన్నివేలు కాజేస్తున్నారు. ఏ. సి. కాలేజీలో క్లాక్‌టవర్ గట్టిస్తానంటూ జరిమానాలు విధిస్తున్నారు. ఇంకా బందరుకమిటీ పరిపాలన ఎంత వరకు దిగజారిందంటే, విద్యావిషయాల చర్చలకు బదులు నియోగి, వైదిక ద్వేషాలతో తన్నుకులాడుతూ వుంటారు. ఈ విభేదాలు లెక్చరర్లలోకిగూడ ప్రాకినవి. ప్రత్యేక అభిమానాలతో పక్షపాత ప్రవర్తన మెండు. ఇది బందరులో అందరికీ తెలిసిన విషయమే.

అన్నిటికంటె విద్యార్థులకు విద్యాబుద్ధులను, క్రమశిక్షణను, పోలీసుల లాఠీలతో చెప్పించే వీరు ఏపాటి విద్యార్థి సంరక్షకులో ఆలోచించండి. కాబట్టి కాలేజీలో శాంతి వుండి, విద్యాభివృద్ధి జరగాలంటే. సంకుచిత స్వప్రయోజనాలకొరకు వ్యాపారకేంద్రాలుగా నడిపే వీరిని తొలగించి వీటిని ప్రభుత్వమే నడపాలి.

విద్యార్థుల కర్తవ్యం

విద్యార్థి సోదరులంతా ఐక్యంగా నిలబడాలి. బందరు - గుంటూరు విద్యార్థి సోదరులు యీనాడు సాగించే పోరాటం కేవలం వారి పోరాటమేగాదు, లేదా ఏ కొద్దిమంది వ్యక్తులకోసంజరిపే పోరాటమేగాదు. బూజు పట్టిపోయిన బానిస విద్యా విధానాన్ని రూపుమాపి దేశభక్తియుతమైన విద్యావిధానము కొరకు జరిపే పోరాటమే యిది. విద్యార్థుల యొక్క పౌరసత్వ హక్కులకోసం వీరు సాగించే ఈ పోరాటం రాష్ట్రములోని విద్యార్థులందరి పోరాటం. ఈ రెండు చోట్ల విద్యార్థులు జయం పొందటమంటే అది డిటెన్షన్ విధానానికి వ్యతిరేకమైన విజయం. అది రాష్ట్రంలోని విద్యార్థులందరి విజయం. కాబట్టి విద్యార్థి హక్కులకోసం జరిగే యీ పోరాటములో అగ్రగామిగా నిలబడిన బందరు, గుంటూరు విద్యార్థులలో వచ్చిన ఐక్యతనే ఆదర్శంగా తీసుకుని రాష్ట్రములో విద్యార్థులందరూ పనిచేయాలి.

విజ్ఞప్తి

ఇంతవరకు యీ పోరాటాలలో విద్యార్థుల న్యాయమైన కోర్కెలను బలపర్చుతూ, వారి పోరాటాలకు అండగా నిలిచిన ప్రజానాయకులను, సంస్థలను, వార్తా పత్రికలను అభినందించుచున్నాను. ప్రజాస్వామ్యాన్ని కోరే తదితర నాయకులు, సంస్థలు. పత్రికలు గూడ పై ఆదర్శాన్ని అవలంబించి విద్యార్థులను బలపర్చవలసిందిగా కోరుచున్నాను. ఈ అసాధారణ పరిస్థితులలో ప్రభుత్వం, యూనివర్సిటీ, కలుగజేసుకొని విద్యార్థులకు న్యాయాన్ని కలుగజేయాలనీ గుంటూరు, బందరు కాలేజీల ప్రిన్సిపాళ్ళను తొలగించాలనీ. ప్రతి సంవత్సరం యిలాంటి సమస్యలు తెచ్చి కాలేజీల శాంతిని భంగపరచే కమిటీల మేనేజిమెంటునుండి విద్యాలయాలను తీసుకొని ప్రభుత్వమే నడపాలనీ తీవ్రమైన ఆందోళన జరపవలసిందిగా విద్యార్థులను. ప్రజలను కోరుచున్నాను.

1000 మంది సాయుధ సైనికులతో రెండురోజుల హోరాహోరీయుద్ధం!

"సర్ సి. పి. ప్రభుత్వం నశించాలి" అంటూ పోరాటం

స్వాతంత్ర్య ప్రియులెవ్వరూ వాయలార్ వీరుల్ని మరచిపోరు

త్రిరువాన్కూరు భారతదేశానికి దాగా దక్షిణాన, పడమటి కోస్తానానుకొని వున్న సంస్థానం. దీని వైశాల్యం 7,62,474 చదరపు మైళ్ళు. జనాభా 61 లక్షలు.

కోస్తా పొడుగు 175 మైళ్ళు. అటం శక్తిని ఉత్పత్తిచేసేందుకు యీ సంస్థానంలో అతి ముఖ్యమైన థోరియం గనులు హెచ్చుగా వున్నాయి. ఈరెండు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు ప్రాణపదం.

సంస్థానంలోగల పరిశ్రమలన్నీ యూరపియను కంపెనీలవే. రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, టీ, కలప, కొబ్బరి పీచు పరిశ్రమ అన్నీ వాలవరకు బ్రిటిష్ షావుకార్ల చేతుల్లోనేవున్నాయి. వారి దోపిడీకి అంతులేదు. కంపెనీలకు ఆదాయపు పన్నుకూడా లేదు.

ప్రజలకు ప్రధాన జీవితాధారం వ్యవసాయమేయైనా, నూటికి 10 మందికి కూడా స్వంతభూమిలేదు. వ్యవసాయదారులలో ఎక్కువమంది కౌలుదారులే:

సంస్థాన ఆదాయం 10 రెట్లు పెరిగింది!

విదేశీ పెట్టుబడిదారుల, దేశీయ భూస్వాముల దోపిడీకి ప్రజలు ఎదురు తిరగకుండా చూడడమే సర్ సి. పి. ఈ పదేళ్ళనుండీ చేస్తున్న పని. ఈ పదేళ్ళలో ప్రజా సౌకర్యాలు హెచ్చుకపోయినా, సంస్థానపు ఆదాయం నాలుగు రెట్లు పెరిగింది.

తిరువాన్కూరులో పండే పంట అక్కడి అవసరాలలో నూటికి నల్పై పాళ్ళకు కూడా సరిపడదు సర్ సి. పి. వచ్చిన పదేళ్ళలోనూ ధాన్యపు పంట పెగరలేదు. ఉన్నదాంట్లో కూడా నూటికి 10-12 వంతులకంటె ఎక్కువ కంట్రోలు రేట్లకు దొరకడంలేదు. మిగిలినదంతా బ్లాక్ మార్కెటు.

సంస్థానాదాయం ఏడాదికి 2 కోట్ల నుంచి 8 కోట్లకు పెరిగింది. ఎక్సైజు ఆదాయం 23 లక్షల నుంచి 157 లక్షలకు. అడవుల ఆదాయం 13 లక్షల నుంచి 100 లక్షలకు. భూమిపన్ను 41 లక్షల నుంచి 2 కోట్లకు పెంచాడు.

ఈ ఆదాయంలో 25 లక్షలు రాజ కుటుంబానికే. 6 కోట్లు ప్రభుత్వోద్యోగులకు, సైన్యాలకు, పోలీసులకు ఖర్చు.

ఇక ప్రజలకు మిగిలిందేమిటి? పన్నులిచ్చుకోవడం, పస్తువడుకోవడం.

పౌరసత్వపు హక్కులేవీ లేవు.

1937 లో ప్రజల తిరుగుబాటు

ఈ భయంకర దాస్యాన్ని భరించలేక, 1937—38 లో ప్రజలు తిరుగుబాటు చేశారు. పట్టిచేతులతో పోలీసు లాఠీలను, తుపాకులనుఎదుర్కొన్నారు. చెంగనూర్ అనేచోట ప్రజలు అద్భుత పరాక్రమాన్ని ప్రదర్శించి మిలిటరీని 3 రోజులపాటు దూరాన నిలబెట్టారు. కడక్కల్ లో రైతులు గెరిల్లా పోరాట పద్ధతులు అవలంబించి, అడవులలోనుంచి ఎన్నో నెలల వరకు పోరాటాలు సాగిస్తూ వచ్చారు. పోలీసులు 50 మందిని కాల్చి చంపాడు. 10-15 గురిని ఉరితీశారు: 500 మందిని జైళ్లలో పెట్టారు. అయినా ప్రజలు లొంగలేదు. 1938 అక్టోబరు 24 న 2 లక్షల మంది నిరాయుధులైన కాంగ్రెసు వలంటీర్లు తిరువేంద్రంలోని మహారాజా వారి కోటమీదకు వెళ్ళేటప్పటికి రాజు, దివానుకూడా పారిపోయారు.

సంస్థాన కాంగ్రెస్‌లోని మితవాదులు తాము ప్రారంభించిన ప్రజోద్యమం యొక్క తీవ్రతకు బెదిరి దానిని నిలిపివేశారు.

ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌లో లక్షమంది సభ్యులు

అటుతర్వాత సంస్థానంలో శ్రామికోద్యమం చాలా బలపడింది. లక్షమంది సభ్యత్వంతో అఖిల తిరువాన్కూరు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు బలపడింది. ఈ కార్మికోద్యమంలోంచి బలీయమైన కమ్యూనిస్టుపార్టీ పుట్టి ప్రధాన రాజకీయ పక్షాలలో ఒకటిగా తయారైంది. కమ్యూనిస్టుపార్టీ సంస్థానంలో వేరువేరు తెగల హిందువులు, అస్పృశ్యులు, క్రిస్టియన్లు అందరినీ ఐక్యపరచింది.

యుద్ధ ప్రారంభంతో ప్రజల పరిస్థితులు మరింత దుర్భరమైనాయి. అది యుద్ధం ముగిసినాక మరింత తీవ్రం అయినాయి. సైన్యాలనుంచి తిరిగివచ్చిన సైనికులు, కార్మికులు నిరుద్యోగులుగా తయారయ్యారు. ఆహారకరువు సర్వత్రా వ్యాపించింది.

ఈ పరిస్థితులలో దివాన్ సంస్కరణలంటూ కొన్ని తెచ్చాడు. వాటి పేరుతో రాజ్యాంగసభలో బ్రిటిష సామ్రాజ్యానికి సేవకుడుగా నాటకం ఆడాలని ఆయన ఎత్తు. దానిని ఎదిరించిన కాంగ్రెసు అతివాదుల్ని, కమ్యూనిస్టుల్ని, ప్రజానాయకుల్ని జైళ్ళలో పెట్టాడు. లాఠీలు విసిరాడు. తుపాకులు కాల్పించాడు. సైనికశాసనం, సైనిక రాజ్యం నెలకొల్పాడు.

కాని, ప్రజలు అంత చులకనగా లొంగలేదు. పిడికిళ్ళు బిగించి, యుద్ధరంగానికి ఉరికారు.

పొన్నప్రావద్ద

పొన్నప్రా గ్రామంలో శాంతిరక్షణ కనే మిషతో, దివాన్ సర్. సి. పి. పంపిన మిలిటరీ, గ్రామస్థుల జీవితాలను దుర్భరంచేసివేసింది. ఇంక భరించలేక ప్రజలు అక్టోబరు 24 వ తేదీన మిలిటరీ క్యాంపుమీద పడ్డారు. ఆరోజు మహారాజా జన్మదినం. సర్. సి. పి. తన సంస్కరణలను ప్రవేశపెట్టటానికి నిర్ణయించిన శుభదినం. పాపం దివానుకు ఆ ఆనందం అనుభవించే యోగం లేకపోయింది. ఆయన పంపిన మిలిటరీ ఒక చిన్నపల్లెటూరువద్ద నిరాయుధులైన ప్రజలచేతుల్లో పరాజయం పొందింది. క్యాంపు సమూలంగా నాశనం అయింది. ఒక్క సైనికుడుకూడా ప్రాణాలతో మిగలలేదు.

ఇక్కడ ప్రజలు చూపిన అమృత సాహసపరాక్రమాలను గురించి ఇప్పటి వరకు మనకు తెలిసినది ఒక్కటే. సిపాయీలు రైఫిళ్ళతో గుండ్లు కురిపిస్తున్నా ప్రజలు వెనుతిరగలేదు. చనిపోయినవారిని కూడా గమనించకుండా మీదపడిపోయి మిలిటరీ దళాన్ని చంపేశారు. ఇంతే ఇప్పటివరకు తెలిసింది.

వాయలార్ యుద్ధరంగం

షర్తాలీ తాలూకాలో పడమట్ట కోస్తాన, వాయలార్ అనే చిన్న గ్రామం ఉంది. సముద్రంలోకి చొచ్చుకొని వున్న చిన్న భూభాగంమీద అదికట్ట బడింది. మూడు వైపులా నీరు. ఒక వైపునే మాత్రమే ప్రధాన భూభాగంతో సంబంధంవుంది.

గ్రామంయొక్క జనాభా 3 వేల లోపు. వీరిమీదికి తిరువాన్కూరు దివాన్ వేయిమంది సైనికులను పంపించాడు. అక్టోబరు 30 న. రెండురోజులు యుద్ధం చేసి వారా పల్లెను లొంగదీశారు.

మరువనాని రెండురోజులు

సర్ సి. పి. కొచ్చిన్ హార్బరునుండి 250 మంది నీగ్రోసైనికుల్ని రప్పిస్తున్న వార్త చేరగానే, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన వాయలార్ ప్రజలు ఆత్మరక్షణకు పూనుకున్నారు. యువకులకు తరిఫీదు నిచ్చారు. ఇంచుమించు 300 మంది స్త్రీలకు కూడా సైనిక శిక్షణ నిచ్చారు. ఇటలీ, ఈజిప్టు రంగాలలో ఫాసిస్టుసేనలతో పోరి, ముక్కాకలు తీరివచ్చిన వీరయోధులు వారికి నాయకత్వం వహించారు.

భూమిమీదుగా లారీలూ సైనికులూ రాకుండా వంతెనలు కూల్చి బాటలకు అడ్డుగా బారికేడ్లు నిర్మించారు. చాలచోట్ల పెద్దపెద్ద గోతులుతీసి, పైన బలహీనమైన మన్ను వేసి గడ్డిపరచి గోతులని తెలియకుండా మాటు పరచారు. ఆరు యిళ్ళున్న ఒక పెద్ద ఆవరణలో ప్రధాన కార్యాలయం తెరచి, దాని రక్షణకు తగు బందోబస్తు చేసుకున్నారు, ఆవరణలోపల కందకాలుతవ్వి, భూగర్భంలో గదులు నిర్మించుకున్నారు. ఆఫీసువున్న ఆవరణచుట్టూ కొబ్బరి దుంగలుపేర్చి, గట్టిగా కొబ్బరి తాళ్ళతో కట్టి గోడలాగ తయారు చేసుకున్నారు.

కాని, వారివద్ద ఆధునిక అయుధాలు ఏవి? "ఆధునిక యుద్ధపరికరాలన్నింటితోనూ వున్న మిలటరీని కమ్యూనిస్టులు ఎదిరింపగలమని ఆశపడ్డారు," అని మలబార్ మెయిల్ పత్రిక వెక్కిరించబోయి, కమ్యూనిస్టుల, ప్రజల ధైర్య సాహసాలను బయటపెట్టింది.

వేయిమంది సైనికులతో హోరాహోరీ యుద్ధం

మూడు పెద్ద పడవలలోను, లారీలలోను వేయిమంది సైనికులు, పోలీసులు వాయలార్‌ను నాలుగువైపుల నుంచీ ముట్టడించారు. ప్రజలు బ్రహ్మాండమైన ప్రతిఘటన నిచ్చారు. "ఎన్నోమారులు కమ్యూనిస్టులు విల్లు అంబులతోనూ, కొబ్బరిమట్టలతో చేసిన ఈటెలతోనూ మిలిటరీని తరిమికొట్టారు. వీరిని రైఫిళ్ళతో లొంగదీయడం సాధ్యంకాక మరఫిరంగులతో కాల్చవలసివచ్చింది" అని పై పత్రికే మిలిటరీ తీసుకొన్న తీవ్రచర్యలను సమర్థించబోయింది.

"దివాన్ సర్ సి. పి. ప్రభుత్వం నశించాలి" "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదాల నిస్తూ ప్రతిమనిషీ కొసకంటా నిలబడ్డాడు. వెనక్కితగ్గే సూచనను ఒక్కడూ కనబరచలేదు" అని యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూచినవారొకరు 'దీపం' అనే పత్రికలో వ్రాసారు.

ఆడవాళ్లుకూడా

"ఆడవాళ్ళుకూడా రాళ్ళు, కొడవళ్ళు తీసుకొని, ముందుకు వురికారు. బాహాబాహి సైనికుల నెదుర్కొన్నారు. ఎందరో కాల్చివేయబడ్డారు" అని ఆ విలేఖరి వ్రాస్తున్నాడు.

"రెండు పక్షాలలోనూ కూడా చాలమంది చనిపోయారు. కాని ఎందరో లెక్కచెప్పడంకష్టం" అన్నాడు. అందులోనే.

"వాయలార్‌లోని నాలుగు వేల మందిలో ఎందరు చనిపోయారో, ఎందరిని పట్టుకోగలిగారో, ఎందరు తప్పించుకు పోగలిగారో చెప్పలేము" అన్నాడు, మలబార్ మెయిల్ విలేఖరి.

దీనికి వ్యాఖ్యానం అక్కరలేదు. చచ్చిపోయినది ఎందరైనా కానీండి. నిరంకుశ ప్రభుత్వాలు తమ ఆయుధబలంమీద ఆధారపడి బ్రతకగలిగే రోజులు పోయాయని వాయలార్ ప్రకటించింది.

> ## కాశ్మీరసింహం రణగర్జన
>
> కాశ్మీరసింహం షేక్ అబ్దుల్లా జైలు నుండి ఈదిగువ సందేశం పంపారు:
>
> ప్రియసహచరులారా,
>
> ఇది మన అంతిమపోరాటం. విజయమో వీరమరణమో. మనమీద పెత్తనం చలాయించడానికి మహారాజా హరిసింగ్‌కు నైతికంగాగాని, న్యాయశాస్త్రరీత్యాగాని ఏ విధమయిన హక్కులేదని చెప్పాను. ఇప్పుడూ చెప్తున్నాను. వీలయినప్పుడల్లా ఆయన చలాయిస్తున్న అధికారాలను వ్యతిరేకిస్తాం.
>
> బ్రిటిష్ సామ్రాజ్యవాదం భారతదేశం నుంచి పోగానే, సర్వాధికారాలు ప్రజల హస్తగతం అవుతాయి. ప్రజలతో పెట్టుకోవలసిన సంబంధాలు ఎలా వుండాలో కాశ్మీర మహారాజానే ఆలోచించుకోమనండి.
>
> ప్రజల కోరికలను అంగీకరించుతేనే మహారాజాకు ప్రజలకు సంధి కుదురుతుంది. లేకపోతే లేదు.
>
> ఇదే మా అఖండితమైన సమాధానం. దీనిని అంగీకరించడమో, కొసకంట పోరాడటమో మహారాజానే నిర్ణయించుకోనీండి. ప్రజలు కావాలా - ప్రధాని రామచంద్రకాక్ కావాలా. కాక్ గద్దెమీద వుండగా శాంతి అనేది సున్న.
>
> కామ్రేడ్స్! అభివృద్ధి శత్రువుల, నాగరికతా శత్రువుల కోటపై అంతిమపోరాటానికి తయారు కండి. విజయం మనకే. తప్పదు.
>
> న్యాయంకోసం జరుగుతూన్న ఈపోరాటంలో వ్యక్తుల కష్టాలు గణనకురావు. మన హృదయాలలో ఎప్పుడూ మన ఆదర్శాలే ప్రథమస్థానం వహించాలి.
>
> విప్లవం వర్ధిల్లాలి!
>
> కాశ్మీర్ విడిచిపోవాలి!
>
> అమృతసర్ సంధి రద్దు గావాలి!
>
> — షేక్ మహమ్మద్ అబ్దుల్లా

స్వాంత్ర్య ప్రియులెవ్వటూ వాయలార్ ధీరుల్ని మరువజాలరు. ఆ పాతాలనూ మరచిపోరు.

సర్ సి. పి. శివాలు

నవంబరు 1 న లెఫ్టినెంట్ జనరల్ సర్ సి. పి. అంబలపూజ-షర్తాలీ తాలూకాలోని కార్మిక సంస్థలన్నింటినీ నిషేధిస్తూ ప్రకటన చేశాడు. యూనియన్ ఆఫీసులన్నీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రజెండాలు చింపివేస్తున్నారు. కార్మికుల ఇండ్లమీద పడి భీభత్సాలుచేస్తున్నారు. యూనియన్లలో ఎక్కువ శ్రద్ధతీసుకోనే కార్మికుల పేర్లను యజమానులు వ్రాసి యివ్వడం, వారిని పోలీసులు అరెస్టుచేసి, లాకపులో నానాహింసల పాలుచేయడం ఇవి సర్ సి. పి. ఫాసిస్టు పరిపాలనలో నిత్య కృత్యాలయిపోయినాయి.

టి. వి. థామస్ (అఖిల తిరువాన్కూరు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు)ను అరెస్టుచేసి ఆయన ఇంటిమీద దాడిచేశారు, ఇంట్లోవున్న సామానులన్నీ నాశనంచేసి, ఆయన తండ్రినీ, చెల్లెలినీ వీధిలోకి గెంటివేసి ఇల్లు సీలు చేశారు.

జమీందార్ల రౌడీలు, పరిశ్రమల యజమానుల దొంగకూలీలు, పోలీసులు, మిలిటరీ నేడు తిరువాన్కూరులో పరిపాలన సాగిస్తున్నారు. కార్మికులను కొట్టడం, ఇళ్ళు తగులబెట్టడం, స్త్రీలను చెరచడం తిరువాన్కూరులో నేడు నిత్యఘటనలుగా వున్నాయి.

మద్రాసు పోలీసులుకూడా

ఈ రాక్షస పరిపాలనకు మద్రాసు కాంగ్రెసు మంత్రుల చేతులలోని పోలీసుశాఖ తోడుఅవడం నిజంగా స్వాతంత్ర్య కాముకులయిన కాంగ్రెస్‌వాదులకు తలవంపు. నవంబరు 4 వ తేదీన కాలికట్ పోలీసులు తిరువాన్కూరు ప్రభుత్వం కోరికమీద ఏవిధమైన వారంటూ లేకుండానే వర్గీస్ వైద్యర్‌ను అరెస్టుచేసి రిమాండులో వుంచారు. వైద్యర్ తిరువాన్కూరులోని సుప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకులలో వొకరు. తిరువాన్కూరు వ్యవసాయ కూలీసంఘానికి అధ్యక్షులు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు కార్యకర్తలలో వొకరు. అక్టోబరు 23 న సర్వ వ్యాపితసమ్మె ప్రారంభించిన నాటినుండీ ఈయన కాలికట్‌లో వుంటూ సమ్మె విషయాలు ప్రపంచానికి తెలియ బరుస్తున్నారు. ఈయనను అరెస్టు చేయడానికి ప్రకాశంగారి పోలీసులు సాయపడడమా! కాంగ్రెస్ స్థితి ఎంతలోకి వస్తుంది!

అబద్ధపు నోటీసులు

ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షులు టి. వి. థామస్ అరెస్టు అయిన తర్వాత ఆయనపేరిట సమ్మె విరమించమని అబద్ధపు నోటీసులు ప్రకటించి పంచబడుతున్నాయి. దీనిని తిరువాన్కూరు పత్రికలన్నీ పెద్ద పెద్ద అక్షరాలతో ప్రకటించాయి. కాని, కార్మికులెవ్వరూ వీనిని నమ్మలేదు. ఒకమూల తమ గృహాలను సైనికులు నేలమట్టం చేస్తూ, తుపాకులుచూపి, భయపెట్టి తమ స్త్రీలను అవమానపరుస్తూంటే కార్మికులు షావుకార్ల దొంగనోటీసులు నమ్ముతారా?

కొచిన్‌లో సోదాలు

నవంబరు 1 వ తేదీన ప్రొద్దున్నే కొచిన్ రిజర్వు పోలీసులు కామ్రేడ్ కృష్ణన్ ఇంటిని చుట్టుముట్టారు. ఏ వారంటూ చూపకుండా ఇల్లంతా సోదా చేశారు. తిరువాన్కూరు ప్రజానాయకులు ఎవరో అక్కడ వున్నారని వాళ్ళ అనుమానం. కాని లాభించలేదు. వెళ్ళిపోయారు.

జనపవిత్తనాల స్టాకును దాటిపోనీయకండి

రాష్ట్ర రైతుసంఘం హెచ్చరిక

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి నందూరి ప్రసాదరావుగారు ఇలా ప్రకటిస్తున్నారు:

జనప విత్తనముల ధర రైతుల కందుబాటులో లేనట్లుగా పెరిగిపోతున్నది. కాబట్టి రు 20 లకు కంట్రోలు చేయవలెననీ, ధరల కంట్రోలుతోబాటు స్టాకులనుకూడా వశపరచుకొని రైతులకు వ్యవసాయ డిపోలద్వారా, స్టోర్సు ద్వారా అమ్మించాలనీ లోగడ ప్రభుత్వానికి జాబు వ్రాశాము. ప్రభుత్వం బస్తా 1 కి రు 22 ల చొ॥ ధరనుమాత్రం కంట్రోలుచేసి పూరుకున్నది. వెంటనే 28-10-46 న మరల ఒక వుత్తరం వ్రాస్తూ, స్టాకులపైకూడా కంట్రోలు వుండవలసిన ఆవశ్యకతనుగూర్చి మరల హెచ్చరించాను. కాని ప్రభుత్వం స్టాకులను స్వాధీనపర్చుకొని రైతుల కందించుటను ఇంతవర కెట్టి ఏర్పాట్లను గావించలేదు.

షాహుకార్లు వేలకొలది బస్తాలను నిల్వజేసియున్నా, ఒక్క గింజనుకూడా ఈనాడు అమ్మటంలేదు. పైగా, ప్రభుత్వమే తెచ్చిపెడుతుందిలే అని ఈసడిస్తున్నారు. విత్తులుచల్లే తరుణం ముందుకు వస్తోంది. కాబట్టి ప్రభుత్వం తక్షణం కదలవలసిన తరుణంవచ్చింది.

భీమవరంలో తాశీల్దారు సుమారు 400 బస్తాల జనపవిత్తనాలను పట్టుకొని సీలు వేశాడు. బెజవాడలో పోలీసు సర్కిలు ఇన్‌స్పెక్టరు సుమారు 650 బస్తాలను స్వాధీనపర్చుకున్నాడు. కాని వాటిని అమ్మించుటకై తమకు అధికారం లేదని తాశీల్దారూ, సబ్ కలెక్టరూ కూడా చెప్పుచున్నారు. ఈలోగా, వున్న ఇతర స్టాకులను షాహుకార్లు దాచివేస్తున్నారు. కావున్ సబ్‌మేజిస్ట్రేటుహోదాకు తగ్గని ఉద్యోగులందరూ నిల్వ స్టాకులను స్వాధీనపర్చుకొనునట్లు అధికారమీయాలనీ, స్వాధీనవర్చుకోబడిన స్టాకులను స్టోర్సు, వ్యవసాయ డిపోలద్వారా కంట్రోలు రేట్లకు అమ్మించాలనీ, ఖర్చులు మినహాయించి మిగతా మొత్తం షాహుకార్లకియ్యాలనీ, ఉలవలు మున్నగు ఇతర విత్తనాల విషయాల్లో గూడా ఇట్టి చర్యలనే గైకొనాలనీ ప్రభుత్వానికి మరల వ్రాశాము. రైతులు వీటి కొరకై ప్రభుత్వాన్ని ఒత్తిడిచేస్తు వ్రాయ గోర్తాను.

ప్రభుత్వం పై చర్యలు దీసుకొనేలోగా షాహుకార్లు స్టాకులను దాచేయకుండా రైతులు జాగ్రత్తపడాలి. వెంటనే ఎక్కడెక్కడ స్టాకులు నిల్వవున్నవో అధికారులకు తెలియజేసి, వారి స్వాధీనం చేయాలి. తాము అశ్రద్ధజేస్తే విత్తనాలూ దొరకవు, ధరలూ పెంచబడుతవి అని గుర్తించ గోర్తాను. గాభరా కొద్ది చాటు మాటున హెచ్చుధరలకు కాని కంట్రోలు లాభాల్ని జారవిడువవలదనీ, షాహుకార్లకు దొంగవ్యాపారాన్ని సాగించుటకు అవకాశాన్ని కల్గనీయవలదనీ కోరుచున్నాను.

జనుప విత్తనాలకు బెజవాడ రండి!

బెజవాడ తాలూకా రైతుసంఘకార్యదర్శి అడుసుమిల్లి సత్యనారాయణగారిలా వ్రాస్తున్నారు:

రైతులకు అమ్మకుండా దాచిన జనుములు 620 బస్తాలను పట్టుకొని రైతుసంఘం అధికారులకు రిపోర్టుచేసింది. అధికారులు సీలుచేశారు. వర్తకులవద్ద 2 వేల బస్తాలు నిల్వవున్నాయని తెలిసి కలెక్టరుగారు కమర్షియల్ టాక్సు ఉద్యోగిని పంపారు. కాని వర్తకులు సరుకును బయటపెట్ట నిరాకరించారు.

జనుముజల్లేఅదనువచ్చుటచే రైతులు విత్తనాలు దొరకక యిబ్బందిపడుతున్నారని కలెక్టరుగారికి రైతుసంఘం తెలియజేసింది. సీలుచేసిన 620 బస్తాలను రైతులకు అమ్మించుతామని కలెక్టరుగారు వాగ్దానంచేశారు. కాబట్టి జనుములు కావలసిన రైతులు 11 వ తేదీ సోమవారం బెజవాడ రావలసిందని కోరుతున్నాను.

దైనందిన జీవితంలోని కష్టనివారణకై

వ్యవసాయకూలీల ముందంజ

గుంటూరుజిల్లా సంఘ కార్యవర్గ నివేదిక

[వ్యవసాయకూలీ వుద్యమంయొక్క దినదినాభివృద్ధికి ఉదాహరణగా గుంటూరుజిల్లా వ్యవసాయకూలీ సంఘంవారి వార్షిక నివేదికలోని కొన్ని ముఖ్య భాగాలను యీ క్రింది ప్రకటిస్తున్నాం. — సంపాదకుడు]

నేటికి వ్యవసాయకూలీసంఘాలు బలపడి, వ్యవసాయకూలీ ఉద్యమం ఒక రూపం ధరిస్తోంది.

మొదటి రోజులలో పల్లెలలోని సాంఘికాచారాలు, కులపెద్దల అధికార ప్రాబల్యము, మతగురువుల మాయ మాటలు, ప్రజల అసూయాతత్వం అడుగడుగున ఉద్యమానికి అడ్డుకట్ట లయ్యాయి. కూలీ వుద్యమ నిర్మాతలు, ఆదర్శ మతబోధకులవలె కూలీల లోనికి చొచ్చుకుపోయారు. కూలీల కష్టసుఖాల్లో లీనమయ్యారు. కూలీల సమస్యలపై పనిచేసి నిద్రించుచున్న కూలీ లోకాన్ని మేల్కొల్పారు.

బంజరుసాగు

ముఖ్యంగా చేసిన చాకిరికి ఫలితము రాక, ఆకలి మంటలతో బాధపడుచున్న వ్యవసాయకూలీలకు బంజరుభూముల ఆక్రమణలో సంఘాలు పనిచేయటం మొదలుపెట్టాయి పెద్దరైతుల పోటీలను వుద్యోగస్థుల లంచగొండితనాన్ని ఎదుర్కొంటూ మూడుతాలూకాలలో కొన్ని వందల ఎకరాలు సాగులోనికి తేబడినవి. బాపట్లతాలూకాలో నల్లమడ వాగుక్రింద 150 ఎకరాలు చేస్తుంటే, ఆ భూములకు అయిదారు సంవత్సరాలనుంచి పట్టాలు [illegible]సలపాడు, నందిపాడు కరణాలు అటంకాలు కల్పిస్తూ, లంచాలు ఇవ్వమని కూలీలను వేధిస్తుంటే కూలీ సంఘం యీ అన్యాయాలను ఎదుర్కొని నిలిచింది. రేపల్లెతాలూకా గంగడిపాలెం మునసబ్ కుతంత్రాలతో వ్యవసాయకూలీలకు, బీద రైతులకు దక్కకుండా 700 ఎకరాలు ఆక్రమించుకొని, పిల్ల జమీందారులాగా తిరుగుతున్నాడు. బాపట్లతాలూకాలోని 12000 ఎకరాల బంజరులో అప్పుడే వివిధ ప్రాంతాల ధనిక రైతులు గట్లుపెడుతున్నారు. రేపల్లెతాలూకాలోని చోడాయపాలెం, విజాంపట్నం ఏరియాలలో 20 వేల ఎకరాల బంజరువుంది. ఈభూములన్నీ ధనికరైతులు, వుద్యోగస్తుల మద్దతుతో ఆక్రమించకుండా వెంటనే ఆపుచేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ భూములకు నీటి వసరులు కల్పించి కష్టించే కూలీలకు, బీద రైతులకు సంక్రమింపజేయాలని కోరారు.

బెనెఫిట్ సొసైటీలు

వ్యవసాయకూలీలకు సంబంధించిన బెనెఫిట్ సొసైటీలు రేపల్లె, తెనాలి తాలూకాలలో చాలవరకు పల్లెల్లోని స్వార్థపరులచేతుల్లో వుండేవి. సొసైటీ భూములు ఈ స్వార్థపరుల సొంత సొమ్ముగా తయారైనాయి. అమాయకులైన కూలీలను మోసంచేసి ఈ భూముల్ని కౌలుకిచ్చి వేలకువేలు గడించసాగారు. భూముల సాగుకవి తెచ్చిన అప్పులు దిగమ్రింగేవారు. పెదపులివర్రు కరణం కూలీల్లో చీలికలుపెట్టి 10 ఎకరాలు సొంతంగా పొగాకు వేసుకుంటున్నారు. అక్కివారిపాలెం కూలీలపై వితూరీలుచెప్పి, కూలీలకు భూము లేకుండా చెయ్యచేయగల్గారు. కాని మన సంఘ బలముచే తిరిగి ఆ భూమిని లాక్కొని స్వార్థపరుల ఆటలు కట్టించగల్గాం. మోర్తోట, బొబ్బర్లంకల్లో సొసైటీభూముల్లో కూలీలే ఆహార పదార్థాలు పండిస్తున్నారు. రేపల్లె తాలూకాలో స్వార్థపరుల చేతులలోనుంచి. ప్రజలు 30 సొసైటీలను గుంజుకొని ప్రజాస్వామ్య పద్ధతుల్లో నడిపిస్తున్నారు. తెనాలి తాలూకా కొల్లిపరలో స్వార్థపరులు లంకభూముల్ని సాగుచేయించి చివరకు ఏకొద్దిగానో మొక్కుబొన్నలు తెచ్చి ఎలాగోని పాపమా అంటూ కొల్చిన రోజులున్నాయి. కాని వ్యవసాయ కూలీలు యీ స్వార్థపరుల బారి నుండి సొసైటీని రక్షించుకున్నారు.

సాంఘికాచారాలు

మాలమాదిగ సహపంక్తి భోజనాలు, గజ్జెలగాదాలు, యింకా సమస్యలుగానే వున్నయి. రాజకీయంగా అభివృద్ధి చెందిన దావులూరు, బేతపూడి పల్లెల్లో తప్ప మిగతాచోట్ల ఈ జాడ్యము బాగా బలిసివుంది. పల్లెల్లోని పెద్దలు, తమ పెద్దరికపు పేరుతో అక్రమమామూళ్లు వసూలు చేయటం. సంఘంమీద కారాలు మిరియాలు నూరటం ప్రతిచోట వుండేది. బాపట్ల తాలూకా ఫల్లుఖానుడు పాలెంలో పల్లెలో పెద్ద, కూలీలను మోసంచేసి మామూళ్ళు, కంట్రాక్టులో కమీషన్లు కాజేసి పదిహేను యేండ్లలో 20 ఎకరాలు పొలం సంపాదించి పిల్ల జమీందారు లాగా పల్లెనేలుతుంటే, అయిదారు సంవత్సరాలనుంచి కూలి సంఘం పై వర్యలను అరికట్టి మామూళ్ళు మాన్పించ గలిగింది. పల్లెల్లో కుల పెద్దలు చేసే దారుణాలకిది ఉదాహరణ. మన సంఘాలు బలపడిన తర్వాత కొద్దిగా పరిస్థితులు మారుతున్నాయి. అప్పుడే కొన్ని పల్లెల్లోని పెద్దలు తమ కాళ్ళక్రిందవున్న యిసుక కదులుతుందని తెలుసుకున్నారు. లోగడ వ్యతిరేకత తగ్గుతోంది. సంఘ బలిమిని గుర్తిస్తున్నారు. పల్లెల్లో విద్యాధికులు మొదట్లో సంఘాలను వ్యతిరేకించినా క్రమేపి సంఘాలను బలపరుస్తున్నారు. మతగురువులు సహితం మొదట్లో వ్యతిరేకించినా, ఈనాడు సంఘశక్తిని, కార్యక్రమాన్ని దీక్షను వేనోళ్ళ కొనియాడుచున్నారు.

ఈ కష్టనిష్టురాలలో సాంఘికాచారాలలో కూలీ ప్రజాసామాన్యం క్రిందుమీదపడుతూవుంటే గడచిన ఎసెంబ్లీ ఎన్నికలలో కూలీలకు అగ్నిపరీక్షగా వచ్చినయి. తాము నమ్మిన కమ్యూనిస్టు పార్టీకి ఓటుచేయటం తప్పయింది. గ్రామాలలోని ధనిక రైతులు తమ సహజ గుణాలతో కూలీలమీద దాడులు ప్రారంభించారు. చాలచోట్ల చేలల్లోకి, చెట్లలోకి రాకూడదని శాసించారు. కమ్యూనిష్టుపార్టీకి ఓటిస్తే పనుల్లోకి పిలవమన్నారు. చంద్రమౌళిగారి గ్రామమైన మోపర్రులో కూలీలకు సాముదాయక జరిమానాలు వేశారు. క్రైస్తవులకు ప్రాణసమానమైన శిలువను పడగొట్టారు. అప్పికట్లపల్లెను మొత్తంగా లేపివేశారు. ఈ పచ్చి ఫాసిస్టు చర్యల్ని కాంగ్రెసు పేర చాలచోట్ల చేశారు. [illegible] చెప్పే రైతు కూలీ ప్రజారాజ్యపు నీతిలేమో! కాని కూలీలు యేమాత్రం జంకలేదు. ఒక్క అడుగు వెనక్కివేయలేదు. కమ్యూనిస్టు పార్టీ తమ నాయకుడుగా, యెర్రజండా తమ జండాగా ఎంచారు. అమితానందముతో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులకే ఓటుచేసి ఈ ఉన్మాదులకు గట్టిచెంపపెట్టు పెట్టారు.

కౌలుచట్టం

కూలీలలో కౌలుకు భూములు తీసుకోవాలనే మోజు ఎక్కువైంది. ఏదో దిక్కుచిక్కిన బర్రెగొడ్లని రెంటిని సంపాదించటం, కలవారివి నాలుగెకరాలు కవులుకు పుచ్చుకోవటం ఒకరిపై ఒకరు 14 బస్తాలనుండి 19 బస్తాలవరకు పోటీలు పెంచుకోవటం, అలవాటైంది.

కఠెవరం, చదలవాడ, అత్తోటలాంటి గ్రామాలలో బస్తా 13 పౌ 174లు కవులు యివ్వటం మొద్దుకాటాలతో తూకాలు వేయటం అమల్లోవుంది. కొల్లూరులో ఎకరానికి 18 బస్తాల కౌళ్ళుయిస్తూ 10 మానికల మినుములు పప్పులకు సమర్పిస్తున్నారు. ఇవన్నీ చాలవో అన్నట్లు అడిగినప్పుడు కౌలుదారు భూకామందుకు బండి ఎద్దుతో సాయపడటం, రేపల్లెలో స్త్రీశర్ల కొంపల్లో కావలసిన అలుకుమట్టితోసహా కౌలుదార్లు తెచ్చి యివ్వటంలాంటి అన్ని రకాల వెట్టిచాకిరి. కూలీలు కౌలుదార్లుగా చేస్తున్నారు. కాని మన రైతు, కూలీ సంఘాల సంయుక్త ఆందోళనద్వారా 166 పౌన్లు చాలచోట్ల అమలులో పెట్టడం. సరిఅయిన కాటాలతో తూయించటం జరుగుతోంది. ఇంతటితో కౌలుదార్ల కష్టాలు తీరాయా? లేదు. జమీందారీ భూస్వామ్య విధానాన్ని ఎట్టి నష్టపరిహారం లేకుండా వెంటనే రద్దు చేయాలి. పండించేవారికేపొలంయివ్వాలి. కౌలుచేసేవారు పండించేదాంట్లో నాలుగోవంతు కవులు మాత్రమే భూకామందుకు ఇచ్చేటట్లు వెంటనే ప్రభుత్వం కౌలుదారీ చట్టాన్ని చేయాలి. తాత్కాలికంగా కౌలుదారు శ్రేయస్సును దృష్టిలో వుంచుకొని. ఈసంవత్సరమే వున్న కౌళ్ళలో ఎకరం 1కి రెండుబస్తాలు విధిగా తగ్గించాలి.

తిండి, బట్ట కొరత


మాగాణి ప్రాంతంలో ముమ్మరమైన పనివున్న ఏ నాలుగు రోజుల్లోనో రూపాయి మొదలు రూపాయిన్నర కూలికి. మిగతా రోజుల్లో 0—8—0 ల నుంచి 0—12—0 కూలికి కూలీలు తయారుగావడం జరుగుతోంది. రేపల్లె తాలూకా పెదమట్లపూడి ఫిర్కాలో రోజల్లా పనిచేస్తే మూడు తవ్వలు, పిచ్చి తవ్వతో యిస్తున్నారు. కఠెవరంలాంటి కొన్ని గ్రామాలలో సంఘబలంతో కొంత ఎక్కువ కూలి సంపాదించటం జరుగుతోంది. దావులూరు, బేతపూడి, కఠెవరం మొదలైన గ్రామాలలో ధనికరైతులు సంఘాన్ని విచ్ఛిన్నం చేసామని కూలీలమీద కేసులు పెట్టించారు. ప్రతి వస్తువు ధరలు, ముఖ్యంగా తిండి,బట్టధరలు విపరీతంగా పెరిగిపోయాయి. బంగారువంటలుపండే తెనాలి తాలూకాలో రూపాయికి మూడు తవ్వలు బియ్యం అమ్ముతున్నారంటే బీదప్రజలు, ముఖ్యంగా కూలీలు ఎంత కటకటలాడు చున్నారో తెలుస్తుంది. వచ్చినకోటా గుడ్డ మామూలుగా ప్రజలకు అందకుండా దొంగ మార్కెటుకు పోతుంది. ఏకొద్దిమందో నోరుగలవారికి వుద్యోగస్థులకు అందుతుంది. కూలీల పరిస్థితి చెప్పనక్కరలేదు. అందుచేత కూలీలకు పనికివచ్చు గట్టిరకపు గుడ్డలు, చౌకగా ప్రభుత్వం అంద చేయాలి. కూలీల జీవిత పరిమాణం పెరగాలి. ధరల హెచ్చుతగ్గులలో కూలీల జీవన భృతికి గ్యారంటీ. రక్షణ వుండాలి. కాబట్టి ప్రభుత్వము కూలీలకు కనీస కూలీనిర్ణయ చట్టము వెంటనేచేసి. అమలులో పెట్టాలి.

ముందు కర్తవ్యం

వ్యవసాయకూలీల కున్న కష్టాలు పోవాలంటే కూలీసంఘాలను బలపరచాలి. మన సంఘశక్తిని ప్రభుత్వము గమనించేట్లు చెయ్యాలి. కష్టించిజీవించే ప్రతి కులస్తుడూ మన సోదరుడేనని గుర్తించాలి. వివిధజిల్లాలలోని కూలీ సంఘాలను ఐక్యపరచి బలమైన రాష్ట్ర సంఘాన్ని నిర్మించాలి. ఇతరపురోగామి శక్తులతో చేతులు కలిపి దేశస్వాతంత్ర్యాన్ని, కష్టజీవుల రాజ్యాన్ని సాధించాలి.

మహిళా ఉద్యమానికి అరిష్టదాయకం

అఖిలభారత మహిళాసంఘం నుంచి కృష్ణాజిల్లా మహిళాసంఘం రద్దు



డాక్టరు కొమర్రాజు అచ్చమాంబ (కృష్ణాజిల్లా మహిళాసంఘ అధ్యక్షురాలు)

కృష్ణాజిల్లా మహిళా సంఘం 1937 లో స్థాపింపబడి, నాటినుండి నిరంతరాందోళన ద్వారా జిల్లా మహిళలలో ఎంతో చైతన్యాన్ని గలుగజేసింది. రావు కమిటీ బిల్లులను బలపరుచుతూ వందల గ్రామాలలో బహిరంగ సభలు జరిపి, వేల సంతకాలతో గూడిన మహజర్లను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ప్రసూతి శిశు పోషణను గూర్చిన విజ్ఞానాన్ని ఎంతో వ్యాపింప జేసింది. అనేక గ్రామాలలో స్త్రీలకు మరుగుదొడ్లు కోసం ఆందోళన చేసి, కొన్ని గ్రామాలలో జయప్రదమయింది. ఇంకా ఇటువంటి అనేక స్త్రీల సమస్యలను తీసుకొని పనిజేసింది. నేడు 10000 మంది సభ్యులు గలిగిన సంస్థగా అభివృద్ధి చెందినది.

కొండా పార్వతమ్మ ప్రభృతుల కుట్రలు

జిల్లా మహిళల అభిమానాన్ని చూరగొన్న ఈ సంస్థను అఖిలభారత మహిళా సభనుండి బయటికి పంపడానికి, ప్రస్తుతం ఆంధ్ర మహిళా శాఖకు కార్యదర్శినియైన కొండా పార్వతమ్మ ప్రభృతులు అనేక కుట్రలు పన్నారు. అఖిలభారత మహిళాసభాధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవి ఈ పార్వతమ్మగారి కుట్రలకు దోహదమిచ్చినా, అఖిలభారత మహిళాసభయొక్క స్టాండింగు కమిటీ 1945 మే లో సూరతులో జరిగిన సమావేశంలో, అన్నివిషయాలు సమగ్రంగా పరిశీలించినమీదట కృష్ణాజిల్లా మహిళాసంఘంయొక్క 'అఫిలియేషను' ఖాయంజేసి, అఫిలియేషను ఫీజు తీసుకోమనీ సభ్యత్వ ఫారాలిమ్మనీ పార్వతమ్మగారికి తాకీదులు పంపారు. పార్వతమ్మగారు అఖిలభారత మహిళాసభ నిర్ణయాన్ని త్రోసివుచ్చింది. అఖిలభారత మహిళాసభ కార్యదర్శిని శ్రీమతి కుల్సుంసయానీ పంపిన రశీదు[illegible] బుట్టదాఖలు చేసింది.

జిల్లాసంఘం రద్దుచేయబడింది

తెరవెనుక ఏమిభాగోతంజరిగిందో తెలియదుగాని. చివరకు 1946జనవరిలో హైద్రాబాదు (సింధురాష్ట్రం)లో జరిగిన స్టాండింగు కమిటీ సమావేశంలో వెనుకటి నిర్ణయం రద్దుచేయబడింది. ఇంత చరిత్ర గలిగిన పెద్ద సంస్థయైన కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని రద్దుచేసి, దాని సభ్యత్వాన్ని ఆంధ్ర మహిళా శాఖకు ఇమ్మని తీర్మానించబడింది. ఈ నిర్ణయం మహిళా ఉద్యమాభివృద్ధికిగాని ఆంధ్ర మహిళల శ్రేయస్సుకుగాని హానికరం. ఈ నిర్ణయాన్నిగూర్చి కొద్దిరోజుల్లో జరుగబోయే కృష్ణాజిల్లా మహిళాసంఘ సాంవత్సరిక సభ తన అభిప్రాయాన్ని తెలియబరచబోతోంది. అందుచే ఈ విషయాన్నిగూర్చి వివరాలు సోదర మహిళల ముందుంచడం నా కర్తవ్యం.

అఖిలభారత మహిళాసభ కాకినాడలో 1941 లో జరిగినపుడు కృష్ణా జిల్లా మహిళాసంఘం తరఫున ప్రతినిధులు, ప్రేక్షకులు చాలమంది వెళ్ళారు. ఆ సందర్భంలోనే ఆంధ్ర మహిళా శాఖయొక్క సమావేశం గూడ జరిగింది. మహిళా శాఖకు [illegible] శాస్త్రి సీతామహాలక్ష్మమ్మ [illegible] యల్. టి. కార్యదర్శినిగాను కామేశ్వరమ్మ బి. ఎ. [illegible] ఎన్నుకోబడినారు. ఆంధ్రశాఖ స్టాండింగు కమిటీకి కృష్ణాజిల్లా మహిళాసంఘం ప్రతినిధి మానికొండ సూర్యావతిగారు సభ్యురాలుగా ఎన్నుకోబడినారు. తరువాత కృష్ణా జిల్లా మహిళాసంఘం, పశ్చిమ గోదావరి జిల్లా మహిళాసంఘం ఆంధ్ర మహిళాశాఖకు అఫిలియేటు చేయబడినవి కాని ఆంధ్ర మహిళా శాఖ తరఫున ఏమీ పని జరగలేదు. అప్పటి కార్యదర్శిని ఒకటి రెండుసార్లు ఆంధ్ర స్టాండింగు కమిటీని సమావేశ పరచడానికి ప్రయత్నించి 'కోరము' కాకపోవుటచే ఆమె తన పదవికి రాజీనామా నిచ్చింది. అఖిలభారత మహిళా సభవారు శ్రీమతి కొండా పార్వతమ్మను కార్యదర్శినిగా నియమించారు. ఆమె 1944 నవంబరు 11, 12 న గుంటూరులో ఆంధ్ర మహిళాశాఖ వార్షిక సమావేశం జరుగునని ప్రకటించింది. ఆంధ్ర స్టాండింగు కమిటీ సభ్యురాలైన మానికొండ సూర్యావతి గారికి గాని, ఆంధ్ర మహిళాశాఖకు అనుబంధ శాఖయైన కృష్ణాజిల్లా మహిళా సంఘానికిగాని ఆహ్వానాలు పంపలేదు. ఆమెను ఈ విషయం అడిగితే సమాధానం చెప్పలేదు. దీనినిగూర్చి అఖిలభారత మహిళా సభ కార్యదర్శినికి ఆంధ్రశాఖకు అప్పటి అధ్యక్షురాలైన పెద్దాడ కామేశ్వరమ్మ గారికిని తెలియపరచబడినది. అధ్యక్షురాలు ప్రతినిధులతో గుంటూరు మహాసభకు హాజరుకమ్మని వ్రాయుటచే, కృష్ణా పశ్చిమగోదావరి జిల్లాల మహిళాసంఘాల తరఫున డెలిగేట్సు వెళ్ళారు. అక్కడ పార్వతమ్మగారు అభ్యంతరం పెట్టినా, అధ్యక్షురాలు కామేశ్వరమ్మ గారుఅన్నీసమగ్రంగా విచారించిన మీదట పై ప్రతినిధులను అంగీకరించారు.

ఎన్నికలు జరపకుండా కమిటీ నియామకం

మరునాడు అఖిలభారతమహిళాసభాధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవి వచ్చింది. కొండా పార్వతమ్మగారు ఎన్నికలు జరుపకుండా తన కిష్టంవచ్చిన పేర్లతో నిరంకుశంగా ఒక కమిటీని వేసింది. అందులో మొదట కామేశ్వరమ్మగారి పేరుగాని, ఆహ్వాన సంఘాధ్యక్షురాలు డాక్టరు ద్వారకీబాయిగారి పేరుగాని లేదు. కాని కొంత అలజడిజరిగిన తర్వాత పైరెండు పేర్లను జేర్చడం జరిగింది. కృష్ణాజిల్లా మహిళాసంఘం ఎంతోకాలం నుండిపనిజేస్తూ జిల్లామహిళల అభిమానాన్ని చూరగొన్న సంస్థ అయినప్పటికీ, దీని తరఫున ఎవ్వరినీ పైకమిటీలోకి తీసుకోలేదు. ఈ అన్యాయాన్ని గూర్చి శ్రీమతి కమలాదేవికి చెప్పినా, ఆమె చెవినిబెట్టలేదు. పైగా కృష్ణాజిల్లా ప్రతినిధులయెడలపార్వతమ్మగారి బృందం అసభ్యంగా ప్రవర్తించారు. తరువాత కృష్ణాజిల్లా మహిళాసంఘానికి పార్వతమ్మ గారు సభ్యత్వ ఫారాలు ఇవ్వ నిరాకరించింది. 8-2-45 తేదీన ఎవరికీ తెలియకుండా తన బృందంవారిని కొద్దిమందిని సమావేశపరచి కృష్ణాజిల్లా మహిళాసంఘానికి పోటీగా ఒక నామమాత్రమైన జిల్లాకమిటీని ఏర్పరచింది. ఎలాగో ఈ విషయం తెలుసుకొని కృష్ణాజిల్లా [illegible] సంఘ బాధ్యులు అక్క[illegible] మాట్లాడనైనా లేదు. [illegible] మహిళా సభ [illegible]ంది. దానికి షుమారు [illegible] స్త్రీ పురుషులు హాజరు అయ్యారు, సభను ఆశీర్వదించడానికి వచ్చిన అఖిలభారత మహిళా నాయకురాలు శ్రీమతి హాజరా బీగం ఈ సంస్థ యొక్క బలాన్ని స్వయంగా చూచి వెళ్ళింది. తరువాత 1945 మే 8 నుండి 12వ తేదీవరకూ అఖిలభారత మహిళా సభ స్టాండింగు కమిటీ సమావేశం సూరతు పట్టణంలో జరిగింది. ఆ సమావేశంలోఅధ్యక్షురాలు శ్రీమతికమలాదేవిగారు గూడ హాజరు అయ్యారు. స్టాండింగుకమిటీ ఇరుపక్ష వాదనలకు సంబంధించిన పత్రాలు సమగ్రంగా పరిశీలించిన మీదట, కృష్ణాజిల్లా మహిళా సంఘం యొక్క అఫిలియేషన్ ఖాయం జేస్తూ ఈ క్రిందివిధంగా తీర్మానించబడింది.

జిల్లాసంఘాన్ని గుర్తించనందుకు సంజాయిషీ

"కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని గుర్తించనందుకు ఆంధ్రశాఖను సంజాయిషీ కోరడానికి, సత్వరమే గుర్తించమనే స్టాండింగు కమిటీ కోర్కెను తెలియపరచడానికి, గౌరవ ప్రధాన కార్యదర్శికి అధికారమియ్యడమైనది. ఆంధ్రశాఖ కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని గుర్తించి ఆ విషయం గౌరవప్రధాన కార్యదర్శికి తెలియపరచాలి." గౌరవ ప్రధాన కార్యదర్శి శ్రీమతి కుల్సుం సయానీపై తీర్మానాన్ని అమలుపరచడానికి 15 జూన్ 1945 తేదీవరకూ గడువునిస్తూ కొండా పార్వతమ్మగారికి జాబు వ్రాసింది. కాని, కొండా పార్వతమ్మగారు దీన్నిలక్ష్య పెట్టలేదు. శ్రీమతి కుల్సుంసయానీ 1945 జులై 7 తేదీకి గడువును పొడిగిస్తూ కొండా పార్వతమ్మగారికి 1945 జూను 23 తేదీ ఉత్తరంలో యీ క్రిందివిధంగా వ్రాసింది.

"నేను నీకు స్టాండింగు కమిటీ నిర్ణయాన్ని ఇదివరకే తెలియపరచాను. కనుక యీ విషయంలో ఇంకా చేసేదేమీలేదు. స్టాండింగు కమిటీ తన నిర్ణయాన్ని మార్చే వరకూ, ఆ నిర్ణయం అందరూ శిరసావహించాలి. ఈ పరిస్థితులలో నా సలహా ఇదే. స్టాండింగు కమిటీ నిర్ణయంప్రకారం కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని అనుబంధ సంఘం (Constituent branch) గా సత్వరం గుర్తించాలి. ఎట్టి పరిస్థితులలోనూ యీపని 1945 జులై 7వ తేదీలలోగా జరిగితీరాలి. నీవు గుర్తుంచుకోవాలిసిందేమంటే యీ గడువు పొడిగింపు నా బాధ్యతమీదవే ఇవ్వడం జరిగింది. ఎందువల్లనంటే స్టాండింగు కమిటీ ఆజ్ఞ కృష్ణాజిల్లా మహిళా సంఘాన్ని 1945 జూను 15 తేదీలోగా గుర్తించమనే.

జాగ్రత్తగా పరిస్థితులను అవగాహన చేసుకున్నమీదట పూర్తిచర్యల అనంతరం ఏకగ్రీవంగా ఈ నిర్ణయం స్టాండింగు కమిటీచే చేయబడినదని నీకు తెలియపర్చుచున్నాను."

సభ్యత్వంలో అభివృద్ధి; కాని చేర్చవద్దని హుకుం

కొండా పార్వతమ్మ సభ్యత్వ ఫారాలు ఇవ్వకపోవడంవలన, శ్రీమతి, కుల్సుం సయానీ సభ్యత్వఫారాలు అచ్చువేయించుకొని సభ్యులను చేర్చుమని కృష్ణా జిల్లా మహిళాసంఘానికి తెలియపరచింది. దాని ప్రకారం సభ్యత్వఫారాలు అచ్చొత్తించి, సభ్యులను చేర్చుట ఆరంభమయింది. షుమారు 2500 సభ్యులు చేరారు. ఇంతలో అఖిలభారత మహిళాసభ కార్యదర్శినిమండి సభ్యత్వం చేర్చుట ఆపమనీ, అధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవిచే కృష్ణాజిల్లా మహిళా సంఘ అఫిలియేషను సమస్య తిరిగి చర్చకు తీసుకురాబడినదనీ, ఉత్తరం వచ్చింది.

1946 జనవరిలో హైదరాబాదు (సింధురాష్ట్రం)లో జరిగిన స్టాండింగుకమిటీ సమావేశంలో కృష్ణాజిల్లా మహిళాసంఘ అఫిలియేషను రద్దుచేయబడింది. కృష్ణాజిల్లామహిళా సంఘం రద్దుచేసుకొని, కొండా పార్వతమ్మగారి జేబులోని నామమాత్రమైన కృష్ణాజిల్లా శాఖలో సభ్యులుగా జేరమని తీర్మానించబడినది.

అఖిలభారత మహిళాసభ స్టాండింగ్ కమిటీ తీర్మానం

(ఎ) అఖిలభారత మహిళాసభ తన శాఖలలోనికి ప్రత్యక్షంగా సభ్యులను చేర్చుకొనే పాలసీని అవలంబించుతుంది. సంఘాలను అనుబంధించుకునే పద్ధతిని నిరుత్సాహపరుస్తుంది.

(బి) అందుచే కృష్ణాజిల్లా మహిళాసంఘ సభ్యులు ఆంధ్ర మహిళాశాఖయొక్క కృష్ణాజిల్లా ఉపశాఖలో తిరిగి సభ్యులుగా చేరాలి. ఇదివరకే చేర్చబడిన సభ్యత్వరుసుము కృష్ణాజిల్లా ఉపశాఖ పద్దులోకి ట్రాన్స్ఫరు చేయబడాలి."

100010 సభ్యత్వంకలిగి. 10సంవత్సరాల నుండి మహిళాసేవలో కాకలుతీరిన కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని, కొద్ది మాసాల క్రితమే పోటీగా కొద్దిమందితో ఏర్పరుపబడి ఏమీ పనిజేయకుండా మూలబడివున్న కృష్ణాజిల్లా ఉపశాఖలో కలువమనే పై తీర్మానం దోమనోట్లో ఏనుగను దూర్చమన్నట్లుంది.

వెనుకటితీర్మానంమార్చడందేనికి

అధ్యక్షురాలు కమలాదేవి ప్రత్యక్షమయి ఉండగా ఏకగ్రీవంగా అంగీకరింపబడిన వెనుకటి తీర్మానం ఎందుకు తల్లక్రిందులు చేయబడింది? కొండా పార్వతమ్మ ప్రభృతులకు కావలసింది, అజ్ఞానాంధకారాలలో మునిగి తేలుతున్న మన స్త్రీజనోద్ధరణగాదు. మహిళల హక్కులను గూర్చి స్త్రీలలో జాగృతి గల్గించడంగాదు. ఆంధ్ర మహిళా శాఖను జేబులో పెట్టుకొని సాంవత్సరీకాలు జరుపుతూ గొప్పలు చెప్పుకోవడం మాత్రమే ఆమె కార్యక్రమం. ఆమెకే మహిళా ఉద్యమ శ్రేయస్సే మనస్సులో ఉంటే, 10000 సభ్యత్వం గలిగిన కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని వెళ్ళగొట్టడానికి ఇంత తాపత్రయం దేనికి పడాలి? గుంటూరు పశ్చిమ గోదావరిజిల్లాల మహిళా సంఘాలను దరిజేరనీయని కారణమేమి? 1945 ఆరంభంనుండి ఆంధ్ర మహిళా శాఖకు పాలద్యం చేస్తూ ఉందిగదా? ఇంతవరకు మహిళలలో జాగృతికల్గించడానికి

(మిగతా 13 వ పేజీలో)

పాత నిరంకుశ ప్రభుత్వాన్నే అనుసరించడం తగదు

అసెంబ్లీలో కార్మిక బిల్లుపై ఎన్. ఎం. జోషి

ఢిల్లీ, నవంబరు 3

మొన్న కేంద్ర శాసన సభలో, తాత్కాలిక ప్రభుత్వ కార్మికశాఖా సభ్యుడు, జగజీవన్‌రామ్ కార్మిక తగాదా బిల్లును ప్రవేశ పెట్టారు. అందులో దేశరక్షణ చట్టంయొక్క 81ఏ నిబంధనవుంది. యీ చట్టం అక్టోబరు 1వ తేదీతో రద్దయినప్పటికీ 81 నిబంధన మరో 6 నెలలవరకు అమల్లో ఉంటుంది. యీ నిబంధనను జగజీవన్‌రాం అసెంబ్లీలో ఇలా కొనియాడారు.

"ఇతర విషయాల సంగతెలా ఉన్నా, ఈ 81వ నిబంధనవల్ల యుద్ధకాలంలో కార్మిక తగాదాలను పరిష్కరించడానికి ఎంతో తోడ్పడింది. అందులోని ప్రధాన సూత్రం బిల్లులో ఉంది. అంతకంటే ఉదార లక్షణాలు కూడా ఇందులో ఉన్నాయి."

ఈ బిల్లు అమల్లోకి వస్తే, ఏ పరిశ్రమలోను కార్మికులకు సమ్మెచేసే హక్కు ఉండదు. బలవంతంగా రుద్దబడిన మధ్యవర్తి పరిష్కారానికి ఒప్పుకోవలసి వస్తుంది.

నోటీసు ఇవ్వకుండా సమ్మెచేయడం చట్టవిరుద్ధం

ప్రజోపయోగకరమైన పరిశ్రమల్లో జనగా, రైల్వే, ట్రాంవే, పోస్టల్, టెలిగ్రాఫ్, టెలిఫోన్, పవర్‌హౌస్, పబ్లిక్ హెల్త (మునిసిపల్ కార్మికులు) శాఖలలో పనిచేసే కార్మికులు సమ్మె చేయడం ఈ బిల్లు ప్రకారం చట్టవిరుద్ధం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని ఏ పరిశ్రమ నయినా ప్రజోపయోగ పరిశ్రమగా ప్రకటించవచ్చు. ప్రభుత్వం నియమించే ఏ మధ్యవర్తి సంఘాన్నయినా అంగీకరించి తీరాలి. దాని తీర్పుకు కట్టుబడి ఉండాలి.

అంతేకాదు, కేంద్రప్రభుత్వంగాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని, ఉదహరించే యితర పరిశ్రమలకు కూడా యీ నిబంధన వర్తిస్తుంది. మధ్యవర్తి సంఘాన్ని నియమించిన వెంటనే, కార్మికులు సమ్మెచేయడం చట్టవిరుద్ధ మవుతుంది. 26వ నిబంధనల ప్రకారం దీన్ని ఉల్లంఘించినవారికి 1 నెల కఠినశిక్ష, రు 50 జుల్మానా విధించవచ్చు. చట్టవిరుద్ధమైన సమ్మెలకు ప్రోత్సాహం ఇచ్చి నడిపేవారికి 6 నెలలు కఠినశిక్ష, రు 1000 జుల్మానా విధించవచ్చు. సమ్మెనిధికి గాను ధనసహాయం చేసినవారికికూడా యీ శిక్ష విధించవచ్చు.

ఎన్. ఎం. జోషీ వ్యతిరేకించాడు

"ప్రఖ్యాత కార్మిక నాయకుడు," అని జగజీవన్‌రామ్‌చే మన్ననలు పొందిన ఎన్. ఎం. జోషి, దీన్ని సెలెక్టు కమిటీకి పంపే ముందు, ప్రజాభిప్రాయం తెలుసుకోవడం కోసం 1947 అక్టోబరు 19వ తేదీవరకు వాయిదా వేయవలసిందని కోరాడు.

ఆయన ఇలా ఉపన్యసించాడు: ఈ బిల్లులో అతి ప్రధానమైన సూత్రం ఉంది. అది కార్మికుల జీవితానికి చాల హాని చేస్తుంది. తొందరపడి దాన్ని యిప్పుడు ప్యాసు చేయకండి. ట్రేడ్‌యూనియన్ల అభిప్రాయంకూడా తెలుసుకున్న తరవాత చర్చించుదాం. మొట్టమొదటిసారి కాంగ్రెసు, ముస్లింలీగ్ కలిసి ఉన్న ప్రజా ప్రభుత్వం దేశంలో ఏర్పడింది. చాలకాలం మనమంతా దేశరక్షణ చట్టం యొక్క నిబంధనలతో బాధపడ్డాం. మన ఆమోదం లేకుండా ఆ చట్టం అమలు జరుప బడింది. దాని సాకుతో నిరంకుశ ప్రభుత్వం అనేక సమ్మెలను నిరోధించింది. ఇప్పుడు ప్రజా ప్రతినిధులతో కొత్తప్రభుత్వం ఏర్పడింది. అధినా అచట్టాన్ని విడిచిపెట్టడని

కార్మికశాఖా సభ్యుడు పట్టుబట్టడం న్యాయం కాదు.

కార్మికుల అశాంతికి కారణాలు

"మన దేశంలో ఇదివరకెన్నడూ లేనంత అశాంతి కార్మికులలో బయల్దేరిందని ప్రభుత్వ సభ్యుడు తెలియజేశాడు. అయితే, ఈ అశాంతికి కారణం మధ్యవర్తి పరిష్కార మార్గాలు లేకపోవడంవల్ల కాదు. కార్మికులు యుద్ధకాలంలోను, యుద్ధానంతరం అనేక బాధలకు గురిఅయ్యారు. వారికి యిప్పుడిచ్చే జీతాల విలువ యుద్ధానికి పూర్వంకంటె కూడా తక్కువ. యుద్ధం ముగిసిన తర్వాత వారి స్థితిని బాగుచేయడంకోసం మీ రేమిచేశారు? కార్మికుల రక్షణకై ఎన్నో చేస్తామని ప్రభుత్వ సభ్యులలో కొందరు ఉపన్యసించారు. కాని, ఉపన్యాసాలతో కార్మికుల పొట్టలు నిండవు. ప్రత్యక్షంగా మీ రు తీసుకొన్న చర్యలు ఏమిటి — అని నేను ప్రశ్నిస్తున్నాను. ఇతర బిల్లులు చాలా తీసుకురాబోతున్నామని మీరు చెప్పారు. సంతోషమే. కాని, యీలోగా మీరు కార్మికుల జీవితాలను మీ గుప్పిట్లో ఉంచుకోదలచారు.

కోటిమంది కార్మికులకిది హానిచేస్తుంది

"ఈ బిల్లు సుమారు కోటిమంది కార్మికులకు అపకారం చేస్తుంది. మొదట కార్మికుల జీవితానికి భద్రత ఉండేలా చర్య తీసుకోండి. వారికి తరవాతకూడా రాజకీయాధికారం ఇవ్వండి. వారిని ఏ యే కార్యకలాపాలలో పాల్గొనకుండా చేస్తే మంచిదో అప్పుడు మనం ఆలోచించుదాం.

"మానవుడు సహించరాని పరిస్థితుల్లో పని చేస్తే అతడు సమ్మె చేయడం సహజం. సమ్మెలవల్ల కలిగే ఫలితాలను ఆలోచించకుండా కార్మికులెవరూ సమ్మె చేయరు. ఇతర మార్గాలన్నీ విఫలమైన తర్వాతనే సమ్మె చేస్తారు. సమ్మెలవల్ల అందరికంటె ఎక్కువగా నష్టపడేది కార్మికులు. కార్మికులకూ యజమానులకూ మధ్య తగాయిదా ఏర్పడినప్పుడు త్వరలో తీర్పు కలుగజేసుకోవలసిందని కార్మికులు ప్రభుత్వాన్ని అడిగితే, ప్రభుత్వం నిరాకరించిన సందర్భాలెన్నో నేను ఎరుగుదును. సమ్మె ప్రారంభించిన తర్వాత కలుగజేసుకుంటారు. యజమానుల విషయంకూడా ఇంతే.

దుర్భర పరిస్థితులల్లో సమ్మెచేయడం సహజం

కార్మికుల పరిస్థితి దుర్భరమైనప్పుడు, నోటీసు ఇవ్వడంకోసం వేచిఉండకనే కార్మికులు సమ్మెచేస్తారు. అలాంటి సమ్మెలన్నీ క్రిమినల్ నేరాలుగా పరిగణించడం న్యాయం కాదు. అంతేకాదు, నోటీసు యిచ్చినప్పటికీ కొన్ని సమ్మెలు చట్టవిరుద్ధ మవుతాయి. రాజీ ప్రయత్నాల ఫలితం తేలేలోగా సమ్మెచేస్తే అది చట్టవిరుద్ధం అవుతుంది. విచారణ ఎంత కాలమైనా - ఒక సంవత్సరం వరకైనా - కొనసాగవచ్చు.

ఈ బిల్లువల్ల వెట్టిచాకిరి అమల్లోకి వస్తుంది

"నేను శాంతియుతమైన వాతావరణంలో జీవించదలచుకొనే మనిషిని. కాని, కార్మికుల సమ్మెహక్కును యీ విధంగా నిరోధించడానికి నే నంగీకరించను. కార్మికుని 'నువ్వు పలాని షరతులక్రిందనే పనిచేయాలి. లేకపోతే జైలుకు పంపుతా'ననడం, వెట్టిచేయించుకోడం కాక మరేమిటి? ఈ బిల్లువల్ల వెట్టిచాకిరి అమల్లోకి వస్తుంది.

"ప్రజోపయోగ కరమైన పరిశ్రమలకును ఇతర పరిశ్రమలకూ భేదం ఉన్నదనే విషయం నేనూ అంగీకరిస్తాను. కాని, ఏ పరిశ్రమనైనా ప్రజోపయోగ పరిశ్రమగా నిర్ణయించే అధికారం కేంద్రప్రభుత్వానికి, రాష్ట్రప్రభుత్వాలకూ యీ బిల్లు ఇస్తుంది. ఇంగ్లండులో రైల్వేలు సహితం ప్రజోపయోగ పరిశ్రమలు కావు. కాని ఇండియాలో వ్యక్తుల లాభం కోసం నడుపబడే పరిశ్రమలు అనేకం ప్రజోపయోగ పరిశ్రమలుగా పరిగణింపబడుతున్నాయి.

కార్మికుల కిష్టంలేని మధ్యవర్తి పరిష్కారాన్ని వారిపై రుద్దకూడదు

"రెండో విషయం నిర్బంధ మధ్యవర్తిత్వం. శాంతియుతమైన పద్ధతులతో కార్మిక తగాదాలను పరిష్కరించడం నాకూ ఇష్టమే. కాని, కార్మికులకు యిష్టంలేని మధ్యవర్తి పరిష్కారాన్ని వారిపై బలవంతంగా రుద్దడం, యితరుల్ని స్వేచ్ఛగా వదలిపెట్టడం, నాకు ఇష్టంలేదు. నిష్పాక్షిక మధ్యవర్తియొక్క తీర్పును తప్పనిసరిగా అంగీకరించాలంటే కొంత అర్థంవుంది. కాని ఈ ప్రభుత్వం నియమించే సంఘాలు అలాంటివికావు. మీరు కార్మికులకు రాజకీయాధికారమే ఇవ్వలేదు. అందరికి వోటింగుహక్కు సహితం ఇవ్వలేదు. అలాంటప్పుడు ఏ వర్గానికి అన్యాయం చేయని నిష్పాక్షిక సంఘాలు నియమింపబడ్డం దుర్లభం.

"కాబట్టి, యీ బిల్లువల్ల కార్మికవర్గానికి చాల అపకారం జరుగుతుంది. ప్రభుత్వ సభ్యునికి ప్రత్యేకంగా నేను విజ్ఞప్తి చేస్తు... మీ కుటుంబాలలో (నిమ్న జాతి) ...ంది పొట్టకూటికోసం నాలుగు ... సాధించుకొనే నిరుపేదలు. ... దృష్టిలో ఉంచుకోండి. ... బిల్లును ప్యాసుచేయకండి.

తిండి పెట్టకపోయినా తిట్లకూ కొట్లకూ లోపంలేదు

ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీ కార్మికుల బాధలు

బందరు, నవంబరు 2

బందరుపట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి బి. రామారావుగారు యిలా ప్రకటిస్తున్నారు.

ఆంధ్రా సైన్‌టిఫిక్ కంపెనీ మేనేజిమెంటు నిరంకుశత్వం రోజురోజుకు పెరిగిపోతోంది. సూపర్‌వైజర్లు మేస్త్రీలును, వర్కర్సును కొట్టుట, తిట్టుట సాగిస్తున్నారు. చెన్నయ్య బత్తుడు అనే మేస్త్రి వర్క్‌షాపులోకి వచ్చి వర్కర్సును బండబూతులు తిట్టి, తన్నుతాడు. రూపాయి నుండి రూ 10 ల వరకూ లంచాలు తీసుకొంటాడు. లంచాలు యివ్వనివారిమీద మేనేజింగు డైరెక్టరుగారికి పితూరీలు చెప్పి శిక్షించేటట్లు చేస్తాడు. ఇదే విధంగా రంగప్రసాద్, రామారావు వగైరా మేస్త్రీలు వర్కర్సుపై దాడి సాగించారు.

అడిగితే బయటకుపొమ్మంటారు

ప్రతి వర్క్‌షాపులోనూ కరువు భత్యం కనీసం రూ 16 లు యిస్తుంటే, యిచ్చట 5 రూ॥ 12 రూ॥ కంటే యెక్కువ లేదు. జీతాలు మరీతక్కువ. కంపెనీలోని మొత్తం 1200 మంది వర్కర్సులో రూ 6 లు జీతగాండ్రు చాలా ఎక్కువ. దీనికితోడు మూడు సంవత్సరములనుండి యింక్రిమెంట్లు లేవు. బోనసులు లేవు. అడిగితే యిదిగో అదిగో అంటారు. గట్టిగా అడిగితే కంపెనీ నుండి బయటకు పంపుతామని సమాధానం చెపుతారు.

జీతం ఎక్కువ చెయ్యమంటే ఎక్కువవున్నవారి జీతం తగ్గిస్తారు

కంపెనీ పెట్టినప్పటి నుండి పనిచేస్తూ వర్క్‌షాపును అభివృద్ధిలోనికి తెచ్చిన వర్కర్సుకు కొత్తగా వచ్చిన వారికి యిచ్చే జీతాలు కూడా యివ్వుటలేదు. ఈ తక్కువ జీతాలతో పనిచేసే దెలా అని అడిగితే, 20 రూ॥ లు యిచ్చే జీతగాండ్రందరికీ (కొత్తగా వచ్చినవారు) వెంటనే 15 రూ॥ చేశారు. తక్కువ వున్నవారు జీతాలు ఎక్కువచేయమని అడిగితే, 'ఎక్కువ వున్నవారి జీతాలు తగ్గిస్తారు.

1200 మందికి ఒకటే బిళ్ల

దీనికితోడు కంపెనీలో వర్కర్సు పని చేసేందుకు సౌకర్యాలు యేమీలేవు. 1200 వర్కర్సును బయటకు ప్యానుకు పోయేందుకు 2 బిళ్లలు మాత్రమే వుంటాయి. ఒక బిళ్ల మేనేజిమెంట్ కాఫీలు తెప్పించు కొనేందుకు వారికి అవసరమైనప్పుడు పంపేందుకు రిజర్వుగా వుంచుతారు. ఇక ఒక బిళ్ళలో వర్కర్సు అంతా ప్యానుకు వెళ్ళాలంటే, వర్కర్సు స్థితియేవిధంగా వున్నదో తెలుస్తుంది:

పండగలకు కూడ శెలవులు లేవు

పండగలకుకూడా శెలవులు లేవు. రెండు నిమిషాలుఆలస్యంగావస్తేగేట్లుమూసివేస్తారు. వారికి ఆరోజుకి యికజీతం వుండదు. శని వారం సాయంత్రం 2 నిమిషాలు ఆలస్యంగా వస్తే గేట్లువేసి ఆ పూటజీ... వారం జీతంకూడా లేకుండా చేస్తున్నా... ప్రభుత్వం వెంటనే విచా... పాయాలు చేయాలి. లేకపో... విషమించుతాయి.

స్మట్సు కుతంత్రాలపై

అభ్యుదయకాముకుల ఖండన

దక్షిణాఫ్రికాలో స్మట్సు నాయకత్వం క్రింద ఉన్న ప్రభుత్వం ఎంత అభివృద్ధి కరమైన ఈప్రభుత్వమో మనకు తెలియనిది కాదు. ఈప్రభుత్వపరిపాలనలోరంగుజాతులు ఎంత నుభవిస్తున్నాయో దక్షిణాఫ్రికా భారతీయుల పోరాటమే చాటుతూంది. అక్కడ ఏ వైద్యదశాశాలలోనయినా యూరోపియన్లు కాని విద్యార్థులుంటే, వాళ్ళున్న క్లాసురూంలోకి యూరోపియనెవరైనావస్తే, వాళ్ళు వెంటనే లేచి బయటికి వెళ్ళిపోవాలట. ఇంతకన్నా అవమానకరమైనపరిస్థితులు అక్కడున్నాయి.

పూర్వం జర్మన్ కాలనీగా ఉండిన నైరుతి ఆఫ్రికా మొదటి ప్రపంచ యుద్ధానంతరం నానాజాతిసమితి నిర్ణయాయాలపై ఈస్మట్సు ప్రభుత్వపు మాండేటరీ పాలన క్రిందికి వచ్చింది. అప్పటినుండి అక్కడి 3½ లక్షల ఆఫ్రికా దేశీయులపై ఈప్రభుత్వం తన నాజీజాత్యహంకార విధానాలను రుద్దింది. ఇప్పుడు నైరుతి ఆఫ్రికా మిత్రరాజ్యసమితి ధర్మకర్తృత్వం కిందికి రావలసిఉంది. కాని, బ్రిటన్ మద్దతుతో దక్షిణాఫ్రికా ప్రభుత్వం దానిని పూర్తిగా కబళించాలనుకుంటూంది. దీనిని దక్షిణాఫ్రికాలో కలిపివేయాలంటూ స్మట్సు మిత్రరాజ్యసమితి సమావేశంలో ఒక తీర్మానం పెట్టాడు. నైరుతి ఆఫ్రికా ప్రజలే దీనిని కోరుతున్నారని సిగ్గు లేకుండా అన్నాడు. నైరుతి ఆఫ్రికా శాసనసభ తీర్మానాన్ని ఉదహరించాడు. కాని, ఆ శాసనసభలో ఉన్నది నూటికి నూరువంతులు యూరోపియన్ సభ్యులే అన్న సత్యాన్ని మరుగు పరిచాడు.

స్మట్సు కోరిక మిత్రరాజ్య ప్రణాళికకు భంగకరం

ఇండియా ప్రతినిధి ఖండన

ఇండియాప్రతినిధి సర్. మహారాజసింగ్ ఈ ప్రతిపాదనను తీవ్రంగా ఖండించాడు. స్మట్సు కోరికను అంగీకరించినట్లయితే మిత్రరాజ్యసమితి తన ఉన్నతాశయాలనుండి ఒకపెద్ద వెనకడుగు వేసినదవుతుందన్నాడు.

"నేను దక్షిణాఫ్రికాలో మూడేళ్లు నివసించాను. యూరపియనులు కానివారందరూ అక్కడ రాజకీయంగా, సాంఘికంగా ఎన్ని అగచాట్లపాలవుతున్నారో నాకు స్వయంగా తెలుసు. ఆఫ్రికాజాతివారికి అక్కడ వోటింగు హక్కు బహుస్వల్పం.

"అక్కడ జనాభాలో 80 వంతులయిన స్వదేశస్థులకు భూమిలో నూరింట 13 వంతులు మాత్రమే ఇవ్వబడింది. మిగిలిన 86 వంతులు, అల్పసంఖ్యాకులైన యూరోపియన్లదే. మంచిపనులేవీ ఆఫ్రికా జాతివారికి చెందకూడదు. వీరు ట్రేడు యూనియన్లను నిర్మించుకోకూడదు. ఒక చోటినుంచి, ఒకచోటికి పోవాలన్నావారికి ప్రత్యేకమైన పెర్మిట్లుండాలి. మునిసిపాలిటీల్లో అతినీచమైన పనులు తప్ప మిగిలినవేవీ ఆఫ్రికాజాతివారి కివ్వరు. చివరకు తెల్లవాళ్లున్న బస్సుల్లో ప్రయాణం చేయకూడదు. సినిమాలకు వెళ్ళాలనికూడా నిర్బంధాలే. నామాట అతిశయోక్తిగా ఉంటే మీలో ఎవరైనాసరే అక్కడికివెళ్ళి చూడవచ్చు.

"ఇలాంటి దక్షిణాఫ్రికాలో చేరడం,నైరుతి ఆఫ్రికా ప్రజలకు ఏ విధంగా శ్రేయస్కరం కాగలదో మీరే ఆలోచించండి" అనిఅన్నాడు. స్మట్సు కోరిక మిత్రరాజ్య ప్రణాళికకు భంగకరమన్నాడు.

ఇకముందు ధర్మకర్తృత్వంక్రింద ఉంచవలసిన దేశాలను మిత్రరాజ్యసమితే పరిపాలించడం మంచిదని ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు.

చైనాప్రతినిధి విమర్శ

మిత్రరాజ్య సమితి ధర్మకర్తృత్వ కమిటీలో నైరుతి ఆఫ్రికాను గురించి స్మట్సు ప్రతిపాదనపై చర్చ సాగింది. చైనాప్రతినిధి మాట్లాడుతూ, "దక్షిణాఫ్రికాలో జాత్యహంకార విధానం గురించి భారతదేశ ప్రతినిధి తెలిపిన విషయాలను జాగ్రత్తగా ఆలోచించాలి" అన్నాడు.

"నైరుతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికాలో కలిపివేయాలని స్మట్సు కోరిన కోరికను అంగీకరించడం మిత్రరాజ్య సమితికి తలవంపులు తేగలదు" అని అన్నాడు.

ఈవేళ, రేపో సోవియటు ప్రతినిధి నోవికోవ్ స్మట్సును తీవ్రంగా ఖండించబో తున్నాడు.

దక్షిణాఫ్రికా ప్రజాసంస్థల ఏకగ్రీవ ఖండన

దక్షిణాఫ్రికాలో 'ముఖ్య' యూరోపియనేతర సంస్థలయిన ఆఫ్రికా జాతీయ కాంగ్రెసు, ఆఫ్రికన్ పీపుల్సు ఆర్గనైజేషన్, కేప్‌రాష్ట్ర సత్యాగ్రహ సంఘం, ఇండియా లీగు, కేప్. మలయా సంఘం, ప్రయాణ లైసెన్సువిధాన వ్యతిరేక సంఘం, దక్షిణాఫ్రికా ఉపాధ్యాయ సంఘాలూ, దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ కలిసి మిత్రరాజ్యసమితి ధర్మకర్తృత్వ కమిటీకి ఒక తంతినంపాయి." ఇండియా ప్రతినిధి తెలిపిన విషయాలన్నిటినీ మేము పూర్తిగా బలపరుస్తున్నాము. దక్షిణాఫ్రికాలోను, నైరుతి ఆఫ్రికాలోను, ప్రభుత్వ దృష్టిలో గాని, 'మతాధికారుల దృష్టిలో గాని యూరోపియనులకు తదితరులకు సమానత్వం ఏమాత్రమూ లేదు" అని ఈ తంతి. ఈ విధంగా అభివృద్ధికర వర్గాలన్నీ స్మట్సు సామ్రాజ్యవాద కోరికను ఏక కంఠంతో ఖండిస్తున్నాయి.

లేబరు ప్రభుత్వంపై బ్రిటన్‌లో అసంతృప్తి పెరుగుతూంది

అక్టోబరు నెలాఖరులో బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు 78వ వార్షికమహాసభ బ్రిటన్‌లో జరిగింది.

బ్రిటిష్ కార్మికోద్యమానికి ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు నాయకసంస్థ 13 మాసాల క్రిందట బ్లాక్‌పూల్‌లో జరిగిన మహాసభ, లేబరుపార్టీ ఎన్నికల ప్రణాళికను అమలు జరిపించడానికి ప్రభుత్వానికి పూర్తి తోడ్పాటును వాగ్దానం చేసింది. ఆ ప్రణాళికను లేబరు ప్రభుత్వం ఎంతవరకు అమలు జరిపింది అని ఈసారి విమర్శక దృష్టితో పరిశీలించింది.

అట్లీ తాపత్రయము

తామనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానాన్ని మహాసభచేత ఆమోదింపజేయడానికి లేబరు ప్రధాని అట్లీ ఎంతో ప్రయత్నించాడు ముఖ్యంగా బెవిన్ విదేశాంగ విధానంపై నిశిత విమర్శ తప్పకుండా జరుగుతుందని తెలిసి, అట్లీ ముందుగానే మహాసభలో ఉపన్యసించాడు. గ్రీసు ఈజిప్టు, పాలస్తీనా, ఇండియాలో తన ప్రభుత్వం నూటికి నూరువంతులు ప్రజాతంత్ర విధానాన్ని అనుసరిస్తున్నదని బుకాయించాడు. కమ్యూనిస్టు పార్టీమీద, సోవియటు యూనియన్ మీదా దుమ్మెత్తిపోసి, తనప్రభుత్వపు కుటిలనీతినుండి మహాసభ దృష్టిని మరల్చాలని చూచాడు. కాని, ఈ ఆటలేమీ సాగలేదు.

ఖండన పరంపర

మొదట ఫ్రాంకోమీద, తరువాత పరిశ్రమలను ప్రభుత్వపరం చేయడంమీదా, ఆతరువాత గ్రీసు మొదలయిన యావత్తువిదేశ వ్యవహారాలమీదా. జనరల్ అండర్సు ఫాసిస్టు పోలిష్ మూకనుగురించీ ప్రతినిధి తరువాత ప్రతినిధిలేచి లేబరు ప్రభుత్వపు బండారాన్నంతా బయటపెట్టారు.

బ్రిటిష్ ప్రభుత్వం ఫ్రాంకో ప్రభుత్వంతో తెగతెంపులు చేసుకోవాలన్న తీర్మానం 45 లక్షల 34 వేల వోట్లతో నెగ్గింది. ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు నాయకవర్గం బెవిన్ వైఖరిని సమర్థించడానికి ఎంత ప్రయత్నించినా లాభంలేకపోయింది.

పరిశ్రమలను ప్రభుత్వపరం చేయడం విషయంలోకూడా, పరిహారంపేరిట లేబరు ప్రభుత్వం పెట్టుబడిదారులకు పెద్దపెద్ద మొత్తాల నివ్వడాన్ని ఖండిస్తూ ఒక తీర్మానం అత్యధిక మెజారిటీతో నెగ్గింది.

గ్రీసు, స్పెయిన్, జర్మనీల్లో ఫాసిస్టు వర్గాలకు అండగాఉంటున్న బెవిన్ విదేశాంగ విధానం అంతటినీ ఖండిస్తూ ఒక ముఖ్యమైన తీర్మానం చర్చకువచ్చింది. సోవియటుపట్ల బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిని ఇది ఖండించింది. దీనిని రాకుండా చేయడానికి నాయకవర్గం ప్రయత్నించింది. ఇది కమ్యూనిస్టు ప్రచారం కోసం పెట్టుకున్న తీర్మానమని అట్లీ చిందులు తొక్కాడు. ఇది చర్చకు రాక తప్పదని తెలిసిన తరువాత, దానిని ఓడించడానికి నాయకవర్గం తీవ్రప్రయత్నాలు చేసింది ఇంత ప్రయత్నించినా ఇంచుమించు 25 లక్షల వోట్లు-అంటే మొత్తంలో నూటికి 40 వంతులు తీర్మానానికి అనుకూలంగా వచ్చాయి 35 లక్షలు మాత్రమే ప్రతికూలంగా వచ్చాయి. ప్రభుత్వం దావుతప్పి కన్నులొట్టబోయి బయటపడింది. తీర్మానం ఓడిపోయినా, తమ విధానానికి ఇంత తీవ్ర వ్యతిరేకత ఉన్నదని స్పష్టమవడం లేబరు ప్రభుత్వానికి ఒక పిడుగుపడినట్లయింది. విషయజ్ఞులు దీనిని కార్మికవర్గపు విశ్వాస రాహిత్య ప్రదర్శనంక్రింద లెక్కగట్టారు.

ఫాసిస్టు అండర్సు మూకకు బ్రిటిష్ పరిశ్రమల్లో ఉద్యోగాలివ్వడాన్ని మరొక తీర్మానం ఖండించింది. ఫాసిస్టులని తెలిసిన వారికి ఉద్యోగాలివ్వకుండా చూస్తామనిచెప్పి నాయకవర్గం దీనిని చర్చకు రాకుండా చేయాలని చూచారు. కాని చర్చ జరిగింది: 24 లక్షల వోట్లు అనుకూలంగా వచ్చాయి. 33 లక్షలు వ్యతిరేకంగా వచ్చాయి.

ట్రేడుయూనియన్ మహాసభలో లేబరు ప్రభుత్వంపైఖండన పరంపర అలాసాగింది. ఇంచుమించు అరోజుల్లోనే కామన్సుసభలో బెవిన్ తన విదేశాంగ విధానాన్ని సమర్థించుకో జూచాడు. అక్కడకూడా అతని విధానాన్ని లేబరు సభ్యులు హర్షించలేదు. కొందరు ముందుకువచ్చి నిశితంగా విమర్శించారు. మిగిలిన వారంతా నిరసన సూచక మౌనాన్ని వహించారు.

బెవిన్ నాయకత్వంకింద లేబరుప్రభుత్వం ఎటు మొగ్గుతూఉందో బ్రిటిష్ కార్మికవర్గం పూర్తిగాగుర్తిస్తూంది. మూడవయుద్ధానికి దారితీస్తున్న ఈ విధానాన్ని ఇక సాగనివ్వరనడానికి ట్రేడుయూనియన్ మహాసభలోని వోటింగువివరాల నిదర్శనం.

అమెరికాఎన్నికలు

అభివృద్ధినిరోధక రిపబ్లికన్‌పార్టీ విజయం

మొన్న 5వ తేదీ అమెరికాలో ఎన్నికలు జరిగాయి. క్రింది శాసనసభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్సు)లోని 435 స్థానాల్లో 231 స్థానాలకు రిపబ్లికన్‌పార్టీ సభ్యులు (ఇంత వరకు ప్రతికూల పక్షం) ఎన్నుకోబడ్డారు. ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీవారు 180 స్థానాలకు మాత్రమే ఎన్నుకోబడ్డారు. మిగిలినవింకా తేలలేదు. పై శాసనసభ (సెనేటు) లోని మొత్తం 96 స్థానాల్లో 51 స్థానాలకు రిపబ్లికన్‌పార్టీవారూ, 42 స్థానాలకుమాత్రమే డెమాక్రటిక్‌పార్టీవారు ఎన్నుకోబడ్డారు.

ఈ ఎన్నికలకు పూర్వం క్రింది శాసనసభలో 237 మంది డెమాక్రట్లు, 192 రిపబ్లికన్లు ఉన్నారు. పైశాసనసభలో డెమాక్రట్లు 56 మంది. రిపబ్లికన్లు 38 మంది

అమెరికాలో శాసనసభలకు ఎన్నికలు రెండేసి సంవత్సరాల కొకసారి: అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నాలుగేసి సంవత్సరాల కొకసారి జరుగుతుంటాయి. కొత్త అధ్యక్షుని ఎన్నిక 1948 లో జరుగుతుంది.

రూజ్వెల్టు, అభివృద్ధికరమైన 'న్యూడీల్'

(మిగతా 16 వ పేజీలో)

(11 వ పేజీ తరువాయి)

ఎన్ని సభలు జరిపింది? ఇప్పుడు మద్రాసులో కాంగ్రెసు మంత్రివర్గం వచ్చిందే, మహిళల హక్కులనుగూర్చి చట్టాలు చేయించడానికి ఏమి ఆందోళన చేస్తూఉంది? ఎంతమందిని సభ్యులనుగా చేర్చింది?

మన దేశం బానిసత్వంలో ఉంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, జమీందార్లు, స్వదేశ సంస్థానాధీశులు, కోటీశ్వర్లు, బ్లాకుమార్కెటుదార్లు ప్రజలను దోచుకు తింటున్నారు. స్త్రీలు కూడ పురుషులతోపాటు నానాఅవస్థలు పడుతున్నారు. స్త్రీలకు ఆస్తి హక్కులు లేవు. ప్రసూతి సౌకర్యాలు లేవు. విద్య మరీ తక్కువ. స్త్రీలు తమ బాధలన్నిటినీ బాపుకోవాలంటే ప్రజా పీడకులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో పురుషులతోపాటు ముందుకు రావాలి. అందుకు అఖిలభారత మహిళాసభ జెండాక్రింద మహిళా శ్రేయస్సుకు పాటుబడే అన్ని మహిళా సంస్థలను సమీకరించాలి. కాంగ్రెసు - కమ్యూనిస్టు - లీగు, మొదలైన రాజకీయాభిప్రాయాలుగల వారందరికీ అవకాశముండాలి. అఖిలభారత మహిళాసభను ఒక పార్టీకి అనుబంధసంస్థగా తయారుచేయగూడదు. ఇప్పుడు కృష్ణాజిల్లా మహిళాసంఘ అఫిలియేషను రద్దుచేసే నిర్ణయం అఖిలభారత స్టాండింగు కమిటీ మహిళా ఉద్యమాభివృద్ధికి హానిచేస్తుంది. అఖిలభారత మహిళాసభను పార్టీసంస్థగా తయారుచేయడానికే అది దారితీస్తుంది. కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని రద్దుచేసి, కృష్ణాజిల్లా ఉపశాఖలలో సభ్యులుగాచేరాలనడంతగువులకు దారితీస్తుందేగాని కార్యక్రమం కొనసాగించడానికి ఉపయోగపడదనడానికి కొండా పార్వతమ్మ బృందంయొక్క చర్యలే నిదర్శనంగా తీసుకుంటే సరిపోతుంది. ఈ పరిస్థితులలో కృష్ణాజిల్లా మహిళాసంఘం గత 10 సంవత్సరాల వలె మహిళలకు సేవ చేయాలంటే తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ స్వతంత్ర సంస్థవలె వ్యవహరించాలనీ, మహిళా శ్రేయస్సుకోరే అన్ని సంస్థలతోనూ సహకారం చేయాలనీ నాదృఢవిశ్వాసం. నవంబరు ఆఖరువారంలో కృష్ణాజిల్లా మహిళాసభ జరుగుతుంది. దానిలో అఖిలభారత మహిళాసభ స్టాండింగుకమిటీ నిర్ణయాన్ని గూర్చి చర్చించి తీర్మానించబడుతుంది. సోదరీమణులందరూ ఈ వ్యాసంలో వ్రాయబడిన సంగతులన్నిటినీ శ్రద్ధగాచదివి, నిర్ణయం చేయడంలో కృష్ణాజిల్లా మహిళాసంఘానికి తోడ్పడదాదని అశిస్తున్నాను.

సుస్థిర ప్రపంచ శాంతికి సోవియట్ బాట

దురాక్రమణను ఆపగలిగే ప్రపంచ వ్యవస్థకు సోవియట్ దోహదం

ప్రపంచ మింతవరకు కనీ, విని ఎరుగని భయంకర సంగ్రామం ముగిసి సంవత్సరం దాటిపోయింది. యుద్ధకాలంనుంచి శాంతి కాలానికి పరివర్తనం చెందుతున్న నేటి ప్రపంచంలో పరిస్థితులు కల్లోలంగా ఉన్నాయి. యుద్ధ వదంతులను, యుద్ధ వాతావరణాన్ని కొందరు అభివృద్ధినిరోధకులు కల్గించు తున్నారు. దురాక్రమణను అపగల్గి సుస్థిర శాంతి నెలకొల్పగలిగే ప్రపంచ వ్యవస్థను నిర్మించవలసిన ఈ రోజులలో వివిధ దేశాల మధ్య సహకారాన్ని, మైత్రిని కొందరు చెడగొడుతున్నారు సోవియట్టుపైన, ప్రజా తంత్ర యూరప్ పైన చీటికి మాటికి బ్రిటన్ అమెరికాల నాయకత్వాన సామ్రాజ్య వాదులు దుష్ప్రచారం సాగిస్తున్నారు; బెదరింపులు కొనసాగిస్తున్నారు. మిత్రరాజ్య సమితిలోనేమి, శాంతిమహాసభలలో నేమి, అగ్రరాజ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితులు ప్రపంచంలో చాలమందికి ఆందోళనా, భయమూ కల్గించాయి.

ఇట్టి పరిస్థితులలో సోవియటు నాయకుల ప్రకటనలు ప్రపంచ సుస్థిర శాంతికి, ప్రజా తంత్ర విజయానికి స్పష్టమైన బాట చూపు తున్నాయి.

యుద్ధవదంతుల అంతరార్థం ఏమిటి?

కామ్రేడ్ స్టాలిన్ ఒక బ్రిటిష్ పత్రికా విలేఖరికి ఇంటర్వ్యూ ఇస్తూ (సెప్టెంబరు 24 వ తేదీన) ఇలా అన్నారు.

"తమ తమ దేశాలలో యుద్ధకాలపు బడ్జెటులను అలాగే వుంచుకోడానికి, సైనికులను, నిరుద్యోగం వస్తుందనే భయంతో ఇండ్లకు పంపివేయడాన్ని (డిమాబిలైజేషన్) ఆలస్యం చేయడానికి, మరోయుద్ధం వస్తుందనే వదంతులు వ్యాపింపజేస్తున్నారు.

"నేను మరో కొత్త యుద్ధప్రమాదాన్ని గురించి నమ్మడంలేదు. ముఖ్యంగా సైనిక, రాజకీయ గూఢచారులూ, వారిని బలపరిచే కొద్దిమంది అనుచరులూ యుద్ధవదంతుల వ్యాపింపచేస్తున్నారు. వారిలా ఎందుకు చేస్తు న్నారంటే (1) యుద్ధప్రమాదం ఉన్నదని తమ ప్రతిపక్షులను బెదరగొట్టి, తమ ప్రభుత్వంద్వారా ప్రతిపక్షులనుండి సాధ్యమైనన్ని అవకాశాలను గుంజవచ్చు. (2) యుద్ధ కాలపు బడ్జెట్‌లను మరికొన్నాళ్ళు అలాగే వుంచవచ్చు. (3) సైనికులను ఇండ్లకు పంపి వేయడాన్ని (డిమాబిలైజేషన్) ఆలస్యం చేయవచ్చు. సైనికులను ఇండ్లకు పంపితే త్వరగా నిరుద్యోగం హెచ్చుతుందని వారి భయం.

"మరో యుద్ధప్రమాదం అప్పుడే రాలేదు. కాని ఈ యుద్ధవదంతులను, యుద్ధం రాగల ప్రమాదానికిగల భేదాను గుర్తించాలి."

అయితే ప్రపంచశాంతికి నిజంగా ముప్పు కల్గించేదెవరో కామ్రేడ్ స్టాలిన్ మరొకసారి స్పష్టపరిచారు. అక్టోబర్ 28 వ తేదీన ఒక అమెరికా విలేఖరికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా వివరించారు.

శాంతికి ముప్పుకల్గించేదెవరు?

"ప్రపంచ శాంతికి యుద్ధప్రేరేపకులే తీవ్ర ప్రమాదకారకులు. అందులో మొదటివారు చర్చిల్. బ్రిటన్ అమెరికాలలో చర్చిల్‌తో ఏకీభవించేవాళ్లు కూడ శాంతికి భంగకారులే.

"మరొక యుద్ధ ప్రమాదం ఏర్పడకుండా ఉండాలంటే యుద్ధప్రేరేపకుల గుట్టుబయట పెట్టాలి. వారి కార్యకలాపాలు సాగకుండా నిరోధించాలి."

యుద్ధ పరిస్థితులనుండి శాంతి పరిస్థితులకు పరివర్తనం చెందుతున్న ఈకాలంలో వివిధ దేశాల వైఖరి ఏమిటి? నవంబర్ దినోత్సవ సందర్భంలో కామ్రేడ్ జదనోవ్ (సోవియటు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి) ఇలా వివరించారు.

యుద్ధంనుండి శాంతికి పరివర్తనం
కామ్రేడ్ జదనోవ్ ప్రకటన

"యుద్ధంనుండి సోవియటు మంచి బలమైన దేశంగా బయటపడింది. ప్రశాంతంగాను, సంక్షోభంలేకుండాను, యుద్ధంనుంచి శాంతికి పరివర్తనం చెందినదేశం మనదేశంఒక్కటే. పెట్టుబడిదారీదేశాలు అనేక కష్టాలకుసంక్షోభా



కామ్రేడ్ మాలొటావ్

లకు ఇపుడుగురిఅవుతున్నాయి. సోవియటుకు అలాంటి ఇబ్బందులులేవు. యుద్ధకాలంలో ఎర్రసైన్యాన్ని తగ్గించి ఇండ్లకు పంపడంవల్ల గాని, యుద్ధకాల పరిశ్రమలనుమార్చడంవల్ల గాని, సైనిక బడ్జెటును మూడోవంతుకు తగ్గించడంవల్లగాని, సోవియటు రష్యాలో నిరుద్యోగ సమస్యలేదు. ఫ్యాక్టరీలను మూయవలసిన పరిస్థితి కల్గలేదు. అస్థిరంగా అస్థిరత్వం ఏర్పడలేదు. మరోదేశమైతే ఈ యిబ్బందులన్నీ ఏర్పడేవే.

"యుద్ధంలో నాశనమైనపరిశ్రమలు తిరిగి నెలకొల్ప బడుతున్నాయి. ఈ విషయంలో జరిగిన కృషి సంతృప్తికరంగావుంది. పంచ వర్షప్రణాళికకు 25 వేలకోట్ల రూబుళ్ళు ఖర్చు అవుతుంది.

"సాధ్యమయినంత త్వరలో పౌరులకు అన్నివస్తువులు అందించబడతాయి. 1947లో రేషనింగు నిబంధనలు సడలించ బడతాయి. దానిఫలితంగా ప్రజలకు ఇబ్బంది ఏర్పడకుండా జాగ్రత్త వహించుతాం. క్రిందితరగతి కార్మికుల జీతాలు, ఉద్యోగుల జీతాలు హెచ్చింపబడతాయి."

ఇతర దేశాలలో సైన్యాలు

కాని బ్రిటన్ అమెరికాలలో జరిగేదేమిటి? ప్రపంచమంతటా కొత్తకొత్త సైనిక కేంద్రాలను అమెరికా నిర్మించుతోంది. బ్రిటన్ గ్రీసు, ఇండొనీషియా, వలసరాజ్యాలలో ప్రజాతంత్ర ఉద్యమాన్ని అణచడానికి తన సైన్యాలను అలాగేవుంచింది. ఇప్పుడప్పుడే సైన్యాలను తగ్గించడానికి వీలులేదంటూ అట్లీ కామన్సుసభలో ప్రకటించాడు కూడ.

తమ దురాక్రమణ ఉద్దేశ్యాలను కప్పి పుచ్చుకోడానికై చర్చిల్ సోవియటుపై ఒక అభాండంవేశాడు. యూరప్‌లో సోవియటు సైన్యాల 200 డివిజన్లు ఉన్నాయని కుచ్చిత బుద్ధితో ప్రకటించాడు. ఒక లేబర్‌పార్టీ సభ్యుడన్నట్లు బహిరంగసభలో ఎక్కడైనా ఈ ప్రకటన చేయడానికి చర్చిల్‌కు దమ్ము లుండేవి కావు.

యుద్ధోన్మాది చర్చిల్‌కు స్టాలిన్ చెంపపెట్టు పెట్టాడు. అయాధ విసర్జన ఆందోళనకు త్రోవదీశాడు.

అక్టోబర్ 29 వ తేదీన అమెరికా పత్రికా విలేఖరి ప్రశ్నకు కామ్రేడ్ స్టాలిన్ యిలా జవాబు చెప్పాడు.

"పశ్చిమంలో అనగా జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, బల్గేరియా, రుమేనియా, పోలెండు లలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. వీటిలో కవచదళాలు రైఫిల్ దళాలుకూడ ఉన్నాయి. కాని ఇవి పూర్తిడివిజన్లు కావు. అక్టోబరు 22న సుప్రీం సోవియట్ నిర్ణయాన్ననుసరించి రెండు నెలల్లో ఇవి తగ్గిపోతాయి. 40 డివిజన్లుమాత్రమే పైన పేర్కొన్న దేశాలలో ఉంటాయి."

ఈ చెంపపెట్టుకు చర్చిల్ తలదిమ్మ రిల్లింది. చర్చిల్ తిరిగి ఏమనలేక పోయాడు. ఒడెస్సాలోను తదితరచోట్ల ఎన్ని సైన్యాలున్నాయి? అని తాను ప్రశ్నించి పత్రికల కిచ్చినప్రకటనను చర్చిల్ రద్దుచేసుకొన్నాడు.

ఆయుధ విసర్జనకై ఆందోళన

దురాక్రమణ తిరిగి తలయెత్తకుండా ఉండటానికి ఆయుధవిసర్జనకై సోవియటు ఆందోళనచేస్తోంది. ఆటంబాంబుతో ప్రపంచాన్ని బెదరింప జూస్తున్న అమెరికాగుట్టు బయటపెడుతోంది.

ఆటంబాంబులను గురించి కామ్రేడ్ స్టాలిన్, సెప్టెంబరు 24 న, అక్టోబరు 29 న ఇచ్చిన ఇంటర్వ్యూలలో ఇలా చెప్పాడు.

"సోవియటుకు ఆటంబాంబుగాని, అలాంటి మరో రహస్య ఆయుధంగాని లేదు. కొంతమంది రాజకీయవేత్తలు భావించుతున్నట్లు ఆటంబాంబు ఒక్కటే అంత మహోపద్రవకరమైనది కాదు. అది పిరికి గుండెలు కలవారిని బెదరించడానికి ఉపయోగపడుతుంది. ఆటంబాంబులొక్కటే యుద్ధాన్ని అటో ఇటో తేల్చలేవు. ఆటంబాంబు రహస్యం ఒక దేశం గుత్త కాబోదు. అంతర్జాతీయ ప్రాతిపదికమీద 'పరమాణు' శక్తిని కంట్రోల్ చేయాలి. ఆటంబాంబు ప్రయోగాలను నిషేధించాలి."

అక్టోబర్ 29 వ తేదీన మిత్రరాజ్య సమితిలో ఇచ్చిన ఉపన్యాసంలో కూడా ఈ విషయాన్నే మాలొటోవ్ స్పష్టపరిచాడు. (మాలొటావ్ ఉపన్యాసం మరొకచోట ఉదహరిస్తున్నాం.)

రెండు ధోరణులు

కామ్రేడ్ జదనోవ్ నవంబరు విప్లవ దినోత్సవ సందర్భంలో మాట్లాడుతూ, విదేశాంగ వ్యవహారాలను గురించి ఇలా అన్నారు.

"న్యాయ రక్షణకోసం, ప్రజాతంత్ర శాంతికోసం, యుద్ధకాలంలో వలెనే శాంతి కాలంలో సోవియటే అన్ని దేశాలకు అగ్రగామిగా నిలుస్తుంది.

"సోవియటు శాంతివిధానాన్ని, అనేక దేశాలలోని అభివృద్ధినిరోధకులు ఎదిరించు తున్నారు. ముఖ్యంగా బ్రిటన్, అమెరికాలలోని అభివృద్ధివిరోధకశక్తులు యిందుకు పూనుకున్నాయి. ఆంగ్లో-అమెరికా విధానాన్ని — తమకెంత నష్టదాయకమైనప్పటికీ— అనుసరించే కొన్ని చిన్న రాజ్యాలను తెరగా ఉపయోగించుకొని, బ్రిటిష్ — అమెరికన్ అభివృద్ధినిరోధక శక్తులు అడ్డంకులు కల్గించు తున్నాయి. శాంతిఒడంబడికలకు అవరోధాలు పెడుతున్నాయి.

"అంతర్జాతీయ రంగంలో నేడు రెండు ధోరణులు స్పష్టమవుతున్నాయి. ఇదివరకటి నానాజాతి సమితివలె గాక, దురాక్రమణ ఆపగల్గి సుస్థిర శాంతిని నిర్మించగలిగే, బలోపేతమైన మిత్రరాజ్యసమితిని నిర్మించాలి. ఇది సోవియటు విధానం.

"కొద్ది కాలం క్రితమే. మిత్రరాజ్యాలు సంయుక్తంగా చేసిన ప్రకటనలకు విరుద్ధంగా పోతూ, అగ్రరాజ్యాల మధ్య సహకారాన్ని కుంటుపరిచే విధానం రెండవది.

"అభివృద్ధినిరోధకులు అంతర్జాతీయ సహకారాన్ని విరోధించుతున్నారు. ఎందు వల్లనంటే ఇది వారి అడ్డూ అదుపూ లేని దురాక్రమణ విధానానికి భంగం కల్గించుతుంది కాబట్టి."

జర్మనీ భవిష్యత్తు

ఈ రెండు ధోరణులు శాంతి ఒడంబడికల విషయమై చర్చలలోనూ, జర్మనీ ఎడల అవలంబించే వైఖరిలోనూ మరింత స్పష్టమవు తున్నాయి. ఫాసిస్టుఅవశేష శక్తులను నశింపచేయకుండా, జర్మనీలోని అభివృద్ధి నిరోధక శక్తులకు బ్రిటన్ అమెరికాలు మద్దతు నిస్తు న్నాయి. పైగా జర్మనీ పునర్నిర్మాణానికి సోవియటే అడ్డంకి అన్నట్లు ప్రచారం చేస్తు న్నాయి. అందుచే కామ్రేడ్ స్టాలిన్ తన రెండు ప్రకటనలలో ఈ విషయం స్పష్టం చేశాడు.

"పశ్చిమ యూరప్‌కు వ్యతిరేకంగాగాని, అమెరికాకు వ్యతిరేకంగాగాని జర్మనీని సోవియటు ఉపయోగించదు. అలా చేయడం మా దేశ ప్రయోజనాలకే నష్టం. జర్మనీలో సైనిక శక్తులను తగించాలి. జర్మనీలో ప్రజాతంత్రవాదులు నెలకొల్పాలి. జర్మనీని ఆర్థికంగానేగాక రాజకీయంగా ఐక్యపరచాలి. ఇందుకు ఫాసిస్టు అవశేషశక్తులను పూర్తిగా నిర్మూలించాలి. పోట్సుడం నిర్ణయాలు - ముఖ్యంగా జర్మనీని ప్రజాతంత్రంగా మార్చే విషయంలో — అమలు పరచడంలేదు. అవి అమలుపరచాలి." ఇంతేగాదు. సోవియటుకూ తదితర దేశాలకూ మధ్య మైత్రి అసాధ్యం అనే ప్రచారాన్నికూడా సోవియటునాయకులు ఖండించారు.

'ఇండియా స్వాతంత్ర్య వాంఛను నెరవేర్చవలసిన సమయం వచ్చింది'—మాలొటోవ్

(14 వ పేజీ తరువాయి)

సిద్ధాంతాలు విభిన్నమైనప్పటికీ సోవియటుకూ పశ్చిమ రాజ్యాలకూ మధ్య సహకారం సాధ్యమేనని స్టాలిన్ తెలియజేశాడు.

అగ్రరాజ్యాలలో ఏకీభావం లేకపోతే యుద్ధం తప్ప మరో గత్యంతరం లేదు. అందుచే అగ్రరాజ్యాలకు 'వీటో' అధికారం ఈయబడింది. చిన్నరాజ్యాల హక్కులనే పేరుతో ఈ 'వీటో' అధికారాన్ని త్రోసిపుచ్చి మిత్రరాజ్యసమితి పునాదులకు దెబ్బ గొట్టాలని అభివృద్ధి విరోధకులు ప్రయత్నించుతున్నారు. దానికి మాలొటావ్ మిత్రరాజ్యసమితిలో (అక్టోబరు 29 న) చక్కని జవాబిచ్చాడు. ఇంతేగాక సోవియటు సుస్థిర శాంతికి ఎలా తోడ్పడుతోందో స్పష్టపరిచాడు నిజంగా అస్వతంత్రదేశాలకు, 'చిన్న' దేశాలకు స్నేహితు లెవరో స్పష్టపరిచాడు.

మాలొటోవ్ ప్రసంగం

భారతదేశాన్ని ఉద్దేశించి మాలొటావ్ ఇలా అన్నాడు :

"ఇండియాయొక్క న్యాయమైన స్వాతంత్ర్యవాంఛను నెరవేర్చవలసిన సమయం వచ్చింది. మిత్రరాజ్యసమితిలో ఆ దేశం సభ్యురాలు. కాబట్టి బ్రిటన్‌తో ఆదేశపు సంబంధాలు సంపూర్ణ స్వాతంత్ర్యం, సరి సమాన హోదాతో కూడుకొని ఉండాలి. కాని, ఈనాడు ఇండియా ప్రతినిధులు ఈ సమావేశం ఎదుట విల్పొని సానుభూతి, సహకారాలను అర్థించవలసిన స్థితి ఏర్పడింది. ఇండియా మొరను ఇక ఏమాత్రం చెవిటిచెవిని పెట్టడానికి వీల్లేదు.

"ఇదేవిధంగా, ఇండోనిషియా ప్రజల న్యాయమైన కోర్కెలను హాలెండు గుర్తించేలా చేయాలి" అని మాలొటావ్ ఉద్ఘోషించాడు.

మిత్రరాజ్య ధర్మకర్తృత్వం ఏర్పడకపోవడం సిగ్గుచేటు

మిత్రరాజ్యసమితి ధర్మకర్తృత్వం గురించి చెబుతూ ఇలా అన్నాడు :

"యుద్ధం ముగిసి రెండేళ్ళు కావస్తూంది. ఇంతవరకు ఎక్కడా మిత్రరాజ్యసమితి ధర్మకర్తృత్వం ఏర్పడలేదంటే. మన సంస్థ ప్రతిష్ఠకు భంగంకాదా? పాలస్తీనా, టాంగన్యీకా, టోగోలాండు, న్యూగినీ మొదలైన దేశాలపై మాండేటరీ అధికారం చెలాయిస్తున్న బ్రిటన్ మొదలైన దేశాలు, వాటిని మిత్రరాజ్యసమితి ధర్మకర్తృత్వానికి వప్పగించడానికి ఇంతవరకేమీ చేయలేదు. అనవసర కాలయాపన చేస్తున్నాయి.

"దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఇంతటితో ఆగలేదు. వెనుకటి జర్మనీ కాలనీ అయిన నైరుతి ఆఫ్రికాకు స్వాతంత్ర్యానికి సిద్ధం చేయడానికి బదులు దానిని కబళించడానికి తయారవుతూంది. ఈ వైఖరి మిత్రరాజ్య సమితి ప్రణాళికకు పూర్తిగా విరుద్ధం అని వేరే చెప్పనక్కరలేదు" అని ఖండించాడు.

వీటో వ్యతిరేక ప్రచారం అభివృద్ధి విరోధకులకు ఆయుధం

వీటో సమస్యపై రేగుతూన్న గాలిదుమారాన్నిగురించి మాలొటావ్ ఇలా అన్నాడు :

"వీటో వ్యతిరేక ప్రచారం సోవియటు వ్యతిరేక ఉద్యమంగా సాగింపబడుతోందని నానాటికి స్పష్టమవుతూంది. ఈ ప్రచారం కరడుగట్టిన అభివృద్ధి విరోధకులకు ఎలా ఉపయోగపడుతూందో, పుట్టు గ్రుడ్డివాడు తప్ప మిగతా వారందరూ గుర్తించగలరు.

"ఈ సందర్భంలో, అంతర్జాతీయ రంగములో ప్రధాన దృక్పథాలకు గల వ్యత్యాసాన్ని వివరించక తప్పదు. మిత్రరాజ్య సమితిలో ఒక వర్గం ప్రధాన మిత్రరాజ్య ఆశయాలకు, ముఖ్యసూత్రాలకు అంటిపెట్టుకోవాలని చూస్తూంది. మరొకవర్గం మిత్ర కొట్టుతున్నారు. మిత్రరాజ్యసమితి సభ్యుల్లోని రెండు విభిన్నదృక్పథాలు ఈవిధంగా పరిణమిస్తున్నాయి. ఒకటి అంతర్జాతీయ సహకార సద్భావాలను బలపరుస్తూంది. రెండవది ప్రపంచ పెత్తనం కోసం ప్రాకులాడుతూంది. ఈరెండింటికి ఘర్షణ ఇప్పుడింకా ప్రారంభదశలోనేఉంది.

"ఈ పరిస్థితుల్లో వీటో వ్యతిరేక ప్రచారం జయించినట్లయితే ఏమవుతుంది? అగ్ర రాజ్యాల మధ్య సంయుక్త నిర్ణయాలు కుదరాలన్న సూత్రం మిత్రరాజ్యసమితికి పునాది. వీటో అధికారం రద్దవడంతో ఈ



కామ్రేడ్ స్టాలిన్

రాజ్యసమితి పునాదులనే కూలద్రోసి, విచ్ఛిన్నకర పంథాకు పట్టంగట్ట జూస్తుంది.

"అంతర్జాతీయ సహకారపంథా జయప్రదం కావడానికి సోవియటు శాయశక్తులా కృషి చేస్తుంది. మిత్రరాజ్యసమితి మూల సూత్రాల నది శిరసావహిస్తుంది. అన్ని దేశాలూ వాటిని చిత్తశుద్ధితో, ఏకదీక్షతో అమలు జరపాలని వాంఛిస్తూంది.

శాంతి కాముకులకు దురాక్రమణవాదులకు ఘర్షణ

"కొన్నిదేశాల్లో సామ్రాజ్యవాద దురాక్రమణ వర్గాలు ఎక్కువ ప్రాబల్యం సంపాదించవచ్చునన్న విషయాన్ని మనం గుర్తించాలి. ఈవర్గాలు ప్రపంచంపై పెత్తనం కోసం ఎలాంటి తెంపరితనానికయినా తెగించగలరు. ఈదుష్టశక్తులకు గురువు చర్చిల్. ఇతనికి ఇంగ్లండులోను, అమెరికాలోను అనుచరవర్గంవుంది.

"తమ పేరాస ఫలించడానికి సోవియటు తీరని ప్రతిబంధకంగా ఉందని ఈ వర్గాలు మండిపడుతున్నాయి. కనికొద్దీ పీడ్చ, తమ చేతికింది తుక్కులయిన ప్రపంచ అభివృద్ధి విరోధకుల నందరినీ సోవియటుపైకి వుసి కొల్పుతున్నారు — పునాది కూలిపోతుంది; మిత్రరాజ్యసమితి విచ్ఛిన్నమయిపోతుంది. ఈ దుస్థితిని ఏర్పడనివ్వం. గత యుద్ధంలో మన ప్రజలు రక్తమోడ్చింది, కొత్తదురాక్రమణదారులకు రాజబాట వేయడానికాదు, సుస్థిరశాంతిని నెలకొల్పడానికే !

అగ్రరాజ్యాల ఐక్యత సత్ఫలితాలను చేకూర్చగలదు

"అగ్రరాజ్యాల ఐక్యత, ఈ దురాక్రమణ పిపాసువు అరికట్టి, సత్ఫలితాలను చేకూర్చగలదు.

"కాని, కొన్ని పెద్దరాజ్యాలు వివిధ రూపాల్లో చిన్నరాజ్యాలపై ఒత్తిడి తెస్తున్నాయి. రాయబారాలు జరగవలసినచోట యుద్ధనావలు, విమానాలు ప్రత్యక్షమవుతున్నాయి. పౌన్లు, డాలర్లు, బ్రిటన్, అమెరికాల్లో చలామణికేకాక, ఇతరదేశాలపై ఆయుధాలుగాకూడా ఉపయోగపడుతున్నాయి. అన్నిదేశాలు తమ అడుపాజ్ఞల్లో ఉండాలని కొన్ని ప్రభుత్వాల ఉద్దేశం," అని మాలొటావ్ అన్నాడు.

ఆటం ఆయుధాల విషయమై ఇలా అన్నాడు :

ఆటం ఆయుధాల ఉత్పత్తి, ప్రయోగాలపై "సోవియటు సూచించిన నిషేధాన్ని ఇంకా వాయిదా వేయడం తగదు. ఇలా ఆలస్యం చేసి, ఆటం ఆయుధాల ఉత్పత్తిని కొనసాగనిస్తే ఎలాంటి పరిస్థితు లేర్పడతాయి? ఇంత వరకు ఆటబాంబుపట్టణాలమీదేగాని, సైన్యాలమీద ఉపయోగింపబడలేదు. ఇకముందు ఆటంబాంబుకి ఆటంబాంబుతోనే గాక, అంతకన్నా తీవ్రమైన ఆయుధంతో కూడా జవాబు చెప్పగల పరిస్థితులు దాపురించవచ్చునన్న విషయాన్ని ఎవ్వరూ మరచిపోకూడదు.

"మిత్రరాజ్య ప్రణాళిక ననుసరించి సోవియటు యూనియన్ ఈ దిగువ సూచనలను చేస్తూంది.

(1) సుస్థిర శాంతి, భద్రతల స్థాపన కోసం అన్ని రాజ్యాలూ ఆయుధ బలాలను తగ్గించుకోవడం అవసరం.

(2) పై విషయంలో పరమాణుశక్తిని ఆయుధఉత్పత్తికి వినియోగించడాన్ని నిషేధించాలి.

(3) పై సూచనలను అమలుజరపడానికి తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా జనరల్ అసెంబ్లీ భద్రతా సంఘాన్ని కోరుతూంది.

(4) ఈ విషయంలో అన్ని ప్రభుత్వాలూ భద్రతా సంఘానికి పూర్తి సహకారాన్నివ్వాలి.

"అందరూ ఈ సూచనలను ఆమోదిస్తారని ఆశిస్తున్నాను." అనిచెప్పి మాలొటావ్ ముగించాడు.

మాలొటావ్ ఉపన్యాసంపై విజయలక్ష్మి ప్రశంస

మిత్రరాజ్యసమితి సమావేశంలో మాలొటావ్ చేసిన ఉపన్యాసాన్ని అభినందిస్తూ, శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ఇలా అంది :

"ఇండియాను గురించి మాలొటావ్ అన్నమాటలను మేము హర్షిస్తున్నాం. మా రెండు దేశాలమధ్యగల స్నేహానికి, సద్భావానికి ఈమాటలు నిదర్శనం.

"అనేక అంశాలపై అందరూ లోలోపల అనుకుంటూ, బయటికి చెప్పడానికి సంకోచిస్తున్న విషయాలను మాలొటావ్ ధైర్యంగా వెల్లడించారు. ఆత్మవిశ్వాసంగల దేశం యొక్క ప్రతినిధి ఇచ్చిన ఉపన్యాసంఇది."

సోవియటు యీవిధంగా సుస్థిర ప్రపంచ శాంతికి, ప్రపంచరాజ్య సహకారానికి, వలస దేశ ప్రజాస్వాతంత్ర్యానికి, ఆయుధ విసర్జనకు పాటుబడుతోంది. కాని సోవియటు సాగించే శాంతికృషికి భంగంకలిగే పక్షంలో ఏమరుపాటు కూడదని, కామ్రేడ్ స్టాలిన్ నవంబరు దినోత్సవ సందేశం తెలియజేస్తుంది. కామ్రేడ్ స్టాలిన్ ఇలా సందేశమిచ్చాడు.


అప్రమత్తులై ఉండాలి
కామ్రేడ్ స్టాలిన్ సందేశం


"సోవియటు యూనియన్ మహత్తర శక్తి. సోవియటులోని ఉత్తమ సామాజిక వ్యవస్థా తమకర్తవ్యాల నన్నిటినీ పూర్తి చేయగలదని నాకు దృఢవిశ్వాసం వుంది.

"యుద్ధ ప్రమాదం లేదుగదా అని మనం ప్రమత్తతతో ఉండరాదు.

"అంతర్జాతీయంగా అభివృద్ధినిరోధకులూ శాంతికి శత్రువులూ అయిన యుద్ధప్రేరేపకులు ఎన్ని అడ్డంకులు పెట్టినా, న్యాయమైన ప్రజాతంత్రబద్ధమైన శాంతిని నెలకొల్పవచ్చు. (మిగతా 16 వ పేజీలో)

కలవలపల్లి జమీందారు దౌర్జన్యాలకు
గురిఅయిన సూర్యాపురం రైతులు (ప. గో. జిల్లా)


కోలా సుబ్బారావు


కుంచే నాగన్న


వద్దినేటి రత్తయ్య


వద్దినేడి వెంకన్న


కాపా వీరాస్వామి


ముత్యాల నారాయణ

(15వ పేజీ తరువాయి)

"యుద్ధకాలంలో వలెనే ఇప్పుడూ మన ప్రజలు తమదేశప్రయోజనాలేమిటో గాఢంగా తెలుసుకొన్నారు. సోవియటు ప్రభుత్వానికి తమ మాతృదేశం యెడల నేరవేర్చవలసిన కర్తవ్యం ఏమిటో తెలుసు. అందుచే దానిని మహత్తర శక్తివంతదేశంగా చేయడానికి తన శక్తినంతా ధారవోసింది.

సుస్థిర శాంతికి పాటుబడుతుంది

"ఫాసిజాన్ని నిర్మూలనం చేయుటలో తన మహత్తర చారిత్రక బాధ్యతను నిర్వర్తించింది. సోవియట్ యూనియన్ ఇప్పుడు ప్రపంచరాజ్యాల భద్రతకు వివిధ రాజ్యాలమధ్య చిత్తశుద్ధితోకూడిన పరస్పర సహకారానికి ప్రపంచమంతటా సుస్థిర ప్రజాస్వామ్య శాంతి నెలకొనడం అవసరం, దీనికోసం సోవియటు యూనియన్ కృషి చేస్తుంది.

"శాంతికాముకమైన సోవియటు విదేశాంగ విధానం అన్నిరాజ్యాల సానుభూతి సహకారాలను పొందుతుంది. అందుచేత నంచే. సోవియట్ విదేశాంగనీతి ఆదాశ్యాల శ్రేయస్సుకు అతి ప్రధానమైనది.

"సైనిక నైపుణ్యం సంపాదించాలి"

"సోవియటు సైన్యమూ, సోవియటు నౌకాబలమూ, నిరంతరం సన్నద్ధమై ఉండటంవల్ల మన మాతృ దేశరక్షణకేకాక, ప్రపంచంలో సుస్థిరశాంతికే ఉపయోగపడగలదు.

"మన సైనికులూ, వైమానికులూ, నావికులూ గత యుద్ధంనుండి పాఠాలను నిరంతరం అధ్యయనం చేయాలి. సైనికశాస్త్రంలోని విజయాలను, సైనిక నైపుణ్యాన్ని (టెక్నిక్కు) గమనించాలి. వాటిని యుద్ధంలోను, యుద్ధశిక్షణాకాలంలోను చాతుర్యంతో ఉపయోగించడం వారి విధి.

"సైనికులందరూ సైనిక కళను తీవ్ర కృషిచేసి అభ్యసించాలి. మిలిటరీ క్రమశిక్షణను, సంస్థలను అన్నివిధాలా బలపరచాలి. సైనిక జీవితంలో అత్యవసరమైన సైనిక శాసనాలను గౌరవించాలి.

"సైనిక నాయకులు, రాజకీయ నాయకులు తమ క్రిందివారికి సైనికవిద్య ప్రచారం చేయుటలో ఎక్కువశ్రద్ధ వహించాలి. సోవియటు శౌర్యాన్ని, సైనిక విధులను శిరసా వహించే భావాన్ని, సైనిక కళపట్ల ప్రేమనూ వారిలో పుట్టుకొనేటట్లు చేయాలి.

"పోరాటంలో నిశితతను సంపాదించడానికి ఎడతెగని కృషిచేస్తూ, శాంతికాలంలో రాజకీయంగా సిద్ధమై ఉండటంవల్ల నూరురెట్లు లాభం కల్గుతుందని సోవియటు సైనికులు జ్ఞాపకం ఉంచుకోవాలి"

(13వ పేజీ తరువాయి)

పాలసీతో అధికారంలోకి వచ్చిననాటినుండి, 14 సంవత్సరాలు డెమాక్రటిక్ పార్టీయే ప్రభుత్వపార్టీగా ఉంటూవచ్చింది. వరుసగ నాలుగుసార్లు రూజ్వెల్టే అధ్యక్షుడుగఎన్నుకోబడ్డాడు. నాలుగవ టెరమ్ పూర్తికాక ముందే రూజ్వెల్టు చనిపోయాడు. ట్రూమన్ అధికారంలోకి వచ్చిన నాటినుండి, రూజ్వెల్టు పంథాకు క్రమక్రమంగా పిడ్ల వదులుతూ, పూర్తిగా అభివృద్ధినిరోధక మార్గం త్రొక్కసాగాడు. సోవియట్ వ్యతిరేక పన్నాగాలకు నాయకత్వం వహించాడు. రూజ్వెల్టు అనుచరులందరినీ ఉద్యోగాల్లోంచి తొలగించాడు. అభివృద్ధినిరోధకపార్టీ అయిన రిపబ్లికన్ పార్టీకీతనకూ ఏమీ వ్యత్యాసం లేదనిపించాడు రిపబ్లికన్లు బాగా బలపడ్డానికి అవకాశాలు కలిగించాడు. డ్యూయీ (క్రిందటిసారి రూజ్వెల్టుతో పోటీచేసిన ఓడిపోయాడు.) వాండెంబర్గు మొద లయిన యుద్ధపిపాసులు ఈఎన్నికల్లో పెద్దమెజారిటీతో గెలిచారు.

వాలెస్ వ్యాఖ్యానం

ట్రూమన్ అనుసరిస్తున్న సోవియటు వ్యతిరేకపంథాను ఖండిస్తూ ఇటీవల రాజీనామా నిచ్చిన హెన్రీ వాలెస్ (రూజ్వెల్టు కుడిభుజంగా ఉండేవాడు) ఎన్నికల ఫలితం గురించి ఇలా అన్నాడు: "రిపబ్లికన్ మెజారిటీవున్న కాంగ్రెస్ అమెరికా ఆర్థిక పరిస్థితుల్ని మరింత విషమింపజేస్తుంది. డెమాక్రటిక్ పార్టీకి ఇక రెండే గత్యంతరాలు - చాల అభివృద్ధికరంగా పరిణమించనయినా పరిణమించాలి. లేక, పూర్తిగా శిధిలమవాలి."

Edited, Printed & Published by Katragadda Ragopala rao at the Prajasakti Press, Moghalarajapuram, Bezwada.
Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE